

తలనొప్పి
జలుబు
దగ్గు
జామా
నివారిస్తుంది
తలనొప్పి, దగ్గు, జలుబు. ఎక్కడ బాధగా
వుంటే అక్కడ జామా రబ్ రుద్దండి. వెంటనే
మీకు ఉపశమనం కలుగుతుంది. మెంథాల్,
ఉపశమనం చేకూర్చే తదితర ఔషధులు కలిగి
వున్నందున జామా వెంటనే పనిచేస్తుంది.
ఒంటినొప్పులనుకూడా జామా రబ్ తగ్గిస్తుంది.
జలుబుచేసి ముక్కు దిబ్బడి వేసినపుడు
జామా ఇన్‌హేలర్‌ను పీల్చడంకంటే
మించిన ఉపశమన మార్గంలేదు. వెంటనే
గుణమిచ్చి, ఉచ్ఛ్వాస నిశ్వాసలకు
వీలుగా సడలిస్తుంది.
లక్ష్మీ మార్కు జామా ఆయిల్
ఉత్పత్తిదారులే తయారుచేసినవి.
అమర్‌చంద్ శోభాచంద్
95, నైనప్పనాయక్ వీధి, మద్రాసు-3.
ZAMA RUB
PAIN BALM
ZAMA RUB.
FOR HEADACHE, COLDS, COUGHS, NEURALGIA, SWELLINGS, SPRAINS AND CUTS
MADE IN INDIA
ZAMA
EP M 7


సౌందర్య
పోషణకు
Remy
TALCUM POWDER
రెమి R
పౌడర్
Aykan

సుచిత్ర మాసపత్రిక
బకింగ్‌హామ్ పేట పోస్టు
విజయవాడ—2

విడిప్రతి వెల
75 పైసలు

ఏడాది చందా
9 రూపాయలు

సంపుటి 4
ఫిబ్రవరి 1966
సంచిక 2

మేనేజింగ్ ఎడిటర్
వి వి రాఘవయ్య

ఆర్ట్ ఎడిటర్
బాపు

సంపాదకవర్గం
నందూరి
రామమోహనరావు
ముళ్ళపూడి
వెంకట రమణ
వి ఎ కె రంగారావు
రావి [illegible]

తొలి మాట

జ్యోతి అభిమానులకు ఒక శుభ వార్త—కాదు రెండు

అవి రెండూ కొత్త సంవత్సరంలో మేము తలపెట్టిన కొత్త ఉద్యమాలు మొదటిది — పిల్లల కోసం ఒక మాసపత్రిక రెండవది— ఒక సచిత్ర వార పత్రిక రెండిటికీ విలక్షణమైన రూపు రేఖలు దిద్దాలని మా ప్రయత్నం సాధ్యమైనంత త్వరలో వాటిని ప్రారంభించాలని మా ఆశయం

● ● ●

వచ్చే జ్యోతినుంచి బొమ్మాబొరుసు అనే కొత్త శీర్షిక వెలుగుతుంది

● ● ●

జ్యోతిలో సాధారణంగా రాయని భాస్కరుడు ఈసారి ఓ గిరీశం లెక్చరిచ్చారు (105) అడ్డం తిరిగిన తెలుగు నాటకాల కథకు ఇది నాందీ ప్రస్తావన

● ● ●

ఈసారి చిన్న చిన్న కథల పోటీ ఫలితాలు (17—20—22) మా మటుకు మాకు చాలా తృప్తికరంగా వున్నాయి నేటి విద్యార్థులే భావి రచయిత లన్నారు మరి

ముఖచిత్రం — అన్నపూర్ణావారి ఆత్మగౌరవం లో నాగేశ్వరరావు (మార్పు తేవలసిన మనిషి) కాంచన

వి.వి. రాఘవయ్య



నెహ్రూ నిర్యాణంతో భారత చరిత్రలో ఒక శకం అంతమైంది; మరొక శకం ప్రారంభమైంది.

ఆ శకం ఇంకా ప్రారంభదశలో వుండగానే లాల్ బహదూర్ శాస్త్రి మరణించడం నిజంగా మన దురదృష్టం. వ్యక్తిగతంగా చూస్తేఆయన మరణం మహోజ్జ్వలమైనది. అంత గొప్ప మరణం అతి అరుదుగా మాత్రమే లభిస్తుంది. యుద్ధభూమిలో వీరమరణం చెందడం సామాన్యమే కాని, శాంతికోసం తాను కృషి చేస్తుండగా, అఖిల ప్రపంచం తన కృషిని ప్రశంసిస్తూ తన పైనే దృక్కులు సారించి వున్న చరిత్రాత్మక నిమిషాలలో కన్ను మూయడం గొప్ప విశేషం.



దేశం దృష్టినుంచి చూస్తే నిజంగా దురదృష్టకరమైన మృతి. నెహ్రూ మిగిల్చి వెళ్ళిన వారసత్వం ఎంత మహానాయకునికైనా ఒక సవాలు వంటిది. ప్రధాని పదవికి వచ్చిన తొలినెలలలోనే శ్రీ శాస్త్రి ఆ సవాలుకు ఈడు రాగలడా అని సందేహించడం జరిగింది; మలి నెలలలో ఆయన తప్ప మరొకరు ఆ సవాలును ఎదుర్కొన గలిగేవారా అనిపించే విధంగా ఆయన వ్యక్తిత్వం వికాసం పొందింది.

అదే సందేహం ఈనాడు కొత్త ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి పట్ల కూడా కలగడం సహజం. మొన్నటి రిపబ్లిక్ దినోత్సవంనాటి సందేశంలో రాష్ట్రపతి రాధా కృష్ణన్ చెప్పినట్టు, ఆమె చిన్ననాటినుంచి ఒకానొక ఆదర్శ పూరిత వాతావరణంలో పెరిగింది. గాంధి, నెహ్రూల ఉదాహరణలతో ఆమె ఉత్తేజితురాలైంది. నెహ్రూ కుమార్తెగానేకాక, స్వతంత్ర ప్రతిభ కల వ్యక్తిగా ఆమె తన్నుతాను ... పెక్కు ఘట్టాలు

రు,
ను
దో
లు





పాసోల్లాసం

అభివృద్ధి చిత్రంనిండా
ప్లానింగు క్వాటిట్రిక్సు
దూర భార ధనమానాలలో
జ్యామెటిక్సునిండా జ్యాతకాట్రిక్సు
ఐ ఎస్ ఐ లేబుల్ అడ్డుచేసుకు
చేసేవి క్వాలిట్రిక్సు
నీకు తెలీదు బాపూ
అంతా పాలిట్రిక్సు

ప్రొహిబిషన్ ఉండాలనడంకన్న
ఉండాలనడం పాలిటిక్సు
ధరలు తరగాలనడంకన్న వర్తకుల
గుండెలు కరగాలనడం పాలిటిక్సు
తాష్కెంటుని పొగడడంకన్న
తెగడడం పాలిటిక్సు
నీకు తెలీదు బాపూ
జీవితంనిండా పాలిటిక్సు

శబ్దశాస్త్రంనిండా ఫొనెటిక్సు
సినీ నాటక పరిషత్తులనిండా డ్రామెటిక్సు
సాహితీ పరిషత్తులనిండా పొయెట్రిక్సు
నీకు తెలీదు బాపూ
పార్లమెంటునిండా పాలిటిక్సు

నా మీద ఆరోపణలు పాలిటిక్సు
పార్టీని ప్రధాని రచ్చకెక్కించడం పాలిటిక్సు
అన్న టి టి కె రాజీనామా పాలిటిక్సు
అసలు పాయింటు గల్లంతు. బాపూ
అంతా పాలిటిక్సు

ఎంతకీ పూర్తికాని మన ప్రాజెక్టుల
రాకముందే ధరల్ని పెంచే బడ్జెట్టు
బడ్జెట్టుకు ముందే మాయమయ్యే సిగరెట్టు
నీకు తెలీదు బాపూ అంతా పాలిటిక్సు

తాష్కెంటు శాంతిరథం సాగి
ముందుకు పోకుండా వెనక్కి ...
చేయబోయావా యోగీ।
వర్తమాన మహావీరుడిలా త్యాగీ ?

మెప్పు తేవలసిన మనిషి

ఇసక ఎడారిలో ఓడలు తోలబోవడం నాగేశ్వరరావుకు కొత్తకాదు. అతని ముక్కు దిక్కూచివంటిదేమో, ఎప్పుడూ సవాలు కేసే తిరుగుతుంది. అతని జీవితంలో ప్రతిదీ ఒక సవాలుగానే తటస్థపడుతూ వచ్చింది. రంగస్థలంమీద ఆడవేషాల తీరు తెన్నులు సాధనచేసి బాగా వంటబట్టించుకున్నాక ఒక్కసారిగా సినిమాలో హీరో వేషాలు చేబట్టాడు. చదువూ సంస్కారమూ అనిపించుకున్ననాడు దేవదాసు వంటి పాత్రను సాధించబూనాడు. నాస్తికుడికి భక్తిసంగతేం తెలుస్తుందని అంతా నిరసించిననాడు విప్రనారాయణుడిని ధరించాడు.

ఒకనాడు పెద్దవాళ్ళకి నమస్కారం పెట్టాలన్న సంగతి కూడా తెలియని అలౌకికుడు, ఇవాళ కన్నెత్తి చూస్తే ఒక్క చూపుకు వంద కందార్థాలు పలికించగల అతిలౌక్యుడయ్యాడు. సెకండ్ ఫారంతో చదువాపిన కుర్రాడు, సంస్కారం వల్ల సెనేట్ సభ్యుడయ్యాడు. కాళి

జీకి వె

సంస్థాపకుడయ్య

మేరలు దాటలేడ

ప్రపంచప్రదక్షిణం చేసి వచ్చా

తెలుగు గడ్డమీదికి తెలుగ సినిమాను తీసుకురావడం అతని సరికొత్త ఉద్యమం. రివాజు ప్రకారం దీనిమీదా నిందా తిరస్కారాల ధూళి చెలరేగింది. ఎవరేమన్నా, అందుకుద్యమించిన అందరిలాగే అతనూ పట్టుదలతో కృషిచేశాడు.

ఇంకో ఏడాది తిరిగేసరికి దాదాపు నూరులక్షల రూపాయల సినీనిర్మాణ వ్యయం ఆంధ్రదేశంలో జరుగగా చూడగలడు. 'ఇసుక' మీద ఓడను నడిపిన ఘటికుడు కాగలడు.

ఇన్ని చేసినా వ్యక్తిగా నటుడిగా అతను చేబట్టి సాధించవలసిన ముఖ్యమైన సవాలు అలాగే ఉండిపోయింది. తెలుగు సినిమానౌకను హైదరాబాద్ రేవుకు చేర్చడంతో ఆ బాధ్యత మరీ పెరిగింది. అసలు తెలుగు సినిమా నావ చేరవలసిన రేవు అంతర్జాతీయ చలనచిత్ర

ప్రచురణలు

ప సంపుటం)

మూడు రూపాయలు

క్షమాహతుడు

(అమృత రస ప్రధానమైనగాథ)

రచన : భూపతి

వెల : రెండు రూపాయలు

1966 లో మీ రాశిఫలం

(జన్మ, నామ నక్షత్రాలనుబట్టి స్త్రీ పురుషుల అదృష్టాలను తెలియజేసే ఉత్తమ గ్రంథం)

రచన : మహేష్

వెల : రూపాయి

రోజులలో భూప్రదక్షిణం

మూలం : జూల్స్‌వెర్న్

అనువాదం : ముళ్ళపూడి వెంకటరమణ

సాదా ప్రతి : వెల : రు. 5–00

మేలు ప్రతి : వెల : రు. 6–00

బి. వి. రమణరావు రచనలు

కథలు వెల : రు. 2–50

నాటికలు వెల : రు. 1–50

నేనుచూసిన అమెరికా

రచన : ఎ. నాగేశ్వరరావు

సాదా ప్రతి వెల : రు. 2–50

లైబ్రరీ ఎడిషన్ వెల : రు. 3–50

కూనలమ్మ పదాలు

రచన : ఆరుద్ర

అదనపు పదాలతో–వెల: రు. 1–00

రసికజన మనోభిరామం

(హాస్యసంపుటి) వెల: రు. 1–00

ప్రతులకు :

జ్యోతి బుక్స్, విజయవాడ-2

రాజధాని. దేశ దేశాలమధ్య భారత దేశానికీ ఆంధ్ర దేశానికీ పేరు తెచ్చిపెట్టే యాత్రలు చెయ్యవలసి వుంది. అది జరిపించే బాధ్యత నాగేశ్వరరావు వంటివారిపై చాలా వుంది. అంతే, ఎవార్డులకోసం పాటలూ, కామెడీ లాగేసి పిక్చరు తీసినంత మాత్రాన కళాఖండం కాబోదు. ముందు మన ప్రేక్షకులను ఉత్తేజపరచి ఆపైన ఇతరులను ఆకర్షించే చిత్రాలు రావాలి. పరిశ్రమ ప్రమాణం పెరగాలి. ఈ లక్ష్య సాధనకు నాగేశ్వరరావు ఒకడుగా చేసిన, చేస్తున్న కృషి కనబడదు. గత నాలుగైదేళ్ళుగా అతని ధోరణి అతని చిత్రాల ధోరణి ఒకే మూసలో సాగుతోంది. అతని జీవితంలో వ్యక్తిగా నటుడుగా రెండు దశాబ్దాలుగా వస్తున్న పరిణామాలు గత నాలుగైదేళ్ళుగా కనిపించటం లేదు.

ఈనాడు అతని ఫొటో ఒకటి పదిమందికి చూపిస్తే అది ఏ చిత్రంలోదో ఎవరూ చెప్పలేక పోతున్నారు. అతని చిత్రాలలో ఏదో ఒకదాని నుంచి ఒక దృశ్యం విడదీసి పేరు చెప్పకుండా చూపిస్తే అది ఎందులోదో ఎవరూ చెప్పలేరు. వేషం, ఘట్టం, భాష, భంగిమ, భావ ప్రదర్శనం అన్నీ ఒక మూసలోవే.

అతను సృష్టించిన బాక్సాఫీసూత్రాలు అతనినే బందీచేసి ఆడిస్తున్నా యనిపిస్తూంది. ఇప్పటికీ అతను బాక్సాఫీసూత్రాల పేరిట త్యాగాలుచేసే బంగారు తండ్రి వేషాలె వేస్తున్నాడు. (అంటే విలను వేషాలు,హీరోయిను వేషాలు వెయ్యాలని ఈ వాక్యాలు చెప్పటం లేదు.) తను నటించే కథలలో పాత్రలలో వాతావరణంలో వేషభాషలలో నీత్యవినీతులలో కొత్త గాలి వీచేలా చూడాలి. కథానాయకు డన్నమాటకు సరికొత్త నిర్వచనం ఇవ్వాలి... తను నటించే 100 చిత్రాలలో నిజంగా తనకి నచ్చేవి ఎన్ని అని మరోసారి లెక్కించుకోవాలి. చుట్టూరా ఒక్కసారి దృష్టి సారించి మన చిత్రాలు కూడా మిగతా దేశాల స్థాయి నందుకుందుకి కృషి జరిగేలా చూడాలి.

నటుడుగా తాను ఎక్కిన శిఖరాలకు పరిశ్రమ స్థాయి, ప్రేక్షకుల స్థాయి కూడా పెరిగేటట్టు చూడాలి. తెలుగు ప్రేక్షకులకు ఈ రూపేణా కృతజ్ఞత చూపవలసిన బాధ్యత అతనికి ఉంది. ఇది అందరికీ లభించని గౌరవం; అందరికీ లభించని శిక్ష కూడా. ద ప్రైస్ ఆఫ్ సక్సెస్. స్టార్ సిస్టంకింద నిర్మాతలు నిస్సహాయులు కాబట్టి బాధ్యత స్టార్‌లు తీసుకోక తప్పదు. ఈ ప్రయత్నం—ఏడాదికి రెండు చిత్రాలలో జరిగినా చాలు; ప్రగతి మార్గంలో ముందు అడుగువేసిన వాడవుతాడు; వెయ్యకపోయినా, ఓడినా హీరోవే అవుతాడు.

— **సవ్యసాచి**

కొత్తిమీర కట్ట

క్లాసులో లెక్చరరు చెప్పుకు పోతున్న జోలపాట వింటూనే, రంగురంగుల కలల అలల్లో తేలుతూ మునుగుతూ, జోగుతూ తూగుతున్న రామ్మూర్తి ఉలిక్కిపడి పైకి తేలాడు.

రామ్మూర్తి తన బంగారు కలల్లోంచి పైకి తేలాడూ అంటే దానికో బలవత్తరమైన కారణముంది. కళ్ళు పెద్దవి చేసుకుని మరీ చూశాడు. అవతలివైపు మూడో బెంచీలో ఎడంనుంచి మూడో సీట్లో కూర్చున్న ఆ కొత్తిమీరకట్ట జడ అమ్మాయి తననే చూస్తోంది కనుకొలకుల్లోంచి, వాడిగా, ఓరగా.

క్లాసయిపోయింది. రామ్మూర్తి రూం దారి పట్టాడు. వెనకాలనుంచి ఎవరిదో కోకిలారావం "ఏమండీ" అని విన్పించింది. తనను కాదులెమ్మనుకొని వెళ్ళిపోతున్నాడు. మళ్ళీ వినిపించింది ఇంకొంచెం దగ్గరగా, దగ్గరగా వెనక్కి తిరిగి చూశాడు ఆ అమ్మాయే "కంగ్రాచులేషన్స్" ఎందుకో వెంటనే అర్థంకాని రామ్మూర్తి ఆశ్చర్యపోయాడు బోల్డు "చాలా బాగా వ్రాశారండి మేగజైనులో అన్ని కథలకన్నా, మీ కథే నచ్చింది నాకు" అందా కోకిల కాని నల్లగాలేదు మంచి ఛాయే కాటుకపెట్టిన కళ్ళు, ఆ కళ్ళనిండా ఆశ్చర్యమే, వెలుగే.

"చాలాథాంక్స్" అనిఏదోఅర్జెంటు పనున్నట్టు "వస్తానండీ" అని చెప్పి ముందుకెళ్ళిపోయాడు ఎన్నడూ అమ్మాయిలతో — అందులో కళ్ళల్లో ఇంత వెలుగున్న అమ్మాయిలతో — మాట్లాడి ఎఱుగని రామ్మూర్తి.

కాని ఆమె అతన్ని వదల్లేదు.



ప్రథమ బహుమతి. రూ. 50

పి. భవానీ వరప్రసాద్

మెడిసిన్ (రెండవ సంవత్సరం)
ఆంధ్రా మెడికల్ కాలేజీ,
విశాఖపట్నం-2

"ఏమండీ" అని పిలిచి "ఇవాళ మా ఇంటికి వస్తారా?... సరదాగా కాఫీ త్రాగుదాం".

మొదట కొంచెం నివ్వెఱ పోయినా తర్వాత తలాగేసని ఒప్పేసుకున్నాడు. ఆమె అతన్ని చాలాసందులు తిప్పి కటకటాలున్న ఓ ఇంట్లోకి తీసుకెళ్ళింది. వరండా ప్రక్కనున్న ఓ ప్రక్క రూంలోకి తీసుకెళ్ళి కుర్చీ చూపించింది. అతను కూర్చున్నాడు. ఆమె అతని ఎదురుగా ఓ కుర్చీలాక్కొని కూర్చుంది. ఆమె నెమ్మదిగా ప్రసంగంలోకి దిగింది. కాలేజీ వ్యవహారాలు చర్చించింది. కళ్ళల్లో కళ్ళు పెట్టి మాట్లాడింది. మాట్లాడ్డం మానేసి అదోలా చూసింది. అతను ఇదయి పోయాడు. ఆమె చిర్నగవు చిందించింది. అతనూ చిందించాడు. ఆమె "వుండండి, కాఫీ తెస్తాను" అంటూ లోపల కెళ్ళింది. అతను ఊపిరి పీల్చుకున్నాడు.

టేబులుమీద గడియారం టిక్ టిక్ మంటోంది. ఇంతలో అడుగుల చప్పుడు వినిపిస్తే తలుపు కేసి చూశాడు. ఎంబాసిడర్ బూటు మెత్తగా చప్పుడు చేసుకుంటూ, వస్తోంది. వాటిల్లో గొట్టం ప్యాంటులో ఇమిడిపోయిన కాళ్ళు బలిష్ఠంగా ఉన్నాయి. మడతలు పెట్టిన ఫ్లాక్ చేతుల్లోంచి కండలు పొంగినట్లు కన్పిస్తున్నాయి. పేనిన కొబ్బరి తాడు లాంటి మీసంమీద ముక్కు పొడుగ్గా ఉంది. చూపులు తీక్షణంగా ఉండటంతో అతని కళ్ళల్లోకి చూడబోయిన రామ్మూర్తి, చూడలేక కళ్ళు దించేసుకున్నాడు. అతను రామ్మూర్తివైపు, తీక్షణంగా చూసి కాళ్ళు బల్లమీద పెట్టి, కుర్చీలో కూర్చుని,

"వాట్ మిష్టర్ ... ఏం చేస్తున్నావ్" అని అడిగాడు బొంగురు కంఠంతో.

"బి య్యే సీ." తడబడకుండా చెబుదామని చాలా ప్రయత్నం చేశాడు.

"బియ్యేసియా" అన్నాడు ఒత్తి పలుకుతూ. "ఆస్తి ఎంతుందేవిటి?" అతని వైపు చూడకుండానే అడిగాడు.

"ఏమీ లేదండి"

అతను నిశ్శబ్దంగా ఆ కుర్చీలోంచి లేచి రామ్మూర్తి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. హేళనగా నవ్వుతూ "నువ్వు బికారివి ... షావుకారి బిడ్డనే వల్లో వేసుకుందామని వచ్చావ్?... మిష్టర్. దురాశ దుఃఖానికిచేటు."

రామ్మూర్తికి కోపం వచ్చింది.

"ఇంతకీ మీ రెవరు?" అడిగాడు మర్యాదగానే.

అతని కళ్ళు ఎఱ్ఱబడ్డాయి. రామ్మూర్తిని కుర్చీలోంచి లేపి "స్కౌండ్రల్ ... నన్నే నువ్వెవరవని అడగటానికి నీకెన్ని గుండెల్రా" అన్నాడు మొహంలో మొహంపెట్టి. రామ్మూర్తినోట మాట రాలేదు. అతని గుండెల్లో చౌక్కా యమయాతన పడుతోంది "గెటౌట్ ... మళ్ళీ మా చెల్లాయి మొహం చూశావంటే ..." తోసేశాడు తలుపువైపు. తల తలుపుకి కొట్టుకుంది. స్పృహ తప్పింది. —గొల్లుమను నవ్వులు వినిపించాయి. స్పృహ వచ్చింది రామ్మూర్తికి.

"మిష్టర్ రామ్మూర్తీ —వాట్ ఆర్ యూ డూయింగ్?" మైండ్, ప్లీజ్ నాట్ యువర్ హోం టు స్లీప్, సిట్డౌన్" అంటూ కేకలేశాడు లెక్చరరు. బేల ముఖం వేసుకుని కూర్చున్నాడు రామ్మూర్తి.

క్లాసయిపోయింది. రామ్మూర్తికి బాధగా వుంది. తను ఎంత సిగ్గుపోతు ఐనమాత్రం క్లాసులో అమ్మాయిలముందు ఇన్సల్టు చేస్తాడా? అంతా వెళ్ళిపోయారు. రామ్మూర్తి కూచాడు నీరసంగా. ఇంతలో క్లాసుమేటు సంధ్య



నవ్వుతూ అతన్ని సమీపించి కంగ్రాచ్యులేషన్స్ "రామ్మూర్తిగారూ!" అంది. ఈసారి రామ్మూర్తి నిజంగా ఆశ్చర్యపోయాడు. "చాలా బాగా వ్రాశారండీ. మేగజైనులో అన్ని కథలకన్నా మీదే నచ్చింది నాకు." కోకిల్లా ఉంది కంఠస్వరం. వెంటనే అతను ఆమె వెనకవైపు జడకేసి చూశాడు అనుమానంగా. కొత్తిమీరకట్టు జడ! రామ్మూర్తికి మతిపోయింది. "మీ నోట్సు ఓసారి ఇస్తారా?"

తన పుస్తకాల్లోంచి నోట్సుతీసి ఇవ్వబోయి మళ్ళీ చెయ్యి లాగేసుకున్నాడు వెనక్కి. సంధ్య భ్రుకుటి ముడిపడింది. రామ్మూర్తి మెల్లిగా అడిగాడు.

"మీ కెవరైనా అన్నయ్య ఉన్నాడా?"

□□□

విశాలి

"మనకు విశాల దృక్పథం కావాలి" అన్నాడు విశ్వనాథం.

విశాల మౌనంగా వింటున్నది.

విశాల, విశ్వనాథంల దాంపత్యానికి వయస్సు నెల నిండ లేదు. పెళ్ళైన తరువాత హనీమూన్‌కు నైనిటాల్ వచ్చారు వాళ్ళిద్దరూ. పగలంతా అటూ యిటూ తిరిగి తిరిగి హొటలు రూమ్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారు.

"నేను దంపతుల మనస్తత్వాల గురించి, ప్రత్యేకంగా ఒక గ్రంథం వ్రాయాలనుకుంటున్నాను. దానికి నీ సహాయం కావాలి నాకు" అన్నాడు విశ్వనాథం.


అతను మనస్తత్వ శాస్త్రంలో డాక్టరు. డాక్టరేట్ లభించిన వెంటనే వివాహం చేసుకున్నాడు.

"నా సహాయమా?" అంది విశాల.

"అవును విశాలా! గ్రంథ రచనకు ముందు మన యిద్దరి జీవితాల పైనే పరిశోధన సాగించాలనుకుంటున్నాను. దానికి నీ సహాయం చాలా అవసరం. మనమధ్య రహస్యాలనేవి ఉండకూడదు, మన గత జీవితంలోని ముఖ్య విషయాలు ఒకరి కొకరు చెప్పుకొందాం. సహృదయంతో సరిగ్గా మనం అర్థం చేసుకుని కలసి మెలసి జీవనయాత్ర సాగించాలి మన జీవితంలో అభిప్రాయ భేదాలకే తావుండకూడదు" అన్నాడు విశ్వనాథం.

"అయితే, ముందు మీరే చెప్పండి. తరువాత నేను కూడా చెబుతాను" జవాబిచ్చింది విశాల. విశ్వనాథం చెప్పడం ప్రారంభించాడు.

"నేను కాలేజీలో చదివే



ద్వితీయ బహుమతి రూ. 25

వై. శేషతల్పశాయి

బి. ఎస్. సి (ఫైనల్)

న్యూ సైన్సు కాలేజీ, హైదరాబాద్

రోజులలో శకుంతలతో నాకు పరిచయమైంది. ఎట్లా పరిచయమైందో నాకు గుర్తులేదు. చాల చిత్రంగా మేము దగ్గరై పోయాం. ఇంటర్మీడియేట్ తరువాత ఆమె మెడిసిన్ చదివేందుకు ఆ ఊరు విడిచిపెట్టింది. ఆ క్షణంనించి ఒకటి రెండు నెలలు నేను పడ్డ వ్యథ వర్ణించలేను. కనీసం నాతో తన ప్రయాణాన్ని గురించి కూడా చెప్పకుండా, నిర్దాక్షిణ్యంగా నన్ను విడిచి వెళ్ళిపోయింది. ఇప్పుడు శకుంతల ఏమైందో నాకు తెలీదు. ఆ మధ్య ఎవరో అన్నారు — ఆమె చచ్చిపోయిందని. నవ్వుకుని, అనుకున్నాను—నేను చాలా అదృష్టవంతుడనని ... ఆమెకు మరీ దగ్గర కానందుకూ, నిన్ను పెళ్ళి చేసుకున్నందుకూ."


ముగించాడు విశ్వనాథం. ఆమె తనలో తను నవ్వుకుంది.

"మరి ... నువ్వు ... చెప్పు ..." అన్నాడు విశ్వనాథం. విశాల మెల్లగా మొదలుపెట్టింది.

"ఎంతో అందంగా ఉండేవారాయన..." కాసేపు ఆగింది విశాల.

విశ్వనాథం అన్నాడు—" చెప్పు విశాలా! నేనేం పరాయివాడినా? నీవు చెప్పేదంతా మంచి మనసుతో అర్థం చేసుకుంటా."

విశాల చెప్పసాగింది—"ఆయనకు నేనంటే ఎంతో అభిమానం, ప్రేమానూ. ఒక్క గంటసేపైనా నన్ను వదలి వుండలేక పోయేవారు. నాకూ అట్లానే ఉండేది. రోజూ నా కోసం పండ్లూ, పూలూ తెచ్చేవారు. సాయంకాలంపూట బజారుకో బీచ్‌కో తీసుకు వెడుతూండేవారు. ఆయన నన్ను కౌగలించుకుని, ప్రేమగా మాట్లాడుతూ ఉంటే, నాకెంతో సంతోషంగా ఉండేది" ఇంకా చెబుతూనే ఉంది. విశ్వనాథం ఛాతీ ఉప్పొంగుతోంది. కళ్ళు ఎర్రబడసాగాయి. వేడిగాలి ముక్కుపుటాల నుండి వెలువడుతోంది. విశాల ఈ లక్షణాలన్నీ గమనించికూడా చెప్పడం ఆపుచేయలేదు. 'ఒకసారి ఆయనను విడిచి పదిరోజులుండవలసి వచ్చింది. అప్పుడు నేనెంత బాధపడ్డానో! రోజూ కలలూ, కలవరింతలూను. పదిరోజుల తరువాత తిరిగివచ్చి, ఆయన కూడా అదే మాట అన్నారు...'



చింత తోపు

పైరుగాలి చల్లగా వీస్తోంది. ఐదు గంటలు కావస్తున్నట్టుంది. పశువులు ఇండ్లకి తిరిగి వెడుతున్నాయి. పాటలు పాడుకుంటూ పోతున్నారు చిన్నపిల్లలు. ఆ దుమ్ము, ఆ కొండ శోభ, ఆ పల్లెకు వింత సోయగాన్ని ప్రసాదిస్తున్నాయి. ఒంటరిగా నడుస్తున్నాను. ఆ పల్లెకి వచ్చి రెండు రోజులయింది. వెంకట్రావు చిన్ననాటి స్నేహితుడు. చూసి పోదామని వస్తే వాడికి ఆరు మైళ్ళ దూరంలోవున్న పట్నంలో అర్జెంటు పనివుండి వెళ్ళాడు.

ఆరోజు సాయంత్రం నా కేమీ తోచక నా స్నేహితుడి పాలేరు రంగణ్ణి వెంటబెట్టుకుని, పొలాలు దాటి చింతచెట్టు వున్న రోడ్డుపై నడిచాను. చెట్టు క్రింద చింతకాయలు ఏరుకుంటూ ఇద్దరు పిల్లలు మాట్లాడుకుంటున్నారు. 'రాత్రిపూట అయితే అవి మనుష్యులను కొరుక్కుతింటాయట.' ఒకడు రెండవవాడికి వర్ణించి చెప్పుతున్నాడు. వాళ్ళ అమాయ

ద్వితీయ బహుమతి రూ. 25

అబ్బూరి విశ్వేశ్వరరావు
రీజనల్ ఇంజనీరింగ్ కాలేజీ,
కాజీపేట పోస్టు, వరంగల్ జిల్లా.

'విశాలా!' అరిచాడు విశ్వనాథం. విశాల అపుజేసింది.

'నువ్వు నన్ను మోసం జేశావు. ఎవరికో మనసిచ్చి, నన్ను పెళ్ళి చేసుకున్నావు. నిన్ను ... నిన్ను ఏం చేసినా పాపం లేదు...' మాటలు రావడం లేదతనికి.

ఆమె మాట్లాడలేదు. మనస్తత్వశాస్త్రంలో డాక్టరేట్ పొందిన అతని అభిప్రాయ వైపరీత్యానికి లోలోపల నవ్వుకుని,

'మీరు నన్ను పూర్తిగా చెప్పనివ్వడంలేదు. జీవితంలో ప్రేమ గొడవలూ, ప్రణయం గొడవలూ తప్ప మరి దేనికీ ప్రాముఖ్యం లేదా? డియర్ డాక్టర్! నన్ను తన ప్రాణంకంటె అధికంగా అభిమానించి, అనురాగం అందించిన ఆయన మరెవ్వరో కాదు — మా తాతయ్య. ఆయన యిప్పుడు లేరు. కారు యాక్సిడెంట్‌లో పోయారు'

□□□

కర్తవ్యానికి ఏం చెయ్యాలో తెలియక గట్టిగానే నవ్వేశాను. పిల్లలిద్దరూ బిత్తరపోయి చూశారు. ప్రక్కనే అడుగుల చప్పుడు వినిపించింది. తల ఎత్తి చూస్తే, ఒక యువకుడు [illegible] [illegible], [illegible] అలని డ్రెస్సుతో [illegible] చూసి చిరునవ్వు నవ్వాడు ఎవరో తెలియకపోయినా బాగుండదని నవ్వాను.

"ఎందుకంత గట్టిగా నవ్వుతున్నారు ?"

"వాళ్ళ అమాయకత్వానికి."

అతను మరోసారి చిరునవ్వు నవ్వాడు అందులో 'వాళ్ళ అమాయకత్వం కాదు, నీ మూర్ఖత్వం' అని ఎత్తి పొడిచినట్లనిపించింది.

"అయితే నా అనుభవం ఒకటి వినండి." అంటూ మొదలు పెట్టాడు. నేను శ్రోతగా మిగిలి ఊకొడ్తున్నాను.

"మిత్రుడి వివాహం [illegible] పత్రంలో. ఆ పత్రం ఏమిటో నాకు తెలియదు. శుభలేఖలో 'వారి' అని నా కోసం అన్నట్లుగా రాశారు. అది కాక నా మిత్రుడు స్వయంగా వారిని [illegible] తెల్పుతూ, నన్ను [illegible] రావాలన్నాడు సరే. ఒక [illegible] మధ్యాహ్నం రెండు గంటలకి రేడియో, ఫ్లాస్కులో కాఫీ తీసుకుని కారులో బయలుదేరాను. కొంత దూరం వెళ్ళేసరికి, రోడ్డుకు సమీపంగా, ఒక భార్యా, భర్త, ఒక కుర్రవాడు కనిపించారు."

అతడు కథ చెప్పడం ఆపాడు. అప్పటికి చాలా దూరం నడచి చెరువు గట్టుమీదికి చేరుకున్నాం. అతడు కర్చీఫ్ తీసి, పరచి దానిమీద కూర్చున్నాడు. 'కూర్చోండి.' క్రింద కూలబడ్డాను, మళ్ళీ మొదలు పెట్టాడు...

"ఆ కుర్రవాణ్ణి భర్త ఎత్తుకుని వున్నాడు. వాళ్ళు కారును చెయ్యెత్తి ఆపారు. గబగబా అతడు కారును చుట్టి నా దగ్గరకి వచ్చి అన్నాడు: "బాబూ! మీకు పుణ్యం వుంటుంది. మమ్మల్ని నాగపూడి ఆస్పత్రి దగ్గర విడవండి. కుర్రవాడికి ఒళ్ళు కాలే జ్వరం. మూసిన కన్ను తెరవడం లేదు. మీకు పుణ్యం వుంటుంది.' బ్యాక్ డోరు తెరిచాను. వారు ముగ్గురూ లోపల సర్దుకున్నారు. తలుపు వేసి, లాక్ చేశాను. 'బాబుకు చల్లగ వుండాల' ఆమె



అంది. నవ్వుతున్నాను. వాళ్లు ఏదో మాట్లాడు కుంటున్నారు. కారు స్పీడు పెంచ్చాను. గంటలో నాగపూడి చేరాము.

నాగపూడి ఆస్పత్రిలోనికి డైరెక్ట్‌గా కారు పోనిచ్చాను. 'దిగండి' అని వెనకకి తిరిగాను. నా కళ్ళు నేను నమ్మలేకపోయాను. ఇది కలా! నిజమా? నాకు పిచ్చెత్తి పోయింది!'

అతడు కథ ఆపాడు. ఆ ఉత్కంఠతో ఆతని చేతులు కుదుపుతూ ఆత్రుతతో అడిగాను. అంతకంటే ఏరిచా నంటె బాగుంటుందేమో! 'ఏమి కనిపించింది మీకు?'

'బ్యాక్ సీటులో వాళ్ళెవరూ లేరు.' అతి తాపీగా సమాధానం ఇచ్చాడతను. 'తరువాత అక్కడ వాళ్ళు చెప్పారు. అక్కడొక లారీ డ్రైవరు ఉండేవాడని, ఒకనాడు భార్యాపిల్లలను ఆస్పత్రికి తీసుకెళ్తూ దారిలో లారీ ప్రమాదానికి గురియై అందరూ మరణించారనీనూ'. 'ఇప్పుడు ఏమంటారు మీరు?' అన్నట్లుగా చూశాడతను.

బాగా చీకటిపడి పోయింది. తిరిగి వచ్చేస్తున్నాం చెరువుగట్టు మీద. ఒక ప్రక్కలోతైన చెరువు, రెండవ ప్రక్క జమీందారుగారి ఇరవై అడుగుల యెత్తైన, నునుపైన ప్రహారి గోడ. ఆ అజ్ఞాత వ్యక్తి ఇంకా ఏవో కథలు చెబుతున్నాడు. ఉన్నట్టుండి అతని మాటలు ఆగిపోయినాయి. తల త్రిప్పేసరికి చుట్టూరా ఎవరూ లేరు. అతడు ఎక్కడికి పోయాడు? ఎటు వెళ్ళాలన్నా దారిలేదే. ముందు వెనకలకి తిప్పాను. నకాల రంగడు వస్తున్నాడు. ఇంతవరకు నాతో గడిపింది — నరాలు బిగుసుకుపోయి నాయి. రంగడు దగ్గరకు వచ్చి ప్రశ్నించాడు.

'మీలో మీరు చెతులు త్రిప్పు తున్నారేమిటి బాబూ?'

'ఇప్పటివరకు నా ప్రక్కన నడిచిన వ్యక్తి ఏడి రంగడూ?' నేను వికెత్తరపోతూ అడిగాను.

ఆశ్చర్యపోయాడు రంగడు. 'మీరు ఒంటరిగా చెరువుగట్టు కెళ్ళడం, మీలో మీరు చేతులు త్రిప్పు కోడం, అన్నీ నేను, నా స్నేహితుడు పీరాసామీ చూస్తూనేఉన్నాం.'

'పీరాసామి ఎవరూ?' ప్రశ్నించాను.

'ఇదుగో' వెనక్కి తిరిగిన రంగడు కెవ్వుమని పోయాడు. నేనుచూపు మేరలో మేమిద్దరమే.

ఒక గంట తరువాత తెలిసింది. ఊరుగూరు వెళ్ళిన రంగడి స్నేహితుడు పీరాసామి వురిపోసు కుని చనిపోయి అప్పటికే పదిహేను రోజులయిందని.

□□□

కలెక్టర్ క్షమించు

ఆదివిష్ణు

"నమస్కారం గురూగారూ! బాగా చదువుతున్నారా? మీకేం లేండి. నిక్షేపంలాంటి వాళ్ళు. చదివి బాగుపడవలసిన వాళ్ళు. ఐయేయస్‌కి వెళ్ళవలసిన వాళ్ళూను. గుడ్‌లక్. వొస్తాను" ఎక్కణ్ణుంచి వచ్చేడో వచ్చి రావడంతోటే బడబడా నాలుగూ అనేసి మళ్ళా తన కేమీ పట్టనట్టు యీలపాట పాడు కుంటూ వెళ్ళిపోయేడు గుర్నాథం.

ప్రసాదం మనసు చివుక్కు మన్నది. మళ్ళీ పుస్తకంలో చూపు నిలిపేడు.

కాలేజీలో చేరిన మొదటి రోజుల్లో యీ కోరిక పుట్టింది. రానురానూ అంతరాంతరాల్లో పురుగులా తిరగడం మూలంగా చివరికి తప్పదన్నట్టూ యీ ఆఖరి సంవత్సరంలో పదిమంది ఎదటా చెప్పేడు. మరోప్పుడైతే అదీ చెప్పకపోను.

'హాస్టల్ డే'—

వెయ్యిదీపాలు వెలుగుతున్నాయి. దీపాలకాంతిలో ఆవరణంతా కన్నుల పండువగా వుంది. వేదికమీద కాలేజీ ప్రిన్సిపాల్, వారి కుడిపక్క హాస్టలు వార్డెన్, ఎడంపక్క ఆ వూరి ఛైర్మను. 'భవిష్యత్తులో నేను' అనే విషయం మీద హాస్టలు సభ్యులు ఒకరి తర్వాత మరొకరు మాటాడేస్తున్నారు. కార్యక్రమం పూర్తవుతుందనగా, హాస్టల్ సెక్రటరీ రామిరెడ్డి ప్రసాదం పేరు ఎనౌన్సు చేసేడు.

చిరుచెమటలు పోశాయి. కాళ్ళు వణికాయి. తడబడుతూ వేదిక మీదికి వెళ్ళేడు. మైకుముందు నించున్న తర్వాత కలిగిన ఉత్సాహం తననింత అభాను చేయిస్తోంది.

'ప్రసాదంగారు కలక్టర్రోయ్!'

పుస్తకాలపురుగు, బుద్ధావతారం, చంటిబాబు—ఈ మొదలైన ముద్దు పేర్లు మాలవన్నట్టు, ఆనాటినుంచీ యీ పిలుపుతో అలంకరిస్తున్నారు వీళ్ళందరూ.

ఏజానికి దిన్నో తప్పేముందసలు? చదువుకుని, చేసిన కృషితో బాగు పడి కలక్టరవడం తప్పా? ఈ ఉద్దేశాన్ని గుండెల్లో దాచుకోడం నేరమా? సమయం వచ్చింది గనక, నేను ఫలానా, నా జాతకం ఫలానా అని చెప్పుకోవడం తప్పడం అయిపోయింది.

కాదని చాలా తడవలు అనుకున్నాడు ప్రసాదం. కాని, వీళ్ళ నోళ్ళు మంచివికావు. ఒకమనిషి అభిప్రాయానికి విలువనిచ్చే సివిలిజేషను

వీళ్ళకి చాలాదూరం. అందుచేత రోజుకో మారైనా పలకరిస్తోన్న తనకు పరాయివాళ్ళ దృష్టిలో ఒకానొక హాస్యగాడి వింత కోరికలా నిలిచిపోయిందే నని బాధ. అప్పుడు మనస్సంతా సిగ్గుతో నిండుకుపోతుంది. ఇదోరకమైన శిక్ష.

ప్రసాదానికి వాళ్ళ డాడీ గుర్తుకొచ్చేరు. వారి హోదాలాటి నల్లటి ఫియట్ కారు గుర్తుకొచ్చింది. వారి పరువు మర్యాదల్లాంటి అందమైన 'శాంతిభవనం' గుర్తుకొచ్చింది. వారి మంచి మనసులాటి ఏభయి ఎకరాల మాగాణి గుర్తుకొచ్చింది. వారి పూర్వజన్మ సుకృతానికి సాక్ష్యాలైన డాక్టర్లూ, లాయరన్నయ్యలు గుర్తుకొచ్చేరు.

ఆ కుటుంబంలోని సభ్యుడు తను. తనకి కలక్టరవ్వాలనే ఆశ వుండటంలో అతిశయోక్తి లేదు. అనుకోకూడదు గానీ - తనని యాగీ చేస్తోన్న వాళ్ళల్లో ఏ కొందరైనా జీవిత పర్యంతం తనకి బానిసలుగా ఏర్పాటు చేసుకోగల తాహతు తనది. తన అంతస్థేమిటో తెలీని ఫూల్స్.

మనసార నమ్ముకుంటోన్న లక్ష్యం ఐ యే యస్. ఊహాప్రపంచంలో, ఉద్దేశాల లిస్టులో చెరగని ముద్ర కలక్టరుగిరి. ఇది తననుంచి దూరం కావడంకల్ల. తన ప్రయోజకత్వం ఏమిటో తెలిసిన నాడు ఈ గుర్నాధమే తనదగ్గర దిక్కుమాలిన గుమాస్తా ఉద్యోగం చేయగలడు.

అందర్తో తన అంతస్థును గురించి చెప్పేయాలన్న ఉద్రేకం కలుగుతుంది ఒక్కోనాడు. కానీ, అర్థం చేసుకోలేని అనాగరికులముందు, తన మూలంగా - ఉచ్చమైన తన కుటుంబం గూడా చిన్నచూపు చూడ్డం ఇష్టంలేదు. అందుచేతనే కోపాన్ని దిగమింగుకుని, కసిని కప్పిపెట్టుకుని బతుకుతున్నాడు.

పుస్తకం మూసేడు. లేచినుంచుని గదివెలుపు వెళ్ళబోయేడు రామిరెడ్డి పిలుపుతో ఆగి నుంచుని పలుకరింపుగా అలవోకగానవ్వేడు రామిరెడ్డి గబగబా ప్రసాదం దగ్గరకొచ్చి అతని చేతిని లాక్కుంటూ,

"కంగ్రాచ్యులేషన్స్" అన్నాడు.

"ఎందుకనిట?"

"కొట్టేవ్. ఎస్సే కాంపిటేషన్లో ఫస్టొచ్చేవ్."

"థేంక్స్."

"పద. కేంటీన్ లో కాఫీ పోయించు. జీవుడు అల్లాడి పోతున్నా నీకోసం వెతకడం మానలేదు."

"వొద్దు. ఇవాళ నా మనసు బాగోలేదు."

"వెధవ మనసు. తీసిపారేయ్. శుభవార్త తెచ్చిన దూతకి ఆకలెక్కువ, సంప్రదాయాన్ని మర్డర్ చేయకు. ముందునడు."

"నే రానులే రెడ్డీ నువ్వెళ్ళు."

"అందుచేతనే నిన్నందరూ అంటున్నారు—సంఘజీవివి కావూ అవటాని. నా చేతగూడా ఆ మాటనిపించకు ప్రసాదం!"

రామిరెడ్డితోపాటు కేంటీన్లోకి అడుగుపెట్టేడు ప్రసాదం. నాలుగైదు తలలు అటూ ఇటూ వెతికి వేటాడి మరో రెండుమూడు తలల్ని పలకరించి కలిసికట్టుగా మొత్తం కిసుక్కున నవ్వేశాయి. ప్రసాదం ఈ రకమైన వాతావరణానికి అలవాటు పడుతున్న వాడు గనుక అంతగా పట్టించుకోలేదు. వాళ్ళందరికీ దూరంగా ఓ మూల కూర్చున్నారు. రామిరెడ్డి మరో యిద్దర్ని వెంటబెట్టుకొని ప్రసాదం దగ్గర కూర్చున్నాడు.

నలుగురికీ స్వీట్సు ఆర్డరిచ్చేడు రామిరెడ్డి. పుస్తకంలో తలదూర్చేడు ప్రసాదం.

"ఏం రెడ్డీ! శకుంతలమ్మ రాత్రి సినీమాకొచ్చిందట. నిజమా?" కొత్తగా వొచ్చిన యిద్దర్లో కేషియన్ అడిగేడు.

"ఎవరు చెప్పింది? వేణూనా?"

"మాకు తెలుసులే గురూ!" ఆడపిల్ల గొంతున్న పిల్లాడు కులుకుతూ అన్నాడు.

"నాన్సెన్స్! ఎవరూ చెప్పంది మీకెల్లా తెలుస్తుందోయ్?" రామిరెడ్డి విసుక్కున్నాడు.

"తెలుస్తుంతే!" కేషియన్ స్వీటు నోట్లో పెట్టుకుని ముద్దుగా చెప్పేడు.

"నా! సినిమాకేకాదు. వెన్నెల్లో నాతోపాటు తిరుగుతుంది. సముద్రంలో నా సరసన నించుని స్నానం చేస్తుంది. శకుంతల కళ్ళంటే నాకెంతో యిష్టం ఇలా అన్నానని వేణూతో చెప్పు. చెప్పి, వాడూ, నువ్వూ యిద్దరూ ఒడుద్దాయిలని ఒప్పుకోండి. ఒప్పుకుని జాయింటుగా ఉపోసుకు చావండి. తెలిసిందా? నెక్స్ట్......మీ రిద్దరూ తింటూన్న స్వీట్సుగ్గానీ, తాగబోయే కాఫీగ్గానీ బిల్లు ప్రసాదం యిస్తాడు. మీ దగ్గర డబ్బుల్లేకపోతే మీ చొక్కాలు తాకట్టు పెట్టండి. అండర్స్టాండ్! కమాన్ ప్రసాద్! మనం ఆ చివరి ఛైర్ కి పోదాం. థర్టీక్రీచర్స్!" ప్రసాదం చేయి పట్టుకుని అవతలికి లాక్కుపోయేడు రామిరెడ్డి.

నల్లుల్లాగా బల్లకి అతుక్కుపోయేరు మిగిలిపోయిన ఆ యిద్దరూను!

కాఫీతాగి బైటకొచ్చేసిం తర్వాత రామిరెడ్డితో ప్రసాదం బిక్క బిక్కుమంటూ అన్నాడు.

"నువ్వు గనక సరిపోయింది. ఒక్కరూ మరి నోరెత్తేరు. అదే నేనైతే కలబడి కొట్టేవాణ్ణి."

'పోనీ ప్రసాదం! వాళ్ళతో మనకేం పనిగానీ, ఎలా చదువు తున్నావ్? మూణ్నెళ్ళలో పరీక్ష లున్నాయి మరి.'

'... ... ...'

'డిబేట్ — కాంపిటీషన్లో ఫస్ట్ సెకండ్.'

'చెప్పావ్ కాదే? హార్టీ కంగ్రాచ్యులేషన్స్. బలేవాడివి. ఇంతమంచి విషయాన్నింత సేపు దాచావా? అయినా పొరపాటు నాదేలే. సెకండెవరొచ్చారో కూడా అడగలేదు — ఎంతకీ నా గురించి నేనే ఆలోచించుకుంటు న్నాను. క్షమించు.'

'ఒట్టే ఎంతపాఠం చదివేవోయ్ ప్రసాదం? ఇదంతా నా కోసమే?'


'అదికాదు రెడ్డీ!'

'డోంటాక్. పొగడ్తలొద్దు. ఇవాళ సినిమా ఖర్చు నాది. వొస్తావా?'

'సినిమానా? నయం.'

'రమ్మన్నది నరకానికి కాదుగా!'

'వార్డెన్ కళ్ళల్లో కారంకొట్టి సినిమా కెళ్ళి, మళ్ళా రావడమంటే—'



'రోజూ మే మెళ్ళడం లెదు టయ్యా?'

'నాకు భయం రెడ్డీ!'

ప్రసాద్ భుజంతట్టి చెప్పేడు రామిరెడ్డి,

'హాస్టల్ గోడ యీజీగా దూకొచ్చు. దూకింతర్వాత మన అచూకీ నరమానవుడికి తెలీద'

'పోనీలె బాబూ! కావలిస్తే



ఆదివారం మాట్నీకి వెళదాంగానీ ప్రస్తుతానికి నన్నొదిలేయ్."

"ఈ చిన్న వెంచర్ చేయలేని వాడివి, రేపొద్దున్న నువ్వు కలెక్టరెలా అవుతావోయ్?"

ప్రసాదంలో కొట్టొచ్చినట్టు మార్పు కనిపించకంతో రామిరెడ్డి మరి మాట్లాడలేదు. అలా గార్డెన్ వేపు తీసుకెళ్ళి, తన అభిప్రాయాన్ని ప్రసాదంతో చెప్పుకున్నాడు.

"చూడు ప్రసాదం! ఏ వయస్సులో కావలసిన సరదాలు ఆ వయస్సులో చేస్తేనే అందం. ఒప్పుకుంటావా? కనుక నువ్వూ నాలాగా తిరిగేయ్. అంటున్నానని కాదుగానీ ఇందువల్ల నీ 'యాంబిషన్స్' మట్టి కొట్టుకుపోవు, నిక్షేపంగా ఐఏయస్ కాగలవు. నన్ను చూడు, నేనూ నీలాగానే చదువుకుంటున్నాను. మంచి మార్కులే తెచ్చుకుంటున్నాను అవునా? అవుతే నీలాగా ఇరవైనాలుగ్గంటలూ పుస్తకాలు తిరగేయడంలేదు. అందులో సుఖమూ లేదు. నన్నడిగితే మనిషికి రిక్రియేషనుతో అవసరమెంతైనా వుంది. రోజుకింత సేపని రిలాక్సవాలి. అది మంచి చెడ్డిందిగని పోనివ్వకు. నా మాటవిని కొంచెం పట్టించుకో. నే చెప్పినట్టు ప్రయత్నించు. జస్ట్ ట్రై ఇట్. నువ్వలా మారగలిగిననాడు నిన్నీ జంతువులు తినలేవు. పైగా నువ్వంటే టెర్రర్‌తో హడిలి ఛస్తారు. అలా అని రాసివ్వగలను, ఆలోచించు."

ప్రసాదం ఆలోచనలో మునిగిపోయాడు.

—రాత్రి రెండుదాటింది. గదిలో ప్రసాదం ఒక్కడూ కూర్చున్నాడు. అతను అప్పటికే రెండు సిగరెట్లు కాల్చేడు. మూడోదికూడా బలవంతంమీద వెలిగించేడుగానీ విపరీతమైన దగ్గురావడంతో దాన్ని యాష్ట్రేలో కుక్కి కొంచెం మంచినీళ్ళుతాగి నడుంవాల్చేడు. తలపక్కనున్న అలారంటైమ్ పీస్ సుతిమెత్తం శబ్దం చేస్తోంది ఆ శబ్దంలో రామిరెడ్డి చెప్పిన ప్రతిమాటా శ్రుతి కలుపుతుంటోంది.

నిజమే. జీవితాన కావలసింది కలక్టరు గిరొక్కటే కాదు. ఇంకా చాలా కావాలి. సుందరమైన అనుభవాలు సంపాయించుకోవాలి; తోచనప్పుడలా నెమరేసుకోడానికి. రామిరెడ్డి జ్ఞాని. అందుచేతనే అంత మహత్తరంగా వెలిగిపోతున్నాడు.

అలారం మోగడంతో ఉలిక్కిపడ్డాడు ప్రసాదం. టైంపీస్‌ని తీసుకుని అలారం ఆపేడు. టైంపీస్‌లో కోడి, తన పిల్లల్తో ఆడుకుంటోంది. ఆ ఆట సరదాగానూ వుంది ఆ వేళకి తలుపు తెరుచుకున్నది.

"మే ఐ కమిన్ ప్లీజ్" వేణు సరదాగా అన్నాడు.

"ప్లీజ్ కమిన్" ప్రసాదమూ సరదాగా అనేశాడు.

వేణు తలుపేసి వచ్చి బట్టలు మార్చకుండానే కేంప్ కాట్ మీద

వంత్తా చప్పుడు చేస్తో అన్నాడు.

'సినిమా బాగుంది. దేవతలు తీయవలసిన సినిమా అది. అందు చేతనే ఇంగ్లీషు సినిమాలంటే నాకంత యిష్టం.'

'ఇప్పుడు నువ్వు గోడదూకే వచ్చేవా వేణూ?' కుతూహలంగా అడిగేడు ప్రసాదం.

'ఎగ్జాక్ట్లీ! గోడదూకడమనే ఆర్టు హైస్కూల్లో వున్నప్పుడే నేర్చుకున్నాను.'

'సినిమాలో మా రామిరెడ్డి కనిపించేడా?'

'ఆహా. అతనూ యిప్పుడే వొచ్చేడు. ఇప్పుడు లాం ఛైమూడో గది పేక్రేగి పోతూండొచ్చు.'


'ఫూల్! బాగో స్నేడు, గోడ దూకేప్పుడు తూలి పడపోతే నేను సాయం చేశాను. కనీసం థేంక్సయినా చెప్పలేదు.'

రామిరెడ్డి గురించి ఈ విధమైన రిపోర్టు ప్రసాదానికి నచ్చలేదు. క్లెంపీన్‌లో వున్న కోడిసంతానంతో ఆడుకోడం ప్రారంభించేడు. మధ్యలో అడిగేడు వేణు.

'క్లెంపీన్ బాగుంది కదూ?'

'ఐ లైకిట్!'

'శకుంతల గుర్తుకొచ్చినప్పుడల్లా క్లెంపీన్‌ని పగలగొట్టా లనిపిస్తుంది కానీ, దాన్ని మామయ్య నాకిచ్చేడు. శకుంతలకి నేనంటే నిర్లక్ష్యమైనా,



మా మయ్యకి నేను ప్రాణం. మీ రామిరెడ్డి నన్ను తినేస్తున్నాడుగానీ లేకపోతే రెణ్ణెళ్ళక్రితమే లేకుంటే నా దయ్యేది. రామిరెడ్డి గురించి నీకేం తెలీదు గుహా! అతను ఫస్ట్ క్లాస్ రోగ్. క్లాసులెగ్గొట్టి సినిమాలకే కాదు, క్లబ్బుకెళ్ళి పేకాటా ఆడుతాడు. అతని చుట్టూ అప్పులు. అయినా యిహం తెలీనీకుండా పేట్రేగిపోతున్నాడు. అంతా షో..."

"ప్లీజ్. అతని గురించి చెడు చెప్పకు నాకు. మంచేమైనా తెలిస్తే చెప్పు. విని సంతోషిస్తాను."

"ఫ్రెండు కదూ!"

"అంతేగాదు, ...

గూడాను."

"పల్లిగాడు."

"నీ కతనంటె జెలసీ."

"కాదు నా మీద అతనికి పగ."

"కానిక్ పడుకో."

"ఎంత సేపని ఆ బెంగంతా నీను నిగుండెలమీద పెట్టుకుంటావ్, అవతలుంచేయ్. అన్నట్టు ఇవాళ ఇంత సేపు మేలుకున్నావేం?"

"రేపట్నుంచి నేను మేలుకునే ఉంటాను వేణూ."

"నువ్వు ... నా వ్వు మ్ము కున్నావా?"

ప్రసాదం జవాబు చెప్పలేదు. వేణు వినదలచుకోనూ లేదు. అయిదు నిమిషాల్లో నిద్రపోయేడు. అతని నిద్రమొహం ప్రసాదానికి ఆశ్చర్యం వేసింది. తర్వాత అనుకున్నాడు.

'పిళ్ళందరూ అదృష్టవంతులు'

దూరంగా ఉన్న ... మీంచి లారీల రొద వినిపిస్తోంది మంద మందంగా. ప్రసాదం మస్తిష్కంలో ఆలోచనలు రంగులు పులుముకుంటున్నాయి. వేణూ దగ్గర్నుంచి వస్తున్న ఖరీదైన సెంటు వాసన ప్రసాదాన్ని ఏదో లోకం లోకి తీసుకుపోయింది.

● ● ●

ఆ మరుసటి రోజు రాత్రి పది ప్రాంతాల గదిలో కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు ప్రసాదం. రూమ్మేటు వేణు ఆ వేళకి స్వర్గమనే బజార్లో మజా చేస్తూంటాడు. రామిరెడ్డి అనుభవాల నీటిలో తాగసాయి అందుకుంటూ వుంటాడు. ఒక ... ప్రసాదిమనే పురుగు గది చాటునుంచే చిన్న సమస్యని భూతద్దం నుంచి చూచి భయపడి పోతున్నా డెక్కడ అని అనుకున్నాడు. ఆ పైన వేదాంతిలా నవ్వుకున్నాడు.

మరో నూటు తలుపువ్వేకున్నాడు. ... తలుపుని ... వేసి గోడచేర్చి పిల్లిలా అడుగులో అడుగు వేసుకుంటూ నడిచేడు. ... చేరం తర్వాత గుండెల్లో భయం కలుక్కుమన్నది. గుండె నిబ్బరం చేసుకుని గోడెక్కాడు. కిందికి దూకుతూండగా, బైటనుంచి

రామిరెడ్డి కాపౌలు లోపలికి సునాయాసంగా దూకేశాడు.

రోడ్డుమీద అడుగుపెట్టి ప్రసాదం నవ్వుకున్నాడు. ఈరోజు తనిష్ట మొచ్చినట్టు తిరిగి రేపు సాయంత్రం తను చూసిన, 'రాత్రి వింతలు' రామిరెడ్డికి చెప్పి అతనిచేత భేషనిపించుకోవాలి.

గబగబా నడిచేడు. రెండు ఫర్లాంగులు నడిచిం తర్వాత రిక్షా దొరికింది. రూపాయిన్నర బేరంతో వూళ్ళోకి వొచ్చి వాలేడు. రైల్వే స్టేషన్ రోడ్డులో అనుకోకుండా గుర్నాథం తారసిల్లేడు. అతన్ని తప్పించుకు వెళ్ళాలనిపించింది కానీ, ఆ పక్షి కంట్లో పడక తప్పింది కాదు. ట్యూబ్ లైటుక్రింద నించున్న గుర్నాథం తనని పసిగట్టి, పొడిగా నవ్వి, సిగరెట్టు పొగ ఆకాశంమీదికి విలాసంగా వదిలి పక్కనున్న ఓ శిష్య పరమాణువుతో కులాసాగా అన్నాడు.

'పక్షి గూడు వొదిలింది. ఇవాళ ఎవడి ఖర్మ కాలిందన్న మాట. శివోహం. గూడు దాటిన కలత్రరూ! క్షేమంగా తిరిగిరా!'

వెనక్కొచ్చి మొహం మ్మీద రెండు వాయించేద్దామనుకున్నాడు. బక్క పీనుగ చచ్చిపోతాడనుకుని, ఆ ప్రయత్నం మానుకున్నాడు ప్రసాదం. థియేటరుదగ్గర నించున్న వేళకి రెండో ఆట ఇంటర్వెల్లు ముగిసింది. టిక్కెట్టు తీసుకుని వేణు మెచ్చుకునే ఇంగ్లీషు సినిమాకి వెళ్ళేడు.

వేణు చెప్పినట్టు ఆ సినిమాని దేవతలు తీయవలసింది కాకపోగా మానవమాత్రుడు చూడతగ్గదీ కాదు. సినిమానిండా ముద్దులూ, వెచ్చటి కౌగలింతలూ, వెకిలిచేష్టలూను. ఇది ప్రసాదం నోటిమాట. కానీ, అతని గుండెలోని గొంతు మాట వేరు. అది తలుచుకుంటూంటే వొళ్ళు పులకరిస్తోంది. మనసుకి అలరింపు కలుగుతోంది.

హోస్టలువరకూ తీయటి ఊహల్నెక్కి వొచ్చేడు నెమ్మదిగా. టైం చూచుకుని భయపడిపోయేడు. మూడు దాటి పది నిమిషాలై పోయింది. ఇప్పటివరకూ సుందరమైన ఊహాలకి తలతాటిస్తూ నడిచి వొచ్చిన ప్రసాదానికి తనముందున్న హోస్టలుగోడ ఆకాశమంత ఎత్తు ఎదిగినట్టనిపించింది. మళ్ళా అంతలోనే రామిరెడ్డి, వేణూ, గుర్నాథం – వగైరాలు గుర్తురావడంతో డాబామీద పిట్టగోడంతగా కుంగిపోయింది.

● *పరీక్షకి వెళ్ళబోతూ కుర్రాడు:*

"అమ్మా! నా [illegible] మీద [illegible] తేనా?"

"మాసిపోయింది గదా అని ఇప్పుడే చాకలాడికి వేశాను."

"అరె పేరావ్. దాంట్లోనే హిందూ దేశ చరిత్రంతా వుంది."

తల వేసుకుంటూ గోడెక్కి కళ్ళు మూసుకుని సునాయాసంగా దూకేశాడు. కిందపడ్డవాడు మరి లేవలేక పోయాడు. వెయ్యేను పేలు శిలమీద త్రిష్ఠ వేసుకూర్చున్నట్టనిపించింది.

ఎదురుగా దేదీప్యమానంగా లైట్లు వెలుగుతున్నాయి. బారులు తీర్చినట్లు కుర్రాళ్ళందరూ వరండాలో నించున్నారు. వాళ్ళందరి ముందూ ఓ కుర్చీలో వార్డెన్ కూర్చున్నాడు. సముద్ర ఘోష లాటి వాళ్ళ సంభాషణ ఫలానా వాస్తువు గురించి అని తెలీడం లేదు.

తను గోడదూకిన రెండుక్షణాల్లో సాగుతున్న ఘోష ఠక్కున ఆగిపోయింది. చీమ చిటుక్కుమన్నా శబ్దమయ్యేంత నిశ్శబ్దం. అంత నిశ్శబ్దాన్ని భరించలేకపోయేడు ప్రసాదం. పైపెచ్చు—బాణాల్లాంటి వీళ్ళందరి చూపులూ తనమీద కేంద్రీకరింపబడటంతో లేచినిందుకే దానికే భయంవేస్తోంది. అతి కష్టం మీద లేవగలిగేడు. ముందుకో అడుగు వేశాడు.

అందరి చూపుల్లోనూ ఉత్కంఠ పెరిగిపోతోంది!

గోడలుదూకి సినిమాలకెళ్ళడమనే సుగుణం వార్డెన్ కి తెలిసుంటుంది. గనకనే ఈ వేళప్పుడిలా వొచ్చేడు. ఎప్పుడూ గుమ్మందాటి ఎరుగని తను సినిమాకెళ్ళిన వైనం గిట్టనివాళ్ళు ఆయన చెవినేయడంతో ప్రసన్నమైన అయన మొహంలో నిప్పులు మండుతున్నాయి. ఇవాళ, ఇంత మందిలో, ఆయన చేత చివాట్లు తినడమనే చరిత్రాత్మకమైన సన్నివేశం. కొన్నిక్షణాల్లో ప్రారంభం కాబోతోందని తెలిసిన మరుక్షణం అతని నరాలన్నీ కత్తితో కోస్తున్నట్లు బాధకలిగింది. ఆ కొంచెం దూరమూ వెయ్యియోజనాల వరకూ పెరిగినట్టు భ్రమకలుగుతోంది. అడుగులు తడబడుతున్నాయి. పెదాలమీదతడి ఆరిపోతోంది.

దూరం దగ్గరవుతున్నకొద్దీ, నిశ్శబ్దంలోనికి చొచ్చుకుపోతున్నకొద్దీ ప్రసాదం వొణికిపోతున్నాడు. అడుగులు లెక్కపెట్టడం ప్రారంభించేడు. సరిగ్గా ఏభైఅరు—

"ఐయామ్ వెరీసారీ మిస్టర్ ప్రసాదరావ్!" వార్డెన్ మెత్తగా అన్నా, దాని వెనకనున్న కర్కశత్వం గుండెల్ని కోసేస్తోంది. అందరి చూపులు తనని కాల్చేస్తున్నాయి.

"ఈ ప్రాక్టీసెన్నాళ్ళ నుంచీ?" మళ్ళీ నిలదీసి అడిగేరు.

"... ... ..."

"ఐ వాంట్ యువర్ రిప్లై."

"ఇవాళొక్కరోజే సార్!"

ప్రసాదం జవాబు విని కుర్రాళ్ళందరూ ఘొల్లున నవ్వేశారు. ప్రసాదం తల దించుకుంటూండగా వార్డెన్ గట్టిగా అరిచేడు—'షటప్'—

నవ్వు లాగిపోయేయి. ఈ వాచ్చరిక తనొక్కడికోసం చేసిందో,

నవ్వుతూన్న వాళ్ళందర్నీ మందలించడమో అంతుబట్టింది కాదు. ప్రసాదం కళ్ళల్లో నీళ్ళు నిండుకున్నాయి.

"ఇక కన్నీ రొక్కటే తక్కువ. నిజం చెప్పాలి. ఇంతవరకూ ఎక్కడున్నారు ?"

అబద్ధం చెప్పాలనీ లేదు. అందుచేత నిజమే చెప్పేడు.

"సినిమా కెళ్ళేనుసార్."

గుర్నాధ మొక్కడూ నవ్వేడు. వార్డెన్ ఈ మాటు 'షటప్' అనలేదు. గుర్నాధం నవ్వు ఆపి ప్రసాదాన్ని అడిగేడు.

"మీ కసలు సినిమా కెళ్ళే అలవాటుందా కలక్టరుగారూ ?"

వార్డెన్ గుర్నాధంవేపు తమాషా చూపుతో గుర్నాధం మరింత ఉత్సాహంగా అనేశాడు.

"ఎక్స్యూజ్ సార్! మా ఫ్రెండొకడు ఈ పూట రేస్తున్నాడంటే సీన్న చేసుకునేందుకు స్టేషను కెళ్ళేమండి. ఇతను పదకొండు ప్రాంతాల్లో ఆ రోడ్డు మీద భయం భయంగా తిరుగుతున్నాడండి. కావలిస్తే అతన్నే అడగండి సార్."

"నిజమేనా ప్రసాదం ?" వేణు అడిగేడు.

నిజమే అన్నట్టు తలూపేడు ప్రసాదం.


"పదకొండు గంటలకి సినిమా ఏమిటి ?" వార్డెన్ అనుమానంగా అడగడంతో యీ చర్చ కేవలం సినిమా గురించే కాదని ప్రసాదం భావించేడు. బెరుగ్గా సమాధానమూ చెప్పేడు.

"వెళ్ళను సార్. ఇంగ్లీషు సినిమా"

"అయ్య బాబోయ్! ఇంగ్లీషు సినిమానే" గుర్నాధం హేళన చేసేడు.

"డోంట్ టెల్మి ఎనీ మోర్ స్టోరీస్. మీ గదిలో వేణు ట్రంకు పెట్టి, నందరూపాయల చిల్లరా అది మీరేమైనా తీసేరా? ఆన్సర్ టుది పాయింట్. దట్సాల్." వార్డెన్ కూడా బద్దలుకొట్టేడు.

ప్రసాదం నెత్తిమీద పిడుగు పడినట్టుయింది. సమాధానం చెప్పేలోగా గుర్నాధం అందుకున్నాడు.



"అతనికి ఆ క్రైంపీసంటే చాలా యిష్టంట సార్. ఈ మధ్య డబ్బవసరంలో గూడా యిరుక్కున్నాడు సార్!"

ప్రసాదం కాళ్ళకింద భూమి రెండు చీలికలైనట్లుంది. తను ఆశించిన కలక్టరుగిరి మన్నుగొట్టుకు పోయినట్లు భావించి, బంగారు భవిష్యత్తు బూడిదపాలైందని తెలిసిన మరుక్షణం అతను కుప్పలా నేల మీదికి వొరిగిపోయేడు, అవమాన భారంతో. దూరంగా రామిరెడ్డి కళ్ళొత్తు కుంటున్నట్లు లీలగా కన్పించింది.

● ● ●

ఈ కథజరిగిన నెలరోజులకా బోలు రామిరెడ్డి ప్రసాదం వాళ్ళ వూరు వెళ్ళేడు. ప్రసాదం, పొలం పనులు చూచుకుంటున్నాడని తెలిసిన మరుక్షణం బాధ పడ్డాడు. ప్రసాదంవాళ్ళ పాలేరు తోడురాగా పొలానికి వెళ్ళేడు రామిరెడ్డి. దార్లో పాలేరు ప్రసాదం జబ్బుగురించి వింతగా చెప్పేడు. అదోరకమైన వ్యాధట. దానికి మందులేదట, రాత్రిపూట ఏవో పలవరింతలుట. పగలస్తమానం పొలంలో పిట్టల్ని తోలడం పనిట.

రామిరెడ్డికి భయంవేసింది!

పొలంగట్టున ఓ చెట్టు నీడకింద అందమైన కంబళిమీద ప్రసాదం కూర్చున్నాడు. అతని భుజాన ఫ్లాస్కుంది. చేతిలో ట్రాన్సిస్టరు రేడియోవున్నది. తనెదుకు భూమ్మీదికి వొరిగిన ఆకాశపుటంచుని నిశితంగా చూస్తున్నాడు ప్రసాదం.

రామిరెడ్డినక్కడ వొదిలి పాలేరు తప్పుకున్నాడు.

రామిరెడ్డి ప్రసాదం దగ్గరికి వెళ్ళేడు. భుజంతట్టి పలుకరించేడు. ప్రసాదం పేలవంగా నవ్వేసి కూచోమన్నట్లు సైగచేశాడు.

రామిరెడ్డి కూర్చోలేదు. పొంగి వస్తూన్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ అన్నాడు.

"నన్ను క్షమించు ప్రసాదం! నీ జీవితాన్ని పాడు చేసింది నేను. వందమందిలో ఒక యోగ్యుడు అవమానం చెందుతూంటే చేసిన నేరాన్ని దాచుకున్న పాపిని నేను. నన్ను క్షమించు."

ప్రసాదం ఫ్లాస్కులో వున్న కాఫీని ఇద్దరికీ పంచేడు. తల ఒంచుకునే అన్నాడు.

"పొలం పనులకి మరో కొత్త ట్రాక్టర్ని కొనబోతున్నాం."

రామిరెడ్డి - రాయిలా నించునే వున్నాడు.

□□□

అనువుగాని సమయం

ద్వివేదుల విశాలాక్షి

సంచిలోని కూరలను వంటగది గుమ్మంలో వంపి, పీటపై చతికిలబడ్డాడు సుబ్బారావు. "హమ్మయ్యా" అంటూ.

అతనివైపు చూడకుండానే 'ఏం తెచ్చారేమిటి?' అని-ప్రశ్నించింది సీతాలక్ష్మి.

'వంకాయలు.'

'కూరకేమైనా మిగులుతాయా?'

'ఎప్పుడూ నువ్వు అలా గంటావని, ఈరోజు బజారంతా గాలించి తెచ్చాననుకో... చూసిన వాళ్ళంతా ఇవి మీకు ఎక్కడ దొరికేయండీ - అని ఒకటే అడగడం' అన్నాడు దర్పంగా సుబ్బారావు,

సీతాలక్ష్మికూడా ఆ మాటనే కొంచెం మార్చి అంది.

'ఈ పుచ్చు వంకాయలు మీ కెక్కడ దొరికేయండి' అని.

'ఇవి పుచ్చు వంకాయలా? బాబూ, తెల్లని ముచ్చంకాయలు. నొక్కి తేపాలుగారుతున్నాయి. మరో పదలం తూసేదా? —అని ఆ కూర లమ్మి తెగ పొగుడుతూంటే—' అనుకొన్నాడు సుబ్బారావు.

'కొంచెం దగ్గరకొచ్చి చూడు సీతా! అలా దూరంనుంచే దబాయిస్తే ఎలా? తరిగి చూస్తే తెలుస్తుంది. ఎంత...'

'ఎంత ముదురువో... ఎన్ని గింజలు, పురుగులు వున్నాయో' అంటూ కత్తిపీటతో కసుక్కున తరిగిందో కాయని సీతాలక్ష్మి.

"అయ్యోరామ. ఇదేం వంకాయలండీ; మీతో ఏ పని చెప్పినా ఇంతే... ఒక్కపని ... ఒక్కటంటే ఒక్కటి సానుకూలంగా చేసుకురాలేరు కదా! నిన్నటికి నిన్న కాఫీ గుండ తెమ్మంటే, ఒకటో రకమైన చింతగింజల గుండ తెచ్చి నా నెత్తిని కొట్టేరు. తెచ్చానంటే తెచ్చానన్న మాటేకాని, ఆ వస్తువు మంచిదో కుళ్ళుదో చూసుకోకపోతే ఎలా? బజారుకెళ్ళి శుభ్రమైన కూర తేలేని మీ రెందుకు పనికొస్తారండీ" అంది ఈసడింపుగా.

ఆ మాటని అలవాటు పడిన మందు మాత్రలా నిర్వికారంగా మింగి వూరుకొన్నాడు సుబ్బారావు. రోజూ చచ్చేవాడికోసం ఏడిచేవారెవరు-అన్నట్లు, అతనికి జ్ఞానం తెలిసినప్పటి నుంచి వింటున్న ఆ మాట

కోసం ఎంతకని బాధపడ్డాడు ? ముద్దు ముద్దుగా అతని మూడవ నెలనే వాళ్ళమ్మ ఆ మాటకి ప్రారంభోత్సవం చేసిందట. "వెధవ కానా; మూడు నెలలొచ్చినా బుర్ర నిలుప లేకున్నావు. ఎందుకు పని కొస్తావురా" అంటూ.

ఆ వెనుక ఎంతమంది ఆమాటతో అతన్ని ఆశీర్వదించేరో లెక్కవేసి చెప్పడం కష్టమేమరి. సుబ్బారావు రెండోక్లాసు చదువుతుండగా వాళ్ళ నాన్నకి ఇంకో వూరుకి బదిలీ అయింది. అక్కడ స్కూల్లో పిల్లలంతా రెండోఎక్కం ఇంకోలా చదవడం చూసి హడలి పోయేడు సుబ్బారావు.

ఈ అయ్యవారు తనని చదవమనకుండా వుంటే బాగుండును— అనుకున్నాడు. సుబ్బారావు భయపడినంతా అయింది.

"ఒరేయి సుబ్బాయ్; రెండో ఎక్కం చదవరా" అన్నారు అయ్యవారు

"రెండు ఒకట్ల రెండు; రెండు రెళ్ళు నాలుగు; మూడు రెళ్ళు ఆరు" ఎక్కం చదువుతున్నాడు సుబ్బారావు.

"ఓరి వెధవా! ఒకసారి రెండుని ముందుంచి చదువుతే కొసదాకా అలా చదవలేవూ ? మధ్యలో మళ్ళా "మూడు రెళ్లు ఆరు" ఏమిటి ?" అన్నారు అయ్యవారు.

"మరేమోనండి... మరేమోనండి ... మా వూర్లో చింతల మాష్టారు అలాగే చెప్పేరండి. ఒక రెండు రెండు; రెండు రెళ్ళు నాలుగు; మూడు రెళ్ళు ఆరు; అని. మరిక్కడేమో అంతా రెండు ఒకట్ల రెండు, అంటున్నారని అలా చదివేసేనండి" అన్నాడు పదిబెక్కులు బెక్కుతూ.

"ఎక్కం తిన్నగా చదవడం చేతకాక వెధవ కబుర్లు చెప్తున్నావు. రెండో ఎక్కంరాని వెధవ్వి రెండో క్లాసుకి తయారవేవు. ఎందుకు పని కొస్తావురా మొద్దూ" ముద్దు ముద్దుగా నాలుగు - మొట్టికాయలు బహూకరించేరు అయ్యవారు.

సుబ్బాయి అన్నా రామాయి. ఇప్పుడు వాళ్ళిద్దర్నీ స్నేహితులు ఆ పేర్లతో పిలవరనుకోండి. "ఏరా సుబ్బారావు ఏరా రామారావు" అంటూ పిలుస్తారు అంతా. కాని అప్పుడు అంటే చిన్నప్పుడు అలానే పిల్చేవారు. ఓ రోజు రామాయి సుబ్బాయిని చాటుగాపిల్చి "ఒరేయి సుబ్బాయి... సుబ్బాయి నాన్న జేబులోంచి ఒక పాతిక పైసలు కొట్టుకు రారా" అన్నాడు ఆప్యాయంగా.

"బజార్లో ఎంత మంచి గాలి పటాలు అమ్ముతున్నా రనుకొన్నావు. ఒక పది కొన్నామనుకుంటే ఇంక ఆ కోటిగాడి నోరు మూతపడుతుంది. మహా తనకే రెండు గాలిపటాలున్నాయని ఎగిరి పోతున్నాడు. మనం ఒకటి తర్వాత ఒకటి చొప్పున ఆకాశంలోకి వదిలేమంటే కళ్ళు తేలేసుకొని, నోరు వెళ్ళబెట్టి

కొని చూస్తాడు' అన్నాడు రామాయి నమ్మకంగా.

సుబ్బాయి అమ్మదగ్గరికి 'ఊఁ' అని వంటింట్లో అమ్మదగ్గర కూర్చున్నాడు. ఎంతకీ తమ్ముడు రాకపోవడంతో... అయింతా పట్టుబడి తన పేరుకాని చెప్తున్నాడో... ఏమో? దూరంనుంచి 'వెధవా నా పేరు చెప్పేవంటే తంతాను' అని బెదిరించ వచ్చిని ఇంట్లోకి పిల్లిలా జొరబడ్డాడు రామాయి.

అమ్మ పక్కన మినపచేకోడీలు తింటూ కూర్చున్న సుబ్బాయిని చూస్తే ఎక్కడలేని కోపం రామాయిని వెతుక్కుంటూ వచ్చింది.

'ఒరే సుబ్బాయి ... సుబ్బాయి చూడరా ... చూడరా' అన్నాడు. ఆతృతగా ఆకాశంవైపు చూస్తూ.

ఏమిటో విడ్డూరం అనుకొని సుబ్బాయి పరుగుపెడ్తూ వచ్చేడు. దగ్గరగా రానిచ్చి 'వెధవా డబ్బులు కాజేసుకురారా అంటే, అమ్మ ఒళ్ళో దూరేవా?' అన్నాడు కోపంతో.

'కాదురా ... కాదురా ... మరి




తలనొప్పి
ఎక్కువగా ఉన్నా
తలకేగా!
అమృతాంజనం వాడి
శీఘ్రంగా నివారణ పొందండి
స్థానికంగా ఉండే బాధను నివారించుకోడానికి లోపలికి మందులు ఎందుకు పుచ్చుకుంటారు? నొప్పి ఉన్న చోటుమీద అమృతాంజన్ రాసి అమోఘంగా శీఘ్రంగా నివారణను పొందండి. ఏ అపాయం లేకుండా కండరాల నొప్పులకు, తల నొప్పికి, బెణుకులకు ఇంకా కీళ్ల నొప్పులకు అమోఘంగా గుణమిచ్చే అమృతాంజన్ 10 రకాల ఔషధాలు చేరిన మందు అమృతాంజన్ గుండెపట్టులకే కాక సాధారణ జలుబులకు కూడా మంచి మందు. కొంచెం కొంచెమే ఉపయోగించవలసి ఉంటుంది కాబట్టి ఒక సీసా మీ కుటుంబానికి అంతా కలిపి నెలల తరబడి వస్తుంది
అవసరానికి ఎప్పుడూ అమృతాంజన్ ఉంచుకోండి అమృతాంజన్ 70 ఏళ్ల ప్రసిద్ధిని పొందిన నమ్మకమైన గృహౌషధం
AMRUTANJAN
అమృతాంజన్ నొప్పులు జలుబులు నివారణకు 10 రకాల ఔషధాలు చేరిన మందు
అమృతాంజన్ లిమిటెడ్
మద్రాసు · బొంబాయి · కలకత్తా · ఢిల్లీ

నాన్న చూస్తే తంతాడురా. బుచ్చి చెప్పేస్తానంటున్నదిరా' అన్నాడు.

'అసలు బుచ్చితో ఎందుకు చెప్పేవు? దానినోట్లో నువ్వుగింజ నానదు కదా. ఫరవాలేదులే.- సరదాకన్నావని చెప్తానుకాని నువ్వు మెల్లిగా గదిలోకి జారుకో' అని హితోపదేశం చేసేడు రామాయి.

'నేను తేలేనురా. నాన్న తంతాడు' అన్నాడు సుబ్బాయి ఏడువు గొంతుకతో.

'ఇంట్లోంచి పాతిక పైసలెత్తుకు రాలేని వెధవ్వి ఆటలకి సిద్ధపడ్డావు. నువ్వెందుకు పనికొస్తావురా. ఉట్టి తేభ్యంగాడివి' అన్నాడు రామాయి ఈసడింపుగా.

'దండాలండి బాబయ్యా ... దండాలు' అన్నాడు కోటిలింగాలు.

తండ్రి చేతికర్ర నీడలో అడుగులు వేస్తూ నడుస్తున్న సుబ్బాయి బుర్రెత్తి చూసేడు. ఎదురుగుండా నల్లశానపు రాయిలా నిగనిగ మెరుస్తున్న కోటిలింగాలు ముఖంపైవున్న నూనెమడ్డిలాంటి చెమటను తుడుచుకొంటూ కన్పించేడు.

'ఏమిటి సంగతి కోటిలింగాలూ! వ్యాపారం ఎలా సాగుతోంది' అని పలకరించేరు రంగయ్యగారు.

'ఏదో ఓ మాదిరిగా వుంది బాబయ్యా. ఈ ఏడు సింతపండు మహగాయకం అయేలాగుంది. తవరి కొమార్దు మల్లిపోడు ఎల్తున్నారని తెలిసి తవింటికేవస్తున్నాను. అక్కడ మా బామ్మరిదికి కూంత తెలియజేత్తిరా జాగర్త పడ్తాడు. బోలెడు సింత తోట వుంది. ఏరికి అమ్మొద్దన్నానని సెప్పండి. అంతా ఈలునూసుకు. నేనే తీసుకొంటాను. లాబాలు సెరిసగం' అన్నాడు వ్యాపారవేత్త కోటిలింగాలు.

'ఏరా సుబ్బాయి; సింహాచలం ఇల్లు నీకు తెల్సురా' అని ప్రశ్నించేరు రంగయ్యగారు.

'తెలడానికేముంది బాబయ్యా. ఊరిలోంచి కూంత నడుత్తే సింత నాగు పారుతుంటది. ఆ గట్టమ్మటే పోతే సింతతోట కనపిత్తది. అక్కడికి పదిబారలు ఆ ఇల్లు' అన్నాడు కోటిలింగాలు.

'అర్థమయిందిరా' అన్నారు రంగయ్యగారు.

'ఆ...ఆ' అన్నాడు సుబ్బాయి.

సుబ్బాయి మల్లిపోడు వెళ్ళేడు. వచ్చేడు. గుమ్మం ఎక్కుతుండగానే కోటిలింగాలు దర్శనం అయింది.

● భార్య : *ఏమండోయ్, ఇప్పుడే చెప్తున్నా, ఇలా అయితే నేనీ సంసారం ఈదలేను సుమా! మొన్నరాత్రి ఇంటికిరావలసినవారు నిన్నొచ్చారు. నిన్న రాత్రి రావలసిన వారివాళొచ్చారు. ఇవాళ రాత్రి రావలసినవారు మీరు రేపు కనకవస్తే ఒక్క నిమిషం ఇంట్లో వుండను.*

సుబ్బాయి గుండెలు కొట్టుకొన్నాయి.

"ఏరా మామయ్యా వాళ్ళుఅంతా బాగున్నారా?" అని-అడిగింది తల్లి.

"ఆ" అన్నాడు సుబ్బాయి.

"సిన్నబాబూ, నా మాట సెప్పావచ్చినారా" అన్నాడు కోటిలింగాలు ఆతృతగా. లేదన్నాడు సుబ్బాయి.

"ఏటి ... ఏటయింది"

"ఇల్లు దొరకందే, చింతనాగు గట్టంతే రెండుమైళ్ళు నడిచినా తోటకాదుకదా ఒకచింత చెట్టయినా కన్పించలేదు."

"ఎటు నడిసినారు బాబూ? తూరుపుకా, పడమరకా?"

"తూరుపుకే."

"సంపేసినారు బాబయ్యా, ఆడిల్లు పడవటుకున్నాది."

"మరి నువ్వు చెప్పందే."

"ఇలాటియన్నీ చెప్పాలా సిన్న బాబూ; తూరుపుకి నేకపోతే పడవటు కుంటాదన్న మాతేకదా? తవలాటి సదువుకున్నోరికి ఆ మాత్తరం ఆలోసన లేకపోతే, మీరు పరీచ్చల్లో ఎలా పాసవుతారు, ఉద్దోగంలో ఎందుకు పనికొత్తారు?" అన్నాడు కోటిలింగాలు.

సుబ్బారావు ఇంకా ఆలోచిస్తూనే వున్నాడు. చదువుకొంటున్న రోజుల్లో కాలేజీపిల్లలు కూడా అదే మాట. ఒక అమ్మాయికైనా పేరు పెట్టడం చేతకాని దద్దమ్మవి. నీ వెందుకు పనికొస్తావయ్యా" అని. కాలేజీలో చదివిన చదువంతా ఆడపిల్లల్ని ఏడిపించిందికే ఉపయోగపడ్డుందని, అదే చేతకాకపోతే ఇంక చదువెందు కన్నట్లు?

"మీ రింకా ఇలాగే కూర్చున్నారండీ. నా వంటంతా అయిందికాని మీరు స్నానం చేసిరావడం అవలేదు. ఆఫీసుకి లేటవుతుందని అందరూ పరుగులు పెడ్తారు. ఇదెక్కడి గోలో పది మేల్కొల్పులు పాడితేకాని లేవనే లేవరు మీరు" అన్నాది సీతాలక్ష్మి సట్టిల్లు సర్దుతూ.

భార్యామణి యొక్క వేడి వేడి మందలింపులతో ఈ లోకంలోకి వచ్చిన సుబ్బారావు తుండుగుడ్డ బుజాన్నేసుకొని స్నానానికి బయలుదేరేడు. నూతిలోంచి ఒక్కొక్క చేదడు నీళ్ళు సుబ్బారావు దేహాన్ని తడుపుతూ తరిగిపోతున్నాయి. ఆ నీటి చల్లదనంతో పాటు ఎన్నో జ్ఞాపకాలు బుర్రలోకి దూరుతున్నాయి. వాటిని వదలించుకొందామనే సదుద్దేశంతో జుట్టును ఈ పక్కనుండి, ఆ పక్కకి మహా జోరుగా దుద్దేస్తున్నాడు సుబ్బారావు. అయినా అది వదలందే.

అలవాటు ప్రకారం ఆ రోజు కూడా ఆలస్యంగా ఆఫీసుకి పరుకొని తన టేబిలువైపు నడుస్తున్నాడు సుబ్బారావు. మేనేజరు గదిలో నుండి "సుబ్బారావు" అనే సింహగర్జన విన్పించింది.

"బాబయ్యా! తవకోసం మేనేజరు బాబు సానాసేపటినుండి సూత్తున్నారు" అన్న బంట్రోతు మాట కాని, "ముందు ఇటువైపురా" అని నీలకంఠం చేసిన సౌజ్ఞకాని సుబ్బారావు గుర్తించలేదు. ఉరుకులు పరుగులుగా మేనేజరు గదిలోకి వెళ్ళిపోయేడు.

పది నిమిషాలకి పైగా తిశవల సినవన్నీ తిని, ముఖం వేలేసుకు వచ్చి తన టేబిలుముందు కూలబడ్డాడు సుబ్బారావు.

"ఏంరా నాన్నా, ఏం జరిగిందిరా?" అని పరామర్శ చేసేడు పక్కనే కూర్చున్న భార్య స్నేహితుడు పున్నయ్య.


"వుండరా... చస్తుంటేను" విసుకొన్నాడు సుబ్బారావు.

సుబ్బారావు విసుక్కొన్నాడూ అంటే అదేదో పెద్దచిక్కే అనుకొన్నాడు టైపిస్టు అప్పారావు.

పక్కగదిలో బోనులో పులిలా పచారుచేస్తున్న మేనేజరుకి దడిసి ఇంకేం సంభాషణా సాగించలేక పోయేరు సహెూద్యోగులు.

లంచ్ టైములో అసలు విషయం బయటు పడింది.

"ఓరీ దద్దమ్మా, అంతా పాడుచేసుకొచ్చావు" అని విరుచుకు పడ్డాడు నీలకంఠం. "అందుకే ముందుగా ఇటు రా రా అని నేను మొత్తుకొంటున్నా చూసేవా. నీ లాంటి వాడు ఒక్కడుంటే చాలు చుట్టు



పక్కల వారి నందరినీ బాధ పెట్టిందికి." అన్నాడు.

"నన్ను రమ్మంటే ఏమని జవాబు చెప్పేనో తెలుసా? ఆదివారంనాడు కూడా పని చేసిందికి, మేము నీ బానిసలం అనుకొన్నావా? శలవురోజున పనిచేస్తే దానికి ఎక్కువజీతం ఇయ్యవలసిందే. గవర్నమెంటు ఇచ్చిన శలవు కాదనేందుకు నువ్వెవడివి? అన్నాను. ఆఫీసరుతో కాదు వాడి తాతతో చెప్పుకో ఇకముందు వెట్టి చాకిరి చెయ్యను-అన్నాను. దానితో మేనేజరు ముఖం నయాపైసంత అయిందనుకో. తనలో తనే ఏదో గొణుక్కొంటూ పక్కగదిలోకి వెళ్ళిపోయేడు." అన్నాడు నీలకంఠం గర్వంగా.

"ఇంక ఇప్పుడు నేనేం చెయ్యలేనురా. బోలెడు వర్కు పడుంది. రేపు సాయంకాలానికల్లా అదంతా పూర్తి - కావాలిట. నా సోమరితనం వల్లే అంత కూడ పడిందనీ, దానిని రేపు పూర్తిచెయ్యక వీలు లేదనీ, కసిరి కొట్టేడు, "చిత్తం అలాగేనండి. రేపు ఎంత రాత్రికైనా పూర్తి చేస్తాను" అన్నాను అన్నాడు సుబ్బారావు.

"పౌరుషంలేని చచ్చువెధవలంతా తయారయితే అధికారుల ఆరాటాలు ఇలాగే వుంటాయి. చేసుకొన్న వారికి చేసుకొన్నంత మహాదేవా అని అఘోరించు. హాయిగా ఆదివారంనాడు తినితిరిగి ఆనందించకుండా ఆఫీసులో మగ్గి చచ్చేరాత నీ నుదటురానుంటే నేనేం చెయ్యగలను" అన్నాడు నీలకంఠం హేళనగా.

"నేను కూడా రావాలిరా" అన్నాడు పున్నయ్య.

"మరేం స్నేహితులేగా. కట్టకట్టుకొని చావండి. నాకేం కావాలి. ఈ ఆఫీసులో ఒక కట్టు, కలివిడి వుండి ఏడుస్తేకదా బాగుపడిందికి" అన్నాడు నీలకంఠం కోపంగా.

"లేదు. ఇంకెప్పుడు ఇలా జరుగనీయం" అన్నారు సుబ్బారావు, పున్నయ్య ఐక్యకంఠంతో.

మరునాడు ఆదివారం కదా. వేళకి సరిగా ఆఫీసుకి రాకపోతే బాగుండదని టంచనుగా పదిగంటలకల్లా ఆఫీసు గుమ్మంలో అడుగు పెట్టేడు సుబ్బారావు. టేబిలు ముందు కూర్చుని కాగితాలలో మునిగి తేలుతున్న నీలకంఠాన్ని చూసి తన కళ్ళని తనే నమ్మలేకపోయేడు.

"ఏమిటి సంగతి?" అన్నాడు మెల్లగా, అతని టేబిలుముందు నుంచి వెళ్తూ సుబ్బారావు.

"సాయంకాలం చెప్తా" అన్నాడు మేనేజరు గదివైపు చూస్తూ నీలకంఠం.

ఆఫీసు గుమ్మంవదలి ఇల్లు చేరేదాకా గుక్కతిప్పకుండా చెప్పేడు. నిన్నసాయంకాలం ఇంటికెళ్ళి కాఫీతాగుతుంటే సన్నాలు వచ్చేడు.

"బాబూ మేనేజరుగారుమిమ్మల్ని రమ్మంటున్నారు" అంటూ.

"సోమవారం ఆఫీసులో కలుస్తానని చెప్పరా" అన్నాను.

"కాదు బాబూ! ఏదో అర్జంటు పనున్నాదిట. వున్నపళంగా తీసుకు రమ్మన్నారు" అన్నాడు.

చెయ్యగలిగినంత ఆలస్యంచేసి ఒక అరగంట కల్లా బయలుదేరేను. నేను వెళ్ళేసరికి గుమ్మంలో కారు పెట్టుకొని ఎక్కడికో వెళ్ళే ప్రయత్నంలో వున్నట్టుంది మేనేజరు. వారి శ్రీమతి కారులో కూర్చుంది.

"రా నాన్నా వేళయిపోతున్నా" దంటూ అతని చెయ్యి పట్టుకొని లాగుతున్నాడు వారి సుపుత్రుడు.

"రాండి ... రాండి ... మీ కోసమే చూస్తున్నాను" అని సాదరంగా లోపలికి తీసుకెళ్ళి డ్రాయింగు రూమ్‌లో కూర్చోపెట్టేడు. అప్పన్నా బాబుగారికి కాఫీ పట్టుకురా" అన్నాడు నౌకరుతో.

"ఎందుకులెండి ఇప్పుడే తాగి వచ్చేను" అన్నాను.

"ఓ సారి తాగితేనేం ... కాఫీ ఎన్నిసార్లైనా తాగొచ్చు" అన్నాడు

అప్పన్న తెచ్చిన కాఫీ కప్పందుకొని మెల్ల మెల్లగా తాగుతుంటే అసలు విషయం మొదలుపెట్టేడు.

"చూడండి నీలకంఠంగారూ, ఇది మార్చినెల. ఈ నెలాఖరుకి అన్ని లెక్కలు తయారై ఫైళ్ళన్నీ హెడ్డాఫీసుకి పంపేయాలి ఇది ప్రతి సంవత్సరం జరుగుతున్న పనేకదా? ఇంతకాలంగా పనిచేస్తున్న మీకు తెలియనిది కాదు. నా బాధ్యతకొద్దీ నేను చెప్తున్నాను. హెడ్డాఫీసులో కొత్తగా వచ్చిన ఆఫీసరు యముడు లాటివాడు అంటున్నారు అంతా. వేళకి సరిగా పని తెమలకపోతే అనవసరమైన రిపోర్టులు — గొడవ. ఏదో ఈ ఏడుకాస్తా సవ్యంగా గడిచిపోతే ప్రమోషన్ వస్తుందనుకొంటున్నాను. ఇప్పుడే చికాకయినా ఇంక అదలా పడివుండవలసిందే.

మీ మాటంటే ఆఫీసులో అందరికీ గురుంది. అందుచే ఎలాగైనా మీరు చేస్తూ, ఇతరులచేత ఈ పని పూర్తి చేయించాలి. ఇది మేనేజరుగా ఆజ్ఞాపించడంలేదు. స్నేహితుడుగా అడుగుతున్నాను.

సరేనన్నాను [illegible]గా. నా మనస్సు కరిగిపోయింది. [illegible] పెద్దవాడు.

● ఒకసారి ఫ్రెంచి తత్త్వవేత్త వోల్టేర్ మరొక రచయితను మెచ్చుకుంటూ మాట్లాడుతున్నాడు. ఒక స్నేహితుడు "మీ గురించి అతను ఎప్పుడూ తిడుతూ వుంటాడు. మీరతన్ని మెచ్చుకోవడం విశేషమే" అన్నాడు — "బహుశా మేమిద్దరమూ పొరబడుతున్నామనుకుంటా."

నోరు విడిచి అడిగేడు. వూ... కానీ... అలాగే అందాం అనిపించింది

'ఏదో కోపంలో అలా అన్నానే కాని, మీమాటు కాదంటూనా? ఇంక అపని విషయంలో మీరేమీ బెంగ పెట్టుకోకండి' అన్నాను, ఆయన కొండ నందుకొన్నా డనుకో......

ఈ సంఘటన జరిగి ఏడాది కావస్తున్నా ఇంకా సుబ్బారావు మనసులో పచ్చిగానేవుంది. ఎదిర్చి జవాబు చెప్పిన నీలకంఠానికి ఏడాది తిరక్కుండానే ప్రమోషన్ వచ్చింది. చచ్చిచెడి— గానుగెద్దులా చాకిరి చేస్తున్నతనూ, పున్నయ్యా ఎదుగుబొదుగులేని జీతంరాళ్లు ఇంకా అందుకొంటూనే వున్నారు, అనువుగా వున్నవాళ్లని చూస్తే అందరికి అలుసే మరి.

మేనేజరు శలవుపై వెళ్తూ ఆఫీసులో అధికారం అంతా హెడ్ గుమాస్తా రామానుజంకి అప్పగించేడు. అల్పుడికి అధికారం ఇస్తే ఎలా వుంటుందో పది రోజులకల్లా చేసి చూపించేడు రామానుజం. పద్మనాభం తల్లికి ప్రాణంమీదికి వచ్చింది. ఉత్తరం చూపించి శలవు కావాలన్నాడుకు ఇప్పుడు వీలు కాదు. రెండు రోజు లాగి వెళ్ళమన్నాడుట

ఏం ఉద్యోగాలు ఈ రోజుంటాయి, రేపు పోతాయి. తనువు చాలిస్తున్న తల్లి ముఖం మళ్ళా చూడగలడా? రెండు రోజులు పోయేకవెళ్తే ఆఖరి చూపైనా అందుతుందన్న నమ్మకం ఏమిటి? పద్మనాభం ఆ ఆవేశంలో ఏం చేస్తున్నాడో తెలియకుండానే ఉద్యోగానికి రాజీనామా కాగితం రాసి రామానుజం టేబిలుమీద పెట్టి వెళ్ళిపోయేడు.

తల్లి దినవారాలు ముగించుకొని మేనేజరుతో చెప్పి పోదామని వచ్చేడుట పద్మనాభం. రాత్రికి రాత్రే అతని గదికి రామానుజం పనికట్టుకొచ్చి 'బాబ్బాబు ఈ విషయం తెలియనియ్యకు. అపత్సమయాల్లో శలవెందుకు ఇయ్యలేదని నన్ను తిట్టిపోస్తాడు. నీ రాజీనామా కాగితం ఆనాడే కాల్చివేసేను. నువ్విప్పుడు శలవునుంచి తిరిగొస్తున్నా వన్నమాట. తెలిసిందా?' అన్నాడుట.

మరునాడు రామానుజం ఇంటిముందు సుబ్బారావుకి కన్పించేడు పద్మనాభం.

'ఆయన సహాయానికి ధన్యవాదాలు తెల్పుకు వస్తున్నానురా' అన్నాడు.

'బాబూ, నా కూలిడబ్బులు' అంటూ వెంటపడ్డాడో గంపకూలి.

'వెధవా, మార్కెట్నుంచి ఇక్కడికి ఇద్దెవై పైసలిస్తే చాలదూ? ఇంతకీ రాళ్ళా, గుళ్ళా మోసేవా? వంద మామిడి పళ్లు ఎంత బరువుంటాయి?' అని వాణ్ణి విసిరి

కొట్టుడు. సరిగ్గా సమయానికి ఎక్కడినుండి ఊడిపడ్డాడో రాఘవేంద్రం అక్కడ ప్రత్యక్షమై "ఏం పద్మనాభం, సుబ్బా ఏమిటి గిరాకీ? ఎవరికి మామిడి పళ్ళ నజరానా?" అన్నాడు వ్యంగ్యంగా.


అది వరకు పద్మనాభం పది బస్తాల ధాన్యం మేనేజరు కూతురి పెళ్ళికి పంపి, అందరికన్న ముందు ఇంక్రిమెంటు అందుకొన్నాడని రాఘవేంద్రానికి అనుమానం.

"సంతోషించేం... తమ కుశాగ్ర బుద్ధికి కాని, ఈ పళ్ళు పక్కవీధిలో వున్న మాతోడల్లుడు కొనిపెట్టమంటే కొని, వాళ్ళింట్లో విడిచి వస్తున్నాను." అన్నాడు పద్మనాభం బింకంగా. ఆలోచనలన్నీ సుబ్బారావుని ఒకే అభిప్రాయానికి లాగుతున్నాయి. అణగి, మణగి అడకువగా వున్న వాళ్ళని అనాదరం చెయ్యడం, ఎదిరించి పౌరుషంగా నిల్చిన వాళ్ళని పైకి ఎగతొయ్యడం జరుగుతున్నాది తమ ఆఫీసులో. నెమ్మదయిన వాళ్ళకి ఒకపూట లశవైనా దొరకడంలేదు. ఒక పూట దాకా ఎందుకు? మొన్నటికి మొన్న శ్రీమతి సినీమాకి వెళ్దామంటే ఒక గంట ముందుగా ఆఫీసు వదిలిందికి కూడా అవలేదు.

"మీరు సినీమాకి చిత్తగిస్తే ఇక్కడ పనిచేసే దెవరయ్యా? ముందు ఆ పని పూర్తి చేసి మరీ కదులు" అన్నాడు మేనేజరు.

వేళకి ఇంటికి రాకపోతే శ్రీమతి చదివే అష్టకాలకి అంతం వుండదు. "ఎలా గైతేనేం మహా ఉద్యోగం మీరొక్కరే చేస్తున్నారు. నేటికేడాదయింది ఒక్కరోజు సెలవు తీసుకోలేదుకదా?"

ఈ రోజు ఒకగంట ముందు



ఇంటికి వెళ్తానంటే మేనేజరు వద్దంటాడా? అనుకులెండి ... మీ ముఖం చూస్తే అంతకన్న ఏమన బుద్ధి పుడుతుంది. ఓ ఆత్మగౌరవం, ఓ పౌరుషం వుంటేకదా? ప్రతిదానికీ డూ డూ డూ డూ బసవన్నా అంటే బుర్రూపుతూ ఆఫీసులో కూర్చుంటే అంతకన్న గౌరవం ఏం పెరుగుతుంది?

ఉద్యోగం చేస్తున్న అందరూ మీలాగే వుంటున్నారా? కిందటి నెలలో మాలతమ్మ, చెల్లెలి పెళ్ళికి మొగుణ్ణికూడా వెంట బెట్టుకుని పోయి పదిహేను రోజులుండి వచ్చిందే; ఆయనకూడా మీ ఆఫీసులోనే ఉద్యోగంటు కదూ? మరి శలవు ఎలా దొరికిందో? మేనేజరు చేత ఒక్కగంట శలవు శాంక్షన్ చేయించుకురాలేని మీరేం చేసుకు రాగలరండీ" అని ఒకటే సాధింపులు.

ఇల్లు వాకిలి పట్టుకుండా ఇంత చాకిరి చేస్తున్నా ఆఫీసులో ఓ మెప్పా, మెహర్బానీ వుందా అంటే అదీలేదు. ఆఫీసులో ఏ చిన్న తప్పు జరిగినా అందుకు సుబ్బారావే బాధ్యుడైనట్లు అతనిపై ఎగిరి పడతాడు మేనేజరు. భగవంతుడా సంతృప్తి, సానుభూతి లేని ఈ మానవుల మధ్య ఎందుకు జన్మనెత్తించేవు? ఇంతకన్న అడవిలో జంతువో, పక్షో, చెట్టో, పుట్టో అయినా బాగుండిపోయేది. ఈ సాధింపులు, ఊడిగాలు లేక పోవును అని బాధపడేవాడు సుబ్బారావు.

ఆలోచనలు నూతిలోని ఊటలా ఊరిపోతున్నాయి. చాదలకి చాదలు నీళ్ళు నూతిలోంచి తరిగి పోతున్నాయి.

"అయ్యో రామ, ఇంకా మీ స్నానం పూర్తికాలేదుటండీ, ఇక ఈ రోజుకి ఆఫీసుకి వెళ్ళే మాటలేదా? అన్నాడంటే ఆ మేనేజరుది తప్పా? పదిగంటలు కావస్తోంది. ఇంకా అయ్యగారి స్నానం పూర్తి కాలేదు. ఇంక భోజనం చేసే దెప్పుడు? ఆఫీసు కెళ్ళే దెప్పుడు?" అంది సీతా లక్ష్మి అదలింపుగా.

ఒక్కసారి సుబ్బారావు చేతిలోని చెంబ జారిపోయింది. తను ఇంత సేపుగా పడుతున్న తొందరకి అర్థం లేదనుకొన్నాడు. ఈ రోజు ఆఫీసుకి తను పోనక్కరలేదు. ఆ మాటే భార్యతో అన్నాడు.

"ఆఫీసుకి వెళ్ళనక్కరలేదే సీతా" అన్నాడు.

"ఆ మాట ముందుగా చెప్తే మీ సొమ్మేం పోతుందేం? తెల్లారి లేచింది లగాయతు పరుగులు పెడుతున్నప్పుడైనా ఇంట్లో ఇల్లాలికి చెప్పాలని తెలియలేదా?"

ఈ సాధింపులు సుబ్బారావు చెవులలోకి జొరబడలేదు. ఈ రోజు తను ఆఫీసుకి వెళ్ళ నవసరంలేదు. ఆ ఒక్క కుర్చీలో సాయంకాలం ఆరు

గంటలదాకా అతుక్కు పోనక్కర లేదు. చీటికి, మాటికి చిరచిరలాడే మేనేజరు కోపం ఈరోజు తన్నేమీ చేయలేదు.

హాయిగా భోంచేసి ఈజీఛైరులో పడుకొని కావలసిన పుస్తకమో, పేపరో చదువుకోవచ్చు. ఇంకా మనస్సైతే నులక మంచం ఎండా నీడలమధ్యగా వేసుకొని ఓ కునుకు తియొచ్చు. ఆహా ... హా ... ఏం మజాగా వుంటుంది. ఏం పర్వదినం? 'ఒరే సుబ్బారావు అదృష్టం అంటే నీదేరా' అని భుజం చరుచుకోందామని చేతితో చాదని వదలిపెట్టేడు అది జరజర జారుకొంటూ 'దభీలు' మని నూతిలో పడ్డది.

సుబ్బారావు గుండెలో 'గుభీలు' మని ఓ బండరాయి పడింది. అరె ... తెల్లారి పది గంటలైనా ఇంకా సన్నాలు రాలేదే! కొంపతీసి ... '... మరి ఆలోచించలేక పోయేడు సుబ్బారావు. తడిపంచె వదలి పొడి బట్ట కట్టుకొని వాకిట్లోకి పరుగు లేసేడు.

'సీతా!... సీతా! నా కోసం సన్నాలుకాని వచ్చేడా? లేక ఇంకెవరైనా ఆఫీసు బంట్రోతు కాని ...'

సీతాలక్ష్మి అర్థం కానట్లు చూసింది.

'ఏమిటీ దెయ్యంపట్టినట్లు అలా చూస్తావుకే నిన్నే అడిగేది' అన్నాడు సుబ్బారావు ఆతృతగా.

'మీ మాటలు వింటుంటే దెయ్యమైనా పడుతుంది; పిచ్చయినా ఎత్తుతుంది. లేకుంటే ఏమిటండీ ఆ మాటలు? ఏదో పెద్ద ఆఫీసరు గారిలా ... ... రోజూ మీ కోసం బంట్రోతులూ, గుమాస్తాలూ వీధులు తిరుగుతున్నట్లు ...' అంది ఆక్షేపణగా.

సీతాలక్ష్మి మాట నూటికి నూరుపాళ్ళు నిజం. అయినా సుబ్బారావు చూస్తూనే వున్నాడు. తన కోసం మేనేజరు ఇంకా బంట్రోతుని పంపలేదేమని.

వీధి వరండాకున్న తడిక కదిలినట్లు చప్పుడయింది. ఎవరో వ్యక్తి వరండా దాటి వాకిటి గుమ్మంలో అడుగు పెడుతున్నట్లు గోడపైనున్న ఎండలో నీడపడింది. 'హమ్మయ్య' అనుకొన్నాడు సుబ్బారావు. ముందురోజు సాయంకాలం సహోద్యోగుల పొగడ్తలు మనసులో తిరగసాగేయి.

● [illegible]ద్రాష్టుడు : "ఏమిటండీ [illegible] అలా హాస్యాస్పదంగా ఏదు గెల్చుకున్నారేమిటి?"

మాష్టారు : "ఏమీలేదండీ, ఇప్పుడే కొత్త డిక్షనరీ పుస్తకం కొనుక్కొచ్చాను. దాంట్లో ఇంకో ఎడిషన్ రాక ముందే క్లోజు చేయిద్దామని."

"ఇంత ధైర్యం ఎక్కడ సంపాదించేవోయి? నిజంగా ఆత్మాభిమానమున్న మగాణ్ణనిపించుకొన్నావు ఇంతకాలానికి."

"ఈ సుబ్బారావు దగ్గర మన పప్పు ఉడకదని ఇప్పటికైనా మన మేనేజరుకి తెలిసొస్తుంది."

"మనం ఎలా నడుపుతే అలా నడిచే యంత్రం కాదని, అతనికి కష్టం, సుఖం, మంచి, మర్యాదా కావాలని:"

మంచితనాన్ని అలుసుగా తీసుకొనే మనుష్యులదగ్గర ఎలా మసలుకోవాలో నేర్చుకొన్నాడని, మేనేజరుకి మహా మంచి పాఠం నేర్పేవోయి సుబ్బారావు" అన్నారు అంతా సమూహగానంలా.

తోటి గుమాస్తాల ముఖాలలో తొణికిసలాడుతున్న సంతృప్తిని చూసి ఇంతకాలం ఆ మేనేజరు అడుగులకు మడుగులొత్తుతూ సాటి గుమాస్తాల మనస్సులను ఎంతలా నొప్పించేను. ఊరంతా ఒకదారైతే వులిపికట్టెకో దారి అన్నట్లు అయింది నా పని అని బాధపడ్డాడు సుబ్బారావు.

"ఓర్చినమ్మకు తేటనీరు అనేవారు పూర్వం; కాని, ఈనాడు ఎదురు తిరిగినవాడిదే ఏలుకో రాజ్యం" అంటారు. ఇంక చూడాలి సుబ్బారావు తడాకా. తెల్లారేసరికి మేనేజరు మంతనాలకి బంట్రోతుని పంపకపోతే నా పేరు మార్చుకుంటా" నన్నాడు పద్మనాభం.

"ఇంతకాలానికి నువ్వు ఇరవయ్యో శతాబ్దపు మనుష్యుల్లో పడ్డందుకు నా శుభాకాంక్షలు" అన్నాడు నీలకంఠం.

"ఈ సంతోష సమయంలో సుబ్బారావు మనందరికి కాఫీపార్టీ ఇయ్యాలి" అన్నారు ఎవరో. అంతా అయ్యరు హోటలులోకి దారి తీసేరు. "సుబ్బారావుకి ... జై ... విప్లవ వీరుడుకి ... జై" జయ జయ నాదాలు హోటలు గది నిండిపోయేయి. కడుపులో కాఫీ పడ్డంతో ఆవేశాలు హద్దుల్లోకొచ్చేయి.

మళ్ళా రేపు కలుద్దాం. ఏ సమయంలోనైనా మేమంతా నీకండగా నిలుస్తాము. ధైర్యంగా వుండు. నిజంగా నీలాటి వీరుడు మా మధ్య వున్నందుకు మేమెంతో గర్విస్తున్నాం" అన్నారు అనుయాయులంతా.

అందరిదగ్గర శలవు పుచ్చుకుని ఇంటిముఖం పెట్టేడు సుబ్బారావు. అతని వెనుక నీడలా అనుసరిస్తూ వస్తున్నాడు పున్నయ్య. సుబ్బారావు భుజంపై చెయ్యి పడింది.

"ఎవరు పున్నయ్యా? నువ్వు వాళ్ళతో వెళ్ళలేదూ?" సుబ్బారావు వెనుతిరిగి పలుకరించేడు.


"లేదురా ... ఇంతకీ ఏం జరిగిందో వివరంగా చెప్పరా నాయనా; వీళ్ళ పొగడ్తలకి ఉబ్బితబ్బిబ్బయి పోతున్నావు కాని, వీళ్ళంతా తడిగుడ్డతో గొంతుక కోసే రకంరా. ముఖం

ముందు ఒకటి, ముఖం వెనుక ఒకటి. చెప్పరా నాయనా ఏం జరిగింది?' అని ప్రశ్నించేడు పున్నయ్య. అతని మనసులో గూడు కట్టుకొన్న భయం ముఖంలో ప్రతిఫలిస్తోంది. 'ఏం జరిగిందా? ఏం జరగాలో అదే జరిగింది.' సుబ్బారావులో వున్న మత్తు ఇంకా దిగి రాలేదు.

సహనానికి, సాధుత్వానికికూడా ఒక హద్దంటూ ఉంటుంది. అతి సాధు జంతువు అనుకొనే పిలికూడా ఒక గదిలోపెట్టి తన్నబోతే ఎదురు తిరిగి గుడ్లు పీకుతుంది. అంతమాత్రంచేత పిల్లి శౌర్యమైన జంతు వనగలమా? దానికి బైటపడిందికి మార్గం లేక— ఆత్మ రక్షణార్థం తనలో లేని క్రౌర్యాన్ని ఉత్పన్నం చేసుకొంటుంది. ప్రాణానికి తెగించి పోరాడుతుంది కాని అపాయం తప్పిన అర క్షణంలో దాని ధైర్య స్థయిర్యాలు మాయమైపోతాయి. మళ్ళా మూల మూలల నక్కుతూ భయంగా మ్యావు .. మ్యావు మంటుంది.

పున్నయ్య విడిచిన నిట్టూర్పుతో అదే పరిస్థితిలోనే పడ్డాడు సుబ్బారావు. ఒకమూల సహోద్యోగుల పొగడ్తలు, నాగ్దానాలు ఉత్తేజపరుస్తున్నా మనసులో ఏదో భీతి లోలోపల పీకుతూనే వుంది. విధి వక్రించి అనుకొన్నట్లు కాకపోతే ...?

'పోవోయ్; మేమంతా నీ అండ లేముటోయి? మేనేజరుతో వాదులాడి అవసరమైతే స్ట్రయికులాటిది జరిపించి న్యాయం జరిగేలా చూస్తాము. లేకుంటె తన అజాగ్రత్త వల్ల పోడైన రికార్డంతా రాత్రల్లా మేలుకొని నిన్ను రాయమంటాడా?



మళ్ళా ఒక్క మంచిమాటైనా నీ గురించి పైకి రాయలేడేం? పాపం నువ్వు యంత్రానివనుకొన్నాడు. బలే ... మంచిపని చేసేవు సుబ్బారావు. నువ్వు చెప్పిన జవాబుతో అయ్యగారి అహంకారం కొంత తగ్గి ఇంక కాళ్ళబేరానికొస్తాడు. లేకపోతే మనబతుకులన్నీ తనచేతిలో వున్నట్లు మాట్లాడుతాడు. నిజానికి సోద్దాఫీసులో వీడిని చూసేవాడే లేడు. వీడి మాటంటే ఎవరూ ఖాతరే చెయ్యరుట. మా బావమరిది, తోడల్లుడి పినమామగారు అక్కడే పని చేస్తున్నారు. ఆయన చెప్పేడు. మన నీలకంఠం అంటాడు గదా, మనమంతా కలసి ఒక అర్జీ రాసేమంటే వీడిక్కడినుంచి లేకముడవ్వాల్సిందే అంటాడు." బుచ్చిబాబు మాటలు సుబ్బారావుకి ఇంకా మనస్ఫుకరాలేదు.

ఏ విధాన చూసినా తన భయానికి ఆస్కారం లేదనుకొన్నాడు సుబ్బారావు, 'దీంట్లో కంగారు పడింది లేదురా వున్నయ్యా' అన్నాడు. 'ఈ మేనేజరుకి ఇలాంటి ఎదురుదెబ్బలు అలవాటేరా. కన్నంలో తేలు కుట్టిన దొంగలా నోరు మూసుకొని మనని మంచి చేసుకొందికే ప్రయత్నిస్తాడు కాని, పైకి రాయడురా" అన్నాడు.

'ఏమిటో ఆ ధైర్యం?' వెనక నుండి రాఘవేంద్రం గొంతుక వినిపించింది.

'ఇదివరలో అనుభవాలు' సుబ్బారావు జవాబు.

'ఎవరివి?'

'మాకెవరివి? నీలకంఠం. పద్మనాభం.'

'ఓరి దద్దమ్మా ఆ కథలన్నీ నిజమనుకొంటున్నావా?'

'కథలా?'

'కాక ... వీళ్ళంతా నిజంగా జరిగినట్లు .'

'ఎవరిమీదోయి రాఘవేంద్రం; ఆ దండయాత్ర?' నీలకంఠం ప్రశ్నించేడు.

'పార్కుకి పోతానన్నావు, వెళ్ళలేదా?' సుబ్బారావు ప్రశ్నించేడు.

'లేదు ... ఈ వీధిలో మా బంధువొకాయన ఉంటే చూసి పోదామని ...'

'మరి కొంచెం విషం నీ గొంతుకలో పోసిపోదామని ...' వున్నయ్య నీలకంఠాన్ని మనస్సులో తిట్టుకొన్నాడు.

సుబ్బారావు అందరిదగ్గర శలవు పుచ్చుకొని ఇంటి గుమ్మం ఎక్కేడు.

'ధైర్యంగా వుండు సుబ్బారావు' నీలకంఠం హెచ్చరిక.

'దైవాన్ని ప్రార్థించు' వున్నయ్య విలాప శోకం.

రావు" అని పిల్చేడు.

సన్నాలు కాడు. ఇంకే ఆఫీసు బంట్రోతు కాడు. పున్నయ్య. సుబ్బారావు బాల్యమిత్రుడు. శ్రేయోభిలాషి అయిన పున్నయ్య.

"ఎవరు? పున్నయ్యా!"

అవును ... నేనే..."

"రా ... ఇలా వాకిట్లోకి ... ఈ రోజు ఆఫీసు మీద లేదుకదా అని విశ్రాంతి తీసుకొంటున్నాను."

"ఇంత ఆఫీసు మీద నీకు పూర్తిగా విరగడయిందిలే" మనసులో అనుకొన్నాడు పున్నయ్య.

"ఏం ఈ రోజు నువ్వు ఆఫీసుకి పోలేదా?"

"కూర్చొబుద్ధి కాక శలవు పెట్టేను."

"ఎలావుంది సంగతి?"

"ఏమ్మాకి నీరెత్తినట్లు."

"నా విషయం ..."

"ఎవరికావాలి?"

"మేనేజరు ఏమంటున్నాడు?"

పున్నయ్య కళ్ళల్లో నీళ్ళు తిరిగేయి.

"ఏమిటి పున్నయ్యా?" సుబ్బారావు గాభరాగా మంచంమీంచి లేచేడు.

సుబ్బారావుని కౌగలించుకొని బావురుమన్నాడు పున్నయ్య.

"ఏమైంది పున్నయ్యా?"

సుబ్బారావు గొంతుక జీరపోయింది.

"ఏది జరగకూడదో అదే జరిగింది." రాఘవేంద్రం లోపలికి వచ్చేడు.

"నీ లాంటి అమాయకులుండవలసిన లోకం కాదురా ఇది".

"నీకు బదులుగా మేనేజరు కాళ్లు పట్టుకొని ప్రార్థించేను. బీదవాడు ఏదో తెలియక అన్నాడు. ఈసారికి క్షమించమన్నాను. లాభం లేకపోయింది. రాత్రంతా వాళ్ళు విషం రంగరించి పోసేరురా. ఒక్కడంటే ఒక్కడు నీ తరపున మాట్లాడలేదు." అన్నాడు రాఘవేంద్రం.

"ఎవరిమాట నీ వంటున్నది?"

"ఎవరైతే నిన్ను విప్లవ వీరుడవని నిన్న తెగ పొగిడేరో ఆ మిత్రులే. ఏ ఎండకా గొడుగు పట్టే, మదిలో విషం పెదిమల అమృతం నింపుకొని మాట్లాడే నీ మిత్రులే." పున్నయ్య బాధగా అన్నాడు.

"వాళ్లు మిత్రులు కారు. శత్రువులు" రాఘవేంద్రగొణుక్కున్నాడు. సుబ్బారావు చెవుల్లో వారి మాటలు దూరలేదు. ఒక్కసారిగా జ్వలించి ఆరిన జ్యోతిలా నిస్తేజంగా మంచం మీద వాలిపోయేడు.


ఆంధ్రా
కాఫీ పొడి
ప్రధమశ్రేణి కాఫీవిత్తనములను నేర్పుతో
ఎన్నికచేసి, నైపుణ్యంతో గింజలను మిశ్రమపరచి,
అనుభవజ్ఞానముతో శాస్త్రీయముగా రోస్టుచేసి,
నాణ్యతను సంరక్షించు ప్యాకింగ్‌లో
తాజాగా మీకు మార్కెట్టులో దొరుకునట్లు
సరఫరా చేయబడుచున్నది.
ఆంధ్రాకాఫీ
ఉల్లాసప్రదమైనది!
G.V.RAO.
ఆంధ్రా కాఫీ యిండస్ట్రీ
హెడ్డాఫీసు: బ్రాడీపేట 2 లైను, గుంటూరు-2.
బ్రాంచీలు: బ్రాడీపేట, పట్నంబజారు (గుంటూరు) బాపట్ల, నర్సారావుపేట, సత్తెనపల్లి, హైదరాబాదు, చీరాల, తెనాలి.
ఏజన్సీలు: బందరు, అవనిగడ్డ ...

చదువుకున్న కమల

ముప్పాళ రంగనాయకమ్మ

(గత సంచిక తరువాయి)

"ఆవిడతో దెబ్బలాడమని నేనేం చెప్పటంలేదు సందర్భాన్ని బట్టి కొంచెం ఖచ్చితంగా మీ అభిప్రాయం చెప్పెయ్యాలి. మొన్న పొగాకు కంపు వచ్చిందని కాఫీ మానేశారు. ఇవ్వాళ అన్నం మానేశారు. రేపు మరేదో అవుతుంది.

'అమ్మా! మనం మంచి వస్తువులు కొనుక్కొని ఇలాంటి తక్కువ రకం సరుకులు తినడం ఏమిటి? నువ్వేమనుకున్నా సరే! నాకేం యిష్టంలేదు. ఎంతో అత్యవసరం అయితే తప్ప మనం ఒకరింటికి అప్పు కెళ్ళనూ వద్దు. ఇతర్లకి అప్పు ఇవ్వనూ వద్దు' అని ఓసారి మీ రనేస్తే బావుండదూ?"

మధుమూర్తి అదో మాదిరిగా నవ్వాడు—"నువ్వు చెప్పటం చెప్పేశావు కమలా! నేను ఆవిడ ఎదట నిలబడి ఆ మాటలు నాలుగూ అనద్దూ?"

విస్మయంగా చూసింది కమల.

"ఇన్నేళ్ళుగా నేను పట్టించుకోని విషయాన్ని ఇవ్వాళ అంత ఖచ్చితంగా అడిగితే—నువ్వే నాకలా చెప్పి పెట్టావని ఆవిడ అనుకొంటుంది."

అనుకుంటే అనుకోనివ్వండి. ఏళ్ల తరబడీ తెలుసుకోలేని లోపాలు ఏదో ఓరోజు తెలిసివస్తాయికదా?—ఆవిడేమనుకున్నా నాకేం ఫర్వాలేదు. పోనీ ఈ పద్ధతులన్నీ మార్చుకుంటే చాలు."

"అది అసంభవం కమలా! ఈ పద్ధతులన్నీ ఆవిడలో జీర్ణించిపోయి వున్నాయి. అతి సామాన్యంగా తెలుసుకోవాల్సిన ఆడవాళ్ళ విషయాల్లో నేనేం కలగజేసుకున్నా బావుండదు నువ్వుచెప్తోనే ఉన్నావు కదా? వినాలంటే వినకూడదూ?"

"అదంతా నాకు అనవసరం! ఈ విషయంలో మీ రావిణ్ణి హెచ్చరిస్తారో లేదో చెప్పండి."

"నువ్వలా కోపం తెచ్చుకోకు. అదిమాత్రం నావల్లకాదు. చదువుకున్న కోడలివికాబట్టి మీ అత్తగార్ని నువ్వే మార్చుకో."

కమలకి చాలా కోపం వచ్చింది.

అది తల్లిపట్ల అభిమానం అనటం కన్నా చేతకానితనం అంటే బావుంటుంది.

పెద్దవాళ్ళే పెళ్ళి ఒక సంసారం

అంటూ ప్రారంభించిన తర్వాత ఇంత బాధ్యతా రహితంగా తప్పు కోవటం క్షమార్హంకాదు.

కమలకి అంతకన్నా ఎక్కువేం ఆలోచించబుద్ధికా లేదు. సాయంత్రం సాయంత్రం శేషమ్మ అంది—"ఒసే కమలా! ఓ శేరు బియ్యం ఏరు. పొద్దున్న కూడా వాడు సరిగా తిండి తినకుండా పోయాడు."

కమల చదువుతోన్న పుస్తకం ముయ్యలేదు—

"ఏరటానికి అవేం కన్పిస్తున్నాయా? బియ్యంలో కలిసే పోయాయి తెల్లగా."

నిజానికి మధుమూర్తి కోసం చెయ్యాలి అంటే గింజ గింజ చొప్పున ఎంచి ఏరగలదు కమల. కానీ ... ఇష్టంలేదు.

"అయ్యో! కళ్ళున్న పడుచుదానివి. కన్పించక పోవడం ఏమిటే? — పోనీ నీళ్ళలో పోసి గాలించు. రాళ్ళు అడుక్కు పోతాయి"

గాలించడం భలే సరదాగా వుంటుంది. అయినా కూర్చున్న చోటునుంచి లేవకుండా "నాకు గాలించడం రాదుబాబూ!" అంది. శేషమ్మ కోడలి జవాబులకి విసుక్కుంది.

"నీకు అన్ని పనులూ వచ్చునంటావుగా?" అంది వెటకారంగా.

"వచ్చిన పనులన్నీ చెయ్యటానికైనా ఫలితం వుండాలి. రాళ్ళ బియ్యం ఈ నెల మనకి కొత్త కాదుగా? బియ్యంతోపాటు రాళ్ళు కూడా మింగేసి జీర్ణించుకోవటం అలవాటు చేసేసుకుంటే ఏ ఇబ్బందీ వుండదు. నెలనెలా ఎంతకని ఏరుకోగలం?"

కమల మళ్ళా పుస్తకంలోకి చూపులు తిప్పుకొంది. కోడలి నిర్లక్ష్యానికి శేషమ్మ ఒళ్ళు భగభగలాడింది. మిర్రున చూస్తూ అంది— "నాకు తెలీ కడుగుతానూ? ఈ రోజుల్లో నీళ్ళుకలవని పాలూ-రాళ్లు కలవని బియ్యం — ఎవరికి మాత్రం దొరుకుతున్నాయి? కాకపోతే కాసిన్ని ఎక్కువా తక్కువాను. మనమేం పొలాలు దున్ని పండిస్తున్నామా?— అయినా దొంగచాటుగా సారా తయారు చేసినట్టే... మిల్లులో ఏవో పెట్టి రాళ్ళు కూడా తయారు చేసిబియ్యంలో కలుపుతున్నారటగా! మొన్న అనసూయా వాళ్ళింట్లో కూర్చుంటే ఏదో కబురు వచ్చి చెప్పింది. వ్యాపారం చేసేవాళ్ళు పనికట్టుకుని కలుపుతోంటే మనం చచ్చినట్టు ఏరుకోవాలిగానీ గింజుకు పోవటం ఎందుకూ?" అత్తగారి లోకజ్ఞానానికి ఆశ్చర్య పోయింది కమల.

శేషమ్మ మళ్ళీఅంది— "బియ్యం తెల్లగా రావటానికే తెల్ల రాళ్ళు కలుపుతున్నారనీ— మంత్రిగా రెవరో అన్నాడటగా? ఆ ముక్క నిజమేనేమో! బియ్యం ఎర్రగాఉంటే తిని చావలేంగా?"

అత్తగారికి రాజకీయ పరిజ్ఞానం కూడా వుండటం చూసి కమల **మూర్ఛపోయింది.**

"బియ్యంలో రాళ్ళు కలపటం మీ కోసమే ప్ర... ...వాడు ఎక్కరటి ...య్యాం అని చూపలేరు" అన్నారు మంత్రిగారు. మళ్ళామాట్లాడితే — "అది వ్యాపార లక్షణం, ఏ గూటి పిట్ట ఆ గూటి పలుకు పలికి ... పని ధర్మం వాళ్ళు నిర్వర్తించాలి పొమ్మన్నారు

"బియ్యంలో రాళ్ళు క... ...నందుకు మంత్రిగారే నోరుమూసుకు



ఊరుకుంటే — ఆ బియ్యం అప్పు తీరిస్తే తీసుకోవటం నా తప్పా?' అని తేల్చేసింది శేషమ్మ.

ఇంతకీ తప్పు మంత్రిగారిదో అత్తగారిదో అర్థం కాకుండా పోయింది కమలకి.

అయినా అత్తగారు రాళ్ళబియ్యం తీసుకుంది కాబట్టి ఎన్నయినా సమర్థించేసుకొంటుంది. కానీ మంత్రిగారికేం లాలోచీ చెప్మా వ్యాపార లక్షణం వెల్లడించటానికి? అదే బోధపళ్ళేదు కమలకి.

ఏ మాట కామాటే అనుకోవాలి గానీ పిల్లి పురిటిదగ్గిర్నుంచీ రాజకీయాలమీద దండెత్తటం ఎందుకూ? మనిషి గుండెల్ని మరమ్మత్తు చెయ్యటం కూడా రాజకీయాల లక్షణమేనా?

నేరం చేస్తున్నప్పుడే శిక్షప్రసక్తి వస్తుంది. అసలు నేరం ఎందుకు జరగాలి? నీతి నిజాయితీలతో మనిషి మనిషిలా బ్రతికితే ఏ దండ ప్రయోగాలూ అవసరం లేదుగా?

స్వతంత్ర రాజ్యంలో స్వేచ్ఛా వాయువులు పీల్చుకొంటూ — మానవత్వాన్ని బ్రతికించుకొంటూ-నిశ్చింతగా — హాయిగా — ప్రశాంతంగా జీవించే అవకాశాన్ని ఎందుకు సద్వినియోగం చేసుకోకూడదు?

తప్పులుచేస్తోన్న సాటివ్యక్తిని విమర్శించలేని వాళ్ళు - వాడికి శిక్ష వెయ్యలేదని ప్రభుత్వాన్ని దుయ్యబట్టటం ఎందుకు? మంత్రుల్ని మానవాతీతులుగా భావించటం ఎందుకు? - మంత్రికి వున్న అధికార శక్తిని - అన్ని విషయాల్లోకి [illegible]కించాలనటం— నిరంకుశత్వాన్ని ఆహ్వానించటం కాదా? అత్తగారు తన అప్పుల వ్యవహారానికి మంత్రిగార్ని అడ్డం వేసుకోవటం నచ్చలేదు కమలకి. మాటా పలుకూ లేకుండా పుస్తకం పట్టుకుని గదిలోకి పోయింది.

"బావుంది దేవ్ నీ వరస. గుర్రొచ్చి పిల్లని వెక్కిరించినట్టుంది. ఈ నాటికి నువ్వొచ్చావని నా మంచి చెడ్డలన్నీ మానుకుంటాను కాబోలు." అంటూ శేషమ్మ కూడా లేచి చేటలోవున్న రాళ్ళబియ్యం ఓ చిల్లు తెపాళాలో పోసి మూల పడేసింది - ఏ కరివేపాకో కొంటూనే. ఏం చెయ్యను మరి? నాకేం రేళ్ళున్నాయా ఏరి చావటానికి?' అని స్వగతం చెప్పుకొంది కోడలికి వినిపించేలా.

కమల ఎందుకో జానికమ్మగారి యింటికి వెళ్తే ఆవిడ కమలను చూసీ చూడగానే అడిగేసింది.— "మా అత్తగారు ఓ గ్లాసుడు పంచదార తీసుకెళ్ళిందమ్మా నెల్లాళ్ళ కిందట.

---

* తెలుగు నాటకాలు నాలుగు రకాలు : పౌరాణిక నాటకాలు, చారిత్రక నాటకాలు, సాంఘిక నాటకాలు, పరిషత్తు నాటకాలు.

మర్చిపోయిందా ఏమిటి? ఓ సారి చెప్తావూ?"

కమలకి తల తీసేసినంత పనైంది.

"అలాగేనండీ! వెళ్ళగానే చెప్తాను" అంది. రాగానే చెప్పింది కూడాని — "జానకమ్మగారికి పంచదార బదులు తీర్చలేదుట గా? మీకు చెప్పమంది. ఇలాగే అప్పులకి వెళ్ళే మర్చిపోవటమో ఏదో ఒకటి అవుతుంది, అందుకే నేను ...' అంటూ అర్థవంతంగా వూరుకొంది.

"మర్చిపోవటం ఏమిటి. వారం తిరక్కుండానే ఇచ్చేశాను. అప్పు తీర్చలేదందా? నువ్వేమన్నావూ?"

"నాకేం తెలుసు? అలాగే చెప్తానన్నాను."

"నాకేం ఖర్మే అప్పు ఎగవెయ్యటానికి?"

"ఆరోజు వాళ్ళింట్లో ప్రభావతి కూడా వుంది. నేను పంచదార యివ్వటం చూసింది. కాస్త తీసి నోట్లో వేసుకుందికూడాను, దాన్ని సాక్ష్యం పెట్టి చెప్పించనూ?" అంటూ ఎగిరింది శేషమ్మ.

శేషమ్మ ఇచ్చేశానంటుంది.

జానకమ్మ యివ్వలేదంటుంది.

ఎవర్ని నమ్మాలో కమలకి అర్థం కాలేదు.

దొందూ దొందే! శేషమ్మ జానకమ్మలాంటిదే! ఎవరి నిజాయితీ మీదా కమలకి నమ్మకం లేదు. నిజానిజాలు దేవుడికి తెలియాలి. దేవుడు శేషమ్మ అప్పు సంగతి గమనించి ఉంటాడా?

"సాక్ష్యాలూ — రుజువులూ ఎందుకు? ఏదో ఒకటి అయింది. ఓ గ్లాసుడు పంచదార మళ్ళా యిచ్చేసి యికముందు అలాంటి గొడవలు రాకుండా చూసుకొంటే సరి" అంది కమల.

"అదేం మాట? లోసుగు నాలోనే వున్నట్టు మళ్ళా అప్పు తీర్చనా? నువ్వా నాకు చెప్పేది?" అంటూ విరుచుకుపడింది అత్తగారు. తర్వాత శేషమ్మా జానకమ్మా మాటామాటా అనుకున్నారు రాకపోకలు బందు చేసేసుకున్నారు—

● ● ●

కమలకి నచ్చని మరో విషయం ఇంటి శుభ్రత - ఇంట్లో వస్తువులు సర్దుకోడం—వగైరాల గురించి.

ఇల్లు బొత్తిగా అంత చిన్నదేం కాదు.

రెండు పెద్దగదులూ ఓ సామాను గదీ—వరండా — వరండాలోనే ఓ చివర వంటగదీ—కాస్త విశాలంగానే పెరడూ—బస్తీలో ఆ మాత్రం యిల్లు దొరకడం అదృష్టమే.

అయితే యిలు యిల్లులా కన్పించదు. గడపలో కాలుపెడితే మతిపోయినట్టు వుంటుంది. ఇంట్లో ఏ వస్తువులకీ ఓ స్థల నిర్ణయం లేదు. ఇవ్వాళ గదిలో వున్న వస్తువు రేపు ఆ చుట్టుపట్ల కన్పించదు.

గిన్నెలూ గ్లాసులూ పట్టుంనే బల్ల బిడ్డోడుతూ వుంటుంది.

ముసలాయన వీధిలోకి తొడుక్కుపోయే జోళ్ళు బట్టల పెట్టెల వెనక వుంటాయి. నిద్రపోయి లేచిన పక్క బట్టలు వుండల్లా చుట్టి పెట్టెలమీదికి విసిరేసి వుంటాయి. కట్టి విప్పిన బట్టలకు చాకలి పెట్టె వుండనే వుంది. అయినా ఆవిడ చీరలూ — ఆయన చొక్కాలూ, పంచలూ—కిటికీ రెక్కల మీదా — తలుపు గడియలలోనూ — మంచం కోళ్ళపైనా రోజుల తరబడి వేళ్ళాడుతూ వుంటాయి. ముసలాయన పడుకునే నవ్వారు మంచం వదులైపోయి బదీ దూరదూరంగా జరిగి— పెద్దపెద్ద ఖాళీలు పడి ఎప్పుడు చూసినా ఒక్క స్థితిలోనే ఉంటుంది. కొబ్బరినూనె సీసా—చిన్న గూట్లోనూ ఇవ్వాళ బల్లమీదా— రేపు కిటికీలోనూ ఎల్లుండి మంచం క్రింద—ఆ మర్నాడు?

ఎప్పుడూ చేతుల్లోనో బుట్టల్లోనో రకరకాల బియ్యం. ఆ బియ్యం చేటలు మంచం కిందికి గెంటుతుం.

సామాను గదికి ఓ పద్ధతీ పాడూ వుండదు. డబ్బాలన్నీ ఎప్పుడూ నూరి జిమ్మినట్టు నుసినుసిగా చేతులనిండా జిడ్డు అంటుకునేలా వుంటాయి. గోడల నిండా ఎన్ని కన్నాలో — ఎన్ని మేకులో — ఎన్ని ఫోటోలో— ఎన్ని సినిమా బొమ్మలో — వాటి వెనకాల ఎన్ని బూజులో — ఎన్ని దోమలో — ఎన్ని నల్లులో కూడా అంచనా తెలీదు.

ఆ పరిస్థితంతా కమల అత్తవారింటికొచ్చినాటిది.

'గృహమే కదా స్వర్గసీమా!' అన్నట్టుగా ఇంటిని అందంగా తీర్చిదిద్దుకోవాలన్న అభిలాష కమలకి స్వతహాగానే వుంది.

పైగా — ఆ యింటిని సరిదిద్దాల్సిన అవసరం కూడా ఎంతో వుంది.

కాస్త కొత్త వదిలించుకుని ఆ తీర్చిదిద్దటానికి ఉపక్రమించింది కమల.

అత్తగారు వుండగా తను ఏ వస్తువు ఎలా సర్దగలదు? ఏం చెయ్యబోయినా—

'ఆదేమిటి! అవన్నీ కదుపుతావెందుకూ? అలా వుండనీ!' అంటుంది శేషమ్మ.

పెట్టెలన్నీ ఓ వరసలో పెట్టుకోవచ్చు. డబ్బాలన్నీ శుభ్రంచేసి సర్దుకోవచ్చు. ఎప్పటికప్పుడు మాసిన బట్టలు చాకలి పెట్టెలో పడేస్తూ వుండచ్చు. వీధులు తిరిగే చెప్పులు వరండాలో పెట్టుకోవచ్చు.

కొబ్బరినూనె సీసా ఎప్పుడూ గూట్లోనే — సబ్బుపెట్టె ఎప్పుడూ బాత్‌రూంలోనే — చేటలూ బుట్టలూ సామానుగదిలో—చీటికీ మాటికీ పడుకునే ముసలాయన్ని

[illegible] *

కిటికీవార మంచంనిండా తెల్లటి పక్క—అలా ఏదో సాధ్యమైనంత వరకూ చేద్దామనుకొంది కమల.

ముసలాయన రోజూ స్నానం చేసి విడిచిన అంగవస్త్రం వరండాలో కిటికీ రెక్కమీదే ఆరవేస్తాడు. అది ఓ గంట వరకూ నీళ్ళోడుతూ వుంటుంది. పిడసలా ఎండి కాని గుడలా అసహ్యంగా కన్పిస్తూ వుంటుంది.

కమల ఓ రోజు ఆ గుడ్డ తీసి దొడ్లో దండెంమీద ఓ వారగా ఆరేసింది.

ముసలాయన స్నానానికివచ్చి— "అంగోస్త్రం ఏదర్రా?" అన్నాడు.


"ఇదిగో. ఇక్కడే వేశాను మామయ్యా!" అంటూ ఆ గుడ్డ తెచ్చి యిచ్చింది.

స్నానానంతరం యథాతథంగా అంగోస్త్రం కిటికీమీదకే ఎక్కింది.

కమల మళ్ళా తీసి వాకిట్లో వెయ్యబోయింది. "దాన్ని అక్కడ వుండనీ! రోజూ ముసలాయన వెదుక్కో లేడు." అంది శేషమ్మ.

"పోనీలే తీసి యిస్తూ వుంటాలెండి. ఎదరగా కిటికీమీద వుంటే ఏం బావుంటుంది?" అంది కమల.

కోడలు ఇంట్లో సరుకులన్నీ తిరగవేసి ఎందుకు సర్దుతోందో అప్పటికి అర్థమైంది శేషమ్మకి. ఇన్నాళ్ళుగా కాపరం చేస్తోన్న తననీ, తన యింటినీ కోడలు రకరకా—



లుగా విమర్శించటం, ఏదో మార్చెయ్యాలని ప్రయత్నించటం ఆవిడకేమీ నచ్చలేదు.

"అసలీ యింట్లో ఎవ్వరికీ ఎలాంటి మార్పూ గిట్టదేమో" అన్పించింది కమలకి.

అత్తమామలు మాత్రం కలిసి రాలేదు ఖొత్తిగా. సరే! ఆ సౌందర్యకాంక్షకాస్తా తన గదివరకే పరిమితం చేసుకోక తప్పలేదు భర్త గారి సలహామీద.

మధుమూర్తి పెళ్ళాంపట్ల భయంతోటో భక్తితోటో కమల చేస్తోన్నదంతా చూస్తూ వూరుకోవటంచేత - పదగ్గది గోడలకు కిక్కిరిసి వేళ్ళాడుతోన్న చెదల ఫోటోలూ - బంకి బొమ్మలూ పాత కేలండర్లూ - ఊడదీసి ఓ పాత పెట్టెలోపడేసింది. మేకులన్నీ వూడలాగి గోడలన్నీ పరిశుభ్రంగా దులిపేసింది.

గుమ్మాలకి ఎదరెదరగా మాత్రం రెండు కొత్త చిత్రాలు తగిలించింది.

కొండలమీదినుంచి పడుతోన్న జలపాతం-క్రింద సరోవరంలో జలక్రీడలాడుతూ తామరతూళ్ళు ముక్కులతో పొడుస్తోన్న హంసజంటలూ!

సస్యశ్యామలంగా- అపారంగా - విస్తరించివున్న పచ్చికలో ఛెంగుఛెంగున గంతులేస్తోన్న తెల్లటి ఆవుదూడలు!—

ఆ రెండు చిత్రాలూ క్షణకాలం వాస్తవాన్ని మరిపించేసి - నేత్రానందం కల్గించేంత రమణీయంగా వున్నాయి.

తర్వాత గదిలో అల్మైరాలోంచి ఖాళీ సీసాలూ-డబ్బాలూ - వగైరాలన్నీ తీసేసి పుస్తకాలు కొన్ని కొన్ని బట్టలూ సర్దింది.

దోమతెర మంచం—టేబిలూ — దానిమీద రేడియో అలారం టైంపీసూ—ఓ పక్కగా రెండు కుర్చీలూ—మంచానికి తల వైపుగా స్టూలుమీద టేబుల్ ఫేనూ—గుమ్మాలకూ-కిటికీలకూ-లేతరంగు తెరలూ గడప దగ్గర కాళ్ళు తుడుచుకునే మెత్త: పడకగది చాలా డీసెంట్‌గా తయారయింది. గదిలో అడుగు పెట్టిన మధుమూర్తి క్షణం విస్మయంగా చుట్టూచూసి, ఆనందం వెల్లడించాడు — "చాలా బావుంది కమలా! అబ్బ! ఎంత సింపుల్‌గా, ఎంత నీట్‌గా తయారు చేశావు! అరె! గది చాలా పెద్దదిలా వుంది కదూ? మెనీమెనీ థాంక్స్ యూ సీకూ."

"ఎందుకూ?"

"ఇంకెందుకు? ఓ గంట ఇంట్లో కూర్చున్నా ప్రాణం సుఖపడేలా వుంది."

"సంతోషించాంగానీ ఆ చిత్రాలు రెండూ చూడండి."

"చూశాగా? ఆ ఆవుదూడలు ఎంత ముద్దుగా వున్నాయో! కమలా! మనం ఓ ఆవుని

కొందామా ? ఈ పచ్చగడ్డి తిని పాలిస్తుంది."

"అబ్బే! మళ్ళీ ఆవుని కొనడం ఎందుకూ? ఆ దూడలన్నీ పెద్దవై ఆ పచ్చగడ్డితిని పాలిస్తాయి."

ఇద్దరూ నవ్వుకున్నారు.

"ఐతే ఫోటోలన్నీ ఏంజేశావు ? చిన్నప్పుడు నా స్కూలు ఫోటోలూ మా అక్కయ్య పెళ్ళి ఫోటో – మా ఫ్రెండ్స్ ఫోటోలూ చాలా వున్నాయే!"

"నేనేం మింగలేదు. అన్నీ లక్షణంగానే వుంచాను. సాయంత్రం మీరు మరో పని చేయండి. కాస్త పెద్దఆల్బమ్ కొనుక్కురండి. ఫోటోలన్నీ, అద్దాలూ ఫ్రేంలూ వూడదీసి ఆల్బమ్‌లో పెడదాం. అవి ఎలాగూ చెదలుపట్టి, మరకలుపడీ అసహ్యంగా వున్నాయి."

"మా ఆఫీసులో తీయించుకున్న గ్రూఫ్ ఫోటోలవీ చాలా పెద్దవిగా?"

"పెద్దవన్నీ లెదర్ కేస్‌లో పెడదాం. చిన్నవన్నీ ఆల్బమ్‌లో పెడదాం. అంతేగానీ, మన చిన్ననాటి ముచ్చట్లు – అచ్చట్లు – పెళ్ళిళ్ళూ, పేరంటాలూ – వ్రతాలూ నోములూ – మన పెద్దలవీ చిన్నలవీ. చిన్నలవీ – చుట్టాలవీ, బంధువులవీ – స్నేహితులవీ, శత్రువులవీ – అలా జీవితం పొడుగునా వందలకొద్దీ ఫొటోలు సంపాదించి గోడలకి తగిలించావంటే – మరో నాలుగిళ్ళు తీసుకోవాలి. అవునా ?"

కాస్త ఆలస్యంగానైనా కమలతో ఏకీభవించాడు మధుమూర్తి. ఎవరు చెప్పినా —ఏం చెప్పినా అందులో ఏమైనా కాస్త మంచివుంటే అంగీకరించటం-ఆచరించటంలో తప్పేమీ కాదు. అదే అనుకున్నాడు. మధుమూర్తికూడా.

శేషమ్మ కూడా వచ్చి కోడలి గది చూసింది ఎగాదిగా—

"బాగానే వుంది.ఏమో! ఈ షోకులు అవీ నాకేం తెలుస్తాయా చస్తాయా? అయితే మాత్రం ఆ ఫోటోలన్నీ వూడదీసుకోవటం ఎందుకూ ? నిక్షేపంలా వుండేవి." అంటూ వెళ్ళిపోయింది. కాస్సేపు తనలో తను సణుక్కొంటూనే వుంది. అయినా ఆ మార్పు ఆవిడకేమంత నచ్చినట్లు

● మొదటి కంట్రాక్టరు : చూడవయ్యా! గవర్నమెంటు నుంచి 50 లక్షల కాంట్రాక్టు కొట్టాను.

రెండోవాడు : ఇదేం నమ్మదగ్గదిగా లేదే!

మొదటివాడు : కావలిస్తే చూసుకో! వాళ్ళు ఆర్డర్స్ కేన్సిల్ చేస్తూ వ్రాసిన కాగితాలు.



మన విద్యార్థులను చూచి మనం గర్విస్తున్నాం. దేశం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోందని వారికి తెలుసు. వారు తమ పాత్రను నిర్వహించడానికి త్వరపడ్డారు. ఎన్.సి.సి.లో చేరి రక్త దానమును చేస్తామని ముందుకు వచ్చారు. దేశరక్షణ కార్యములలో పాల్గొని దేశరక్షణ నిధికి విరాళాలు పోగు చెయ్యడానికి సహాయపడ్డారు. ఇన్ని పనులు చేస్తున్నప్పటికీ తమ చదువును అశ్రద్ధ చేయలేదు. ఎందుకంటే దేశానికి తమ శక్తి సామర్థ్యములు అవసరమని వారికి తెలుసు. అవును నిజమే. మన విద్యార్థులు దేశానికి సేవ చేస్తున్నారు. మీరు చేస్తున్నారా ?

భారత దేశ రక్షణ
భారత ప్రజల బాధ్యత

DA 65 F

లేదు. పొత్తిగా నచ్చక పోనూ లేదు.

ఆ మర్నాడు కమల పదకొండు గంటలవేళ అన్నం తిని గదిలో కాలు పెట్టి విస్మయంతో ఆగిపోయింది.

వెంకట్రామయ్య దోమతెరతో పరుపుమీద పడుకుని వున్నాడు. రేడియో అందీ అందని స్టేషన్‌తో గోలగోలగా పాడుతోంది.

కొడుకూ కోడలూ పడుకునే పక్కమీద ముసలాయన ఎంత ఇంగితం లేకుండా పడుకున్నాడో గానీ—తను పడుకునే పక్కమీద మామగారు పడుకోవటం చూస్తే కమల మనస్సంతా అసహ్యంతో కుతకుత లాడిపోయింది. ఆ చిరాకులో విసురుగా వెళ్ళి పక్కనున్న రేడియో ఆపుజేసేసింది.

"అయ్యో మీ మామగారు సరదాపడి పెట్టుకున్నారే! కట్టేశావేం?" అంటూ రాగం తీసింది శేషమ్మ. కమల పట్టించుకోలేదు.

ముసలాయన కళ్ళు తెరిచి కోడల్ని చూశాడు—'ఒసే! కొంచెం పంకా తిప్పు. నాకు చెమటలు పోతున్నాయి. కాసేపు ఈ ఘడియ పడుకుని లేస్తాను,' అంటూ ముసుగు తీసుకున్నాడు.

కమల పొత్తిగా ఏమీ తోచక స్విచ్ లో పంకా స్విచ్చి వేసి ఇవతలికి వచ్చేసింది.

మర్నాడూ అదే వరస! ముసలాయన అన్నం తినగానే కోడలిగది లోకి వెళ్ళి మంచం ఎక్కి పడుకున్నాడు - దిగ్గు వచ్చినప్పుడల్లా కిటికీ పూచల్లోంచి పూస్తూ.

కమల వరండాలో చాప వేసుకుని పుస్తకం ఒళ్ళో పడేసుకుని - నెత్తిన చేతులు పెట్టుకుని కూర్చుంది.

సరిగ్గా వారం రోజులు సాగిందా తంతు. కమల పూర్తిగా సహనం కోల్పోయింది. ఇలా ఎంత కాలమైనా సాగుతుంది తను ఊరుకుంటే. ఏం చెయ్యాలి?— మధుమూర్తితో చెప్పింది-విషయమంతా—'అవతలి గదిలో ఆయనకు మంచం - పక్కా వున్నాయి. అయినా రోజూ ఇక్కడ పడుకొంటుంటే మళ్ళా నేనీ పక్కమీద పడుకోవటానికి నాకు అసహ్యం వేస్తోంది. కావాలంటే ఫేన్ తీసుకుపొమ్మనండి. ఇంకా కావాలంటే రేడియో కూడా తీసుకుపొమ్మనండి. అంతే గానీ మంచం మీద పడుకుంటే మాత్రం నేనిక



పక్కింటాయనతో :

అక్కడేం చేస్తున్నావు .. ఏంటీ మీ అమ్మాయిచేత ఆ హార్మనీ పాట అనిపించకపోతే నాకు పిచ్చెక్కిపోతుంది.

పక్కింటాయన :

... ... అమ్మాయి ... పిల్లారే వాళ్ళ తాతగారి పాట నేర్పింది.

కిందే పడుకుంటాను." అంది మొహం చిట్లిస్తూ.

మధుమూర్తి ముసలాయన అజ్ఞానానికి చింతించకపోలేదు. అయినా కమలని ఎలాగో శాంతపర్చటానికి ప్రయత్నించాడు – "నిజమే. అయితే మనమేం చెయ్యగలం చెప్పు? ప్రతీ చిన్న విషయాన్నీ నువ్విలా మనస్సులో పెట్టుకుని బాధపడకు కమలా!"

"మీలా ఏ అనుభూతులూ లేకుండా విగ్రహాల్లా వుండేవాళ్ళకి చెప్పండి ఆ సలహా. నేను మాత్రం దేన్నీ పట్టించుకోకుండా వుండలేను."

"నీ తండ్రే అయితే నువ్వింత అసహ్యించుకుంటూ వా? ఇంత సీరియస్‌గా ఆలోచిస్తావా?"

"నా తండ్రా? తండ్రేమిటి? తల్లేమిటి? ఒక భార్యాభర్తల పక్కని పరాయివాళ్ళు ఎవ్వరైనా సరే! చేతితో కూడా తాకకూడదు. వాళ్ళ పిల్లలకి–అదీ వాళ్లు చిన్న వయస్సులో వున్నప్పుడు మాత్రం... అభ్యంతరం వుండదు."

"నిజమే. నిజమే. నీ అభిప్రాయం నాకు అర్థమవలేదనుకోకు. అయినా మన అభిప్రాయాలన్నీ–అన్నిచోట్లా నూటికి నూరుపాళ్ళు ఆచరణలోకి రావు, అది నువ్వు అర్థం చేసుకోవాలి."

"ఏమో నా కలాంటి అర్థాలూ– గమనికలూ సరిపడవు." అనేసింది కమల.

భార్యాభర్తలమధ్య వాద వివాదాలు తప్పితే ఎక్కడి సమస్య అక్కడేఉంది.

కోడలి మంచం మీద పడుకోకూడదని ముసలాయనకి ఎవరు చెప్పాలి? ఎలా చెప్పాలి?–

ఆరోజు సరిగ్గా కాఫీల వేళ ఓ చుట్టం వచ్చాడు. "ఒరే సుందరం! నువ్వట్రా? ఎన్నాళ్ళకి!" అంటూ శేషమ్మ హడావుడితో యిల్లంతా ఓ కొలిక్కి తెచ్చింది. అప్పటికప్పుడు గుప్పెడు రవ్వ వుప్మాచేసి కాఫీ ఫలహారాలిచ్చింది.

మధుమూర్తి ఆఫీసుకు బయల్దేరే వరకూ సుందరం అందరితో మాట్లాడుతూనే కూర్చున్నాడు. "వెళతాను పెద్దమ్మా!" అంటూ లేచాడు మధుమూర్తితోపాటు.

"అదేవిట్రా వెళ్ళటం ఏమిటి? భోజనం చెయ్యవూ?" అంటూ విస్తుబోయింది శేషమ్మ

"లేదు పెద్దమ్మా! మరోసారి వస్తాలే. చిన్నపనివుంది."

"చాల్లే! నోరు మూసుకో. తిండి తినకుండా కదిలావంటే నన్ను చంపుకుతిన్నట్టే. ఇంటికి వచ్చిన వాడికి ఓ ముద్ద పెట్టలేం అనుకున్నావా ఏమిటి?"

అంటూ నిష్ఠూరాలు ప్రారంభించిందావిడ.

"భోజనంచేసి వెళ్ళుగానిలేవోయ్!

కంగా రేం? ఉండిపో!" అన్నాడు మధుమూర్తికూడా తల్లికి వంత పాడుతూ.

సుందరం కాస్త సంశయంగానే ఒప్పుకున్నాడు.

"అబ్బే! ఎందుకూ? నేను వెళ్ళిపోతానుకదా?" అంటూనే వున్నాడు—మధుమూర్తి ఆఫీసుకు వెళ్ళిపోయాడు. శేషమ్మ కాస్సేపు చుట్టంతో కబుర్లాడి వంటింట్లోకి పోయింది.

"పెద్దమ్మా! నేనలా బజార్లోకి వెళ్ళొస్తాను."


"తప్పకుండా రా సుమీ!"- అన్న హెచ్చరికతో ఇల్లుదాటేడు చుట్టం.

పదకొండు గంటల వేళకి వంట ముగిసింది. ముసలాయన తిండి తిని తిన్నగా కోడలిగదికేసి దారితియ్యబోయాడు.

"ఇవ్వాళ్టికి మీరు ఇవతల గదిలోనే పడుకోండి." అంటూ వారించింది శేషమ్మ— "సుందరం వస్తే భోంచేసి అక్కడ పడుకుంటాడు ఓ గంట సుఖంగా నిద్రపోతాడు."

కమల అంతులేని అసహ్యంతో - కోపంతో వుక్కిరిబిక్కిరై ఓ ఘడియ నిశ్శబ్దంగా నిలబడింది — ఇలాంటి మనుష్యుల్ని తనెందుకు వుపేక్షిస్తోంది? ఈ మోమాటాలకూ - భయభక్తులకి అర్థం ఏమిటి?

మనసులో మాట వెల్లడించలేని తన చేతకాని తనానికి ఎవరిమీదో పడి ఏడవటం దేనికి? — ముస



లాయన వెనక్కి వచ్చి అవతలి గదిలోకి పోయి తన జోలిమంచం మీద నడ్డి వాల్చాడు.

"ఏమే! నువ్వు తినరాదూ? సుందరం వస్తాడేమో వాడికిపెట్టి నే తింటానూ," అంది శేషమ్మ.

కమల అత్తగారి మాటలు విన్పించుకోకుండా వాకిట్లో ఎండలో వదేసిన అత్తగారి మంచం తీసుకొచ్చి వరండామీద వాల్చింది. ఓ తలగడా ఓ దుప్పటీ తెచ్చి పక్క వేసింది.

యథాలాపంగా అడిగింది శేషమ్మ—"ఎవరికే అదీ?"

"ఆయనకే. సుందరంగారికి—వచ్చి భోంచేస్తే ఇక్కడ పడుకోమని చెప్పండి."

"ఆదేమిటే? వాడు లోపలపడుకుంటాడని మీ మామగారినికూడా వద్దన్నాను."

"ఏమో! అలా నా కిష్టంలేదు. పరాయివాళ్ళు మా పక్కమీద పడుకుంటే నాకు బావుండదు." శేషమ్మ ఆశ్చర్యం క్షణక్షణానికీ ఇనుమడిస్తోనేవుంది.—"పరాయివాడెవరూ? సుందరమా? స్వయానా మా మేనత్త తోటికోడలి పింతల్లి మనవడు. ఎవరనుకున్నావూ?"

"అదంతా నా కనవసరం. నా మొగుడు తప్ప మరెవ్వరైనా నాకు పరాయివాళ్ళే. తల్లిగానీండి, తండ్రిగానీండి. మొగుడూ పెళ్ళాం పడుకునే మంచం తాకటంకూడా మంచి పనికాదు." ఖచ్చితంగా ఆ మాటలు నాలుగూ అనెయ్యక తప్పలేదు అరిందాలాగా.

శేషమ్మ బొత్తిగా ఓడి పోతున్న దానిలాగా చేతులు ఝాడిస్తూ—"అందుకేనా ఏమిటి? రోజూ మామగారెళ్ళి పడుకోంటోంటే మొహం అలా ముడుచుకుంటున్నావూ?" అంది.

కమల తీక్షణంగా చూసింది—"నేను మొహం ముడ్చుకుంటున్నానని గ్రహించికూడా మీరా ముక్క మామగారికి చెప్పలేకపోయారేం?"

"ఏం? ఏం తప్పవుతోందనీ చెప్పటం? ఏదో పెద్దవయస్సు. కాస్తగాలి వీస్తుందని అక్కడికెళ్ళి పడుకుంటున్నారు. ఆమాత్రం భాగ్యానికే ఏం మించిపోతోందీ?"

"నేను చెప్పాల్సింది మాత్రం చెప్పాను." అనేసి మాటలు పెంచటం యిష్టంలేక గదిలోకి వెళ్ళిపోయింది కమల,

రెండునిముషాలు అటూఇటూగా సుందరంకూడా రావటంతో శేషమ్మ స్వాగతంకూడా కట్టిపోయింది.

సుందరం భోంచేసి ఒక్క పావుగంట మాత్రం కూర్చున్నాడు—"వెళతాను పెద్దమ్మా! నీ బలవంతం మీద ఆగే నేగానీ నాకు చాలా పని వుంది" అంటూ లేచాడు.

శేషమ్మ కూడా చాలా ముభావంగా – 'సరే నాయనా! అందర్నీ అడిగేనని చెప్పు. క్షేమంగా వెళ్ళిరా' అంటూ సాగనంపింది – తలుపు వేసి వస్తూ 'వాడు వుండనేలేదు. తలమాసేలా చివాట్లుమాత్రం తిన్నాను. జాతకమమ్మా! జాతకం. ముందొచ్చిన చెవులకన్నా వెనక వచ్చిన కొమ్ములువాడౌతా యన్నది అబద్ధమా ఏమిటి? ...' అత్తగారి సణుగుడంతా కోడలు వింటోనేఉంది. వినాలన్నదే అత్తగారి కోరిక కూడాను.

గమ్మత్తేమిటంటే తిండి తిని నడ్డి వాల్చగానే ముసలాయనకి చిన్న కునుకు పట్టింది. అత్తా కోడళ్ళ సంభాషణేం ఆయన చెవిన పడేలేదు. బడ్డీలు వదులొదులుగా వేళ్ళాడుతోన్న కుక్కిమంచంలో ఓ అరగంటకల్లా మెలుకువ వచ్చింది.

'సుందరం వచ్చాడేం?' అన్నాడాయన పెళ్ళాన్ని ఉద్దేశించి.

'ఆఁ రానూ వచ్చాడు, వెళ్ళనూ వెళ్ళాడు.' ముసలాయన లేచి బయటికి వస్తూ 'సరిగ్గా నిద్ర పట్టకుండా వుంది.' అంటూ కోడలి గదికేసి ఓ అడుగు వేశాడు.

శేషమ్మ విరుచుకుపడింది– 'సిగ్గులేకపోతేసరి. ఇందాకట్నించీ అయిన భాగోతమంతా విన్నారా? లేదా? మళ్ళా ఏ మొహం పెట్టుకుని అలా వెళ్తున్నారూ? ఇవాళైనా మావగారని మర్యాదైనా వుంచింది. ఇక ఆ ముక్కలు రెండూ మీ మొహాన్నే అంటుంది. చాలు చాలుగానీ మీ మంచంమీద మీరు పడుకోండి. మీరేం పరుపులూ దోమతెరలూ కొన్నారా? రేడియోలూ పంకాలూ కొన్నారా? దాని పుట్టింటినుంచి తెచ్చుకున్నవి అది జాగర్త చేసుకోదూ?'

ముసలాయనకి విషయం డొంకతిరుగుడుగా అర్థమైంది — 'ఏం? ఏమైనా అందా ఏమిటి?'

'అంతే అంటుంది. అసలు మన స్థానంలో మనం వుండాలిగానీ ఒకళ్ళన్నారని ఇదవ్వటం ఎందుకూ?'

కమల నిశ్శబ్దంగా కూర్చుంది.

బెడద వదిలిపోతే నిష్ఠూరపడ్డా ఫర్వాలేదనిపించింది.

ముసలాయన వరండాలో వేసి వున్న మంచం మీదే నడ్డి వాల్చాడు.

సాయంత్రం విషయమంతా మధుమూర్తికి చెప్పింది కమల—'ఫేన్ తీసుకెళ్ళి ఆ గదిలో పెట్టండి. మనకేం ఫర్వాలేదు.' అంది.

'ఎంతైనా నువ్వు గడుసుదానివి కమలా!' అన్నాడు తేలిగ్గా మధుమూర్తి.

• • •

(సశేషం)

నువ్వా నువ్వేనా

"న్యాగ్రా"

"నువ్వేనా! సుబ్బారావ్! ఎవరో అనుకున్నాను' అని మునసబు గారు పలకరించాడు—బస్సు కోసం కరణంగారి అరుగుమీద కూచున్న సుబ్బారావుని.

'అవునండి నేనే'

'చాలా సంతోషం బాబూ! పట్నం వెళుతున్నావటగా! మాంచి ఉద్యోగమే అయిందటగా! పైన కూడా బాగానే వస్తుందటగా! నిన్ననే తెలిసింది. పెరమనెంటయ్యేదాకా పైన ఏమీ ముట్టుకోకు—అక్కడ మా వేలు విడిచిన మేనల్లుడొకడున్నాడయ్యా - వాడి అడ్రసు సరిగా తెలియదు: ఏజీ ఆఫీసులో పని చేస్తున్నాడు-అప్పర్ డివిజన్ క్లార్కు - ఒకవేళ ఈపాటికి సూపరింటెండెంట్ అయ్యేడేమో కూడా! పేరు మంత్రిప్రగడ భాస్కరరావు - వాణ్ణి నువ్వు కలిశావంటే, నీక్కావలసిన సహాయాలూ అవీ చూసి పెడతాడు - నేను ఫలానా అని చెప్పు-నెత్తిమీద పెట్టుకుంటాడు - వాళ్ళ యిల్లు కూడా పెద్దదే. నువ్వు వుంటే వాళ్ళ యింట్లోనే వుండొచ్చు కూడా—వాడి మనసు చాలా ఇదైంది. వాణ్ణి కలిసింతర్వాత నాకు వుత్తరం రాయ్'

'అలాగేనండి.'

'నే వస్తాను' అని మునసబు గారు పొలంవైపు వెళ్ళిపోయాడు.

రావలసిన బస్సుకోసం ఆ మునసబుగారు వెళ్ళినవైపే చూస్తున్నాదన్న మాటేగాని, సుబ్బారావుకు కనుపిస్తున్నది అంతా పట్నమే... ఆ విశాలమైన వీధులు — ఆ ఎత్తైన మేడలు - గబగబా పోయే ఆ మేడ బస్సులు — ఆటోలో బుడుగాడిలా అంత ద్దీలోనూ అలా అలా పారిపోయే సైకిల్‌రిక్షాలు — వెధవ సైకిల్ రిక్షాలు ఈసారి ఎక్కకూడదు - పోయినసారి నడుం ఎంత నెప్పిపెట్టింది! ఖాళీ వున్నా, లేకపోయినా మేడ బస్సే ఎక్కాలి. అందులో వెళ్తుంటే మనుషుల నెత్తిన వెళ్తున్నట్టుంటుంది ... పట్నం చేరగానే, ఏజీ ఆఫీసులో ఆ భాస్కరరావుగారిని కలవాలి ... ఆయన వాళ్ళ యింట్లోనే వుండిపొమ్మంటే, వాళ్ళ యింట్లోనో వాళ్ళ పక్క వాటాలోనో ఓ అమ్మాయి వుంటే- (అమ్మాయి ఎలాగూ వుంటుంది! అమ్మాయి ఎవడిక్కావాలి - అందమైన అమ్మాయి వుంటే ... ఆ అమ్మాయి నన్ను ప్రేమించి,

ఏమండీ! పెళ్ళిచేసుకుందామండీ! అంటే - అదేం యిప్పుడు కాదు. వుద్యోగం పెర్మనెంట్ అయిం తర్వాత అని నేనంటే...

...ఆ సంగతికొస్తే ఆ అమ్మాయి తలిదండ్రులకో- వారు లేకపోతే, ఆ అమ్మాయి సంరక్షకులకో తెలిస్తే... 'దానికేం నాయనా! అమ్మాయికి నువ్వూ, నీకూ అమ్మాయి నచ్చిం తర్వాత అనవసరంగా అలస్యం ఎందుకు?... శుభస్య శీఘ్రం అన్నారు పెద్దలు..' అని ఆ పెద్దలూ...మా పెద్దలు కలిసి మమ్మల్నిద్దర్నీ కలిపేస్తే...అప్పుడు మేం అన్నీ ఎయిర్ కండిషన్డు సినీమాలే చూడాలి...ఇక్కడ వెధవ సినీమాల్లో వుక్కపోసి చచ్చిపోతున్నాం...' అని కరణంగారి అరుగు మీదకూచుని హైదరాబాదులో ఆనందిస్తున్నాడు సుబ్బారావు.

'ఎవరూ!' అంటూ కరణంగారు తలుపు తెరుచుకు బయటకు వచ్చారు.

'నేనండీ, సుబ్బారావుని.'

'నువ్వేనా! ఇంకా ఎవరో అనుకొన్నాను ... కాగితాలూ, అవీ జాగ్రత! అవన్నీ బనీను జేబులో పెట్టుకో. రైలు టిక్కట్టుకూడా బనీను జేబులోనే పెట్టుకో... దాని నంబరుమాత్రం కాగితం మీద నోట్ చేసుకుని వేరే జేబులో పెట్టుకో... హైద్రాబాద్‌లో దిగ్గానే తెల్లబోయి చూడకు. వీడెవడో పల్లెటూరు వైతని, నీకు టోపీ వేసేస్తారు.'

'భలేవారండీ మీరు. హైద్రాబాదు నాకేం కొత్తకాదండి. నేనెన్నిసార్లు వెళ్ళలేదూ?'

'అది సరే అనుకో - మన జాగ్రతలో మనం ఉండాలి. రాజమండ్రి టౌన్ స్టేషన్‌లోనే రైలెక్కు. పూరి ప్యాసింజరయితే మంచిది - ఖాళీగా వుంటుంది. అయితే నువ్వు హైద్రాబాద్ వెళ్ళి తిరపతి వెళతావా?'

'డ్యూటీలో చేరిం తర్వాతనే దర్శనం చేసుకుంటానని మొక్కుకున్నానండి.'

'బాగుంది జాగ్రతగా వెళ్ళు. రేప్పొద్దున రైలు స్టేషన్‌లోకూడా యిలాగే కూచుంటావా ఏమిటి?... ఇది మన యిల్లుకనక సరిపోయింది. ఇదే ప్లాట్‌ఫారమ్ అయితే, ఆ



సామాన్లు అలా వుంటాయా? ... ఆ బెడ్డింగుమీదకూ చో-అసంచీ చంకకి తగిలించుకుని కాళ్ళమధ్య పడేసుకో .. ఆ పెట్టెని కుడిచేత్తో పట్టుకో-'

'మీరు మరీ యిదండి.'

• • •

'ఇది నా యస్. యస్. యల్. సి. సర్టిఫికేట్ సార్. ఇది మా హెడ్ మాస్టారిచ్చిన కాండక్ట్ సర్టిఫికేట్. ఇది మా గవర్నమెంట్ ఆసుపత్రి డాక్టరిచ్చిన ఫిజికల్ ఫిట్నెస్ సర్టిఫికేట్ - ఇది, వుద్యోగంలో చేరడానికి అనుమతిస్తూ మా తల్లి దండ్రులు (క్షమించాలి. మా అమ్మగారు కీర్తిశేషులు) యిచ్చిన అనుమతిపత్రం.' అంటూ కాగితాలన్నీ ఆఫీసర్ టేబిలుమీద పెట్టాడు సుబ్బారావు.

'అన్నీ బాగానే వున్నాయ్, కానీ-' అంటూ నీళ్ళు నమిలాడు ఆఫీసర్

'ఏమిటి సార్! అనుమానిస్తున్నారు? ఈ గడ్డం వగైరాలా!- ఇది తిరపతి మొక్కు సార్ - వుద్యోగంలో చేరగానే, మొదటి శనివారం కాలినడకన కొండకి వస్తానని మొక్కుకున్నాను సార్.'

'అదేం కాదు నాయనా! నువ్వు నువ్వేనని ఒక సర్టిఫికేట్ కావాలి.'

'అదేమిటి సార్?'

'ఇది కొత్త రూల్. ఈ మధ్యనే వచ్చింది. రేప్పొద్దున మరొకడు ఎవరైనా వచ్చి, మీ వుద్యోగంలో చేరిన సుబ్బారావు దొంగ సుబ్బారావు. అసలు సుబ్బారావుని నేను. అన్నాడనుకో—'

'అదేమిటి సార్? నా 'పాస్పోర్ట్ ఫొటోతో పోల్చుకోండి.'

'పోల్చుకున్నాకూడా వుత్తరోత్తరా వచ్చేలావాదేవీలకు బాధ్యులం మేము-అని, ముగ్గురు పెద్దమనుషులు వుత్తరాలు యివ్వాలి. అవి తీసుకురా. అపాయింట్మెంట్ ఆర్డరు యిస్తాం.'

'నువ్వు మీ తలిదండ్రులకే పుట్టావా? ఏమిటి రుజువు అంటే ఏం చేస్తాం సార్?'

'నన్నేం చెయ్యమంటావ్ నాయనా! ఇదంతా సినీమాల ప్రభావం-ద్విపాత్రాచిత్రాలు ఎక్కువయిపోయి, కొందరు మోసగాళ్ళు 'నేనే అసలువాణ్ణి మీవుద్యోగంలో చేరినవాడు నకలు, వాడిని వుద్యోగంలోంచి తీసేసి, నా వుద్యోగం నా కివ్వండి, అంటూ బయల్దేరుతున్నారట! కలకత్తా, బొంబాయి, ఢిల్లీల్లో యిలాంటి కేసులు కొన్ని జరిగాయట కూడా-ముందు జాగ్రత కోసమని మన ప్రభుత్వం చేసిందే గాని, మరొకటికాదు. నువ్వు మీ వూరు వెళ్ళి, మీ నాన్నగారిచేతా, మీ గ్రామ మునసబు కరణాలచేతా వుత్తరాలు తీసుకురా-'

'అలాగైతే, ఈ శనివారం తిరపతి వెళ్ళడం పడదుసార్-'

'ఈ శనివారం కాకపోతే, మళ్ళీ శనివారం వెళ్ళచ్చు - శనివారాలు లేవుటయ్యా .. వెళ్ళు-వెళ్ళు'

● ● ●

'నాదేముందిరా అబ్బాయ్! నీ యిష్టమొచ్చినట్టు రాసి తీసుకురా - సంతకం పెడతాను. కాని ముందర ఆ మునసబుచేత చేయించి తీసుకురా ఆ తర్వాతనేను సంతకం చేస్తాను అన్నట్టు మూడో సంతకం ఎవరు చేస్తార్రా?' అన్నాడు కరణంగారు వీధి అరుగుమీద కూచుని చుట్ట కాల్చుకుంటూ-

'మా నాన్నగారిచేత పెట్టిస్తానండి ' అన్నాడు సుబ్బారావు

'సరే, వెళ్ళిరా-'

సుబ్బారావు కాగితాల కట్ట పుచ్చుకుని వెళ్ళిపోయాడు కరణంగారు జాలిగా సుబ్బారావు వైపు చూసి, మళ్ళీ యిటుతిరిగి, పక్కనే కూచున్న ఓ మోతుబరి రైతుతో—

'ఏమయ్యా! వీడు సీతాపతి కొడుకేనంటావా?'

'బలేవోరండిమీరు! ఎరగనోడు ఆ ఆపీసరికి అనుమానమయితే మీకూ అనుమానమే?'

'అలాగైతే, మూడో సంతకం నువ్వు పెట్టకూడదూ?'

'మా వూరసకిఅన్నాగానిఇలాంటి రాతకోతల్లో నన్నిరికించకండిబాబు మీకు పున్నెముంటుంది '

'ఎందుకయ్యా ఇంత భయం?'

'నిద్ర లేచింది మొదలు పడుకునేదాకా, మీకు సంతకాలు పెట్టడమే పనిగదా—మీకే అంత బయమయితే, నాకెంత బయం వుండాలి?'

'సర్లే, మునసబు చేత సంతకం పెట్టించుకు రమ్మన్నాంగా !

● ● ●

'అది సరే, సుబ్బారావుబాబూ! నీ మాట కాదంటున్నాననుకోకు - కరణంగారు ఎందుకు ముందర నన్నే సంతకం పెట్టమన్నాడూ అని '



సాధించుకున్న మంత్రిగారు ఓ పల్లెటూర్లో ఉపన్యసిస్తూ 'మహాజనులారా నాకే మీ ఓటు వేస్తే మీ వూళ్ళో యాక్సిడెంట్లు జరక్కుండా వీధులన్నీ ఓ వేపు మూయించేస్తా ట్రాఫిక్కంతా ఓ వేపే వెళ్ళేట్లు నిరపాయకరంగా ఉండి, రద్దీ తగ్గి

ఆగవయ్యా — మాకున్నది ఒకటే వీధి బయటికెడితే మళ్ళీ ఇళ్ళకి చేరేదెలా —' అన్నాడో ఘటకుడు

"అదేం లేదండి నే నెలాగూ యింటిదగ్గరే వుంటాను, మునసబు గారి దగ్గరా, మీ నాన్న గారి దగ్గరా సంతకాలు పెట్టించుకురా, ఆ తర్వాత నా సంతకం తీసుకుని మా యింటిముందే బస్సెక్కుదువు గాని అన్నారండి"

"అదేం కాదు సుబ్బారావు బాబూ! ఇందులో ఏదో తిరకాసుంది అర్థరూపాయికి సంతకం పెట్టే కరణంగారు భయపడుతున్నాడంటే—"

"ఏమిటండీ! మీరుకూడా నన్ను అనుమానిస్తున్నారా?"

"అనుమానం కాదు బాబూ! ఆయనెందుకు సంతకం పెట్టలేదూ అని-పోనీ, మీ నాన్నగారిచేత ముందు పెట్టించుకుర్రా"

"సర్లెండి."

● ● ●

"నువ్వు నువ్వేననీ, నిన్ను పోలిన వాళ్ళు ఎవరూ లేరనీ, వుండబోరనే, ఒకవేళ ఎవరైనావుండి, వాళ్ళు అసలైన "నువ్వు" తామే అని అంటే, వచ్చే లావాదేవీలకు మేము బాధ్యులమని బాండు రాసివ్వాలా? అసలిది నమ్మవలసిన మాటేనా? ఎవరు నువ్వు? ఏమిటీనాటకం?" అంటూ లేచాడు సీతాపతిగారు సుబ్బారావు మీద

"నాటకం కాదు నాన్నగారూ! ఇది నిజం మీరుకూడా నన్ను అనుమానిస్తున్నారా? నేను సుబ్బారావుని నేను సుబ్బారావునే అని ఎలాగ నమ్మించడం?"

"నువ్వు మా సుబ్బారావు కానే కాదు వాడు హైదరాబాద్‌లో వుద్యోగంలో చేరాడు ఈ వేళరాత్రి బయల్దేరి, ఎక్స్‌ప్రెస్ బస్‌లో రేపు తిరపతి చేరతాడు—లక్షణంగా స్వామి దర్శనం చేసుకుంటాడు నువ్వు ఎవడివో మా వాడి పోలికలున్న మోసగాడివి అనవాళ్ళు తెలుసుకునివచ్చి, నా చేత సంతకం పెట్టించుకుని వుద్యోగంలో చేరాలనుకుంటున్నావ్!"

"లేదు నాన్నగారూ! నేను మీ సుబ్బారావుని నా చిన్నపుడు మీరు కోపంలో నన్ను కొట్టిన దెబ్బ యిదిగో చూడండి" అని కుడిచెయ్యి చాపాడు కావాలంటే నా యస్ యస్ యల్ సి రిజిస్టరు ప్రకారం నా పుట్టుమచ్చలు తనిఖీ చేసుకోండి మీరు నన్ను ఎప్పుడూ 'సుబ్బిగా!' అని పిలిచేవారు"

"సుబ్బారావును 'సుబ్బిగా' అని పిలవక 'మోహన్' అని పిలుస్తారా నాయనా?"

"అదిగో, అది అమ్మ ఫోటో-" అని గోడనున్న ఫోటో చూపించాడు

"ఏ యింటిగోడనైనా ఒక నడివయస్కురాలు ఫోటోవుంటే అది ఆ యింటియిల్లాలుదే! దానికి ఏదైనా ఓ పూలమాల వుంటే ఆమె కీ. శే అవునా! ఈ నగ్న సత్యాలన్నీ

సాక్ష్యాలుగా నాకు చెప్పాలనుకుంటున్నావ్! నీ ట్రిక్కులు నా దగ్గరకాదు మర్యాదగా వెళ్ళు, లేదా, సినిమాల్లోలాగా పోలీసుల్ని రప్పించాల్సి వస్తుంది"

"నాన్నగారూ! నా మాట వినండి. ఈ ఇంట్లో ఏ గది ఏమిటో చెప్తాను"

"ఉన్న నాలుగ్గదులూ స్పష్టంగా కనిపిస్తూనే వున్నాయ్ నువ్వు చెప్పేదేమిటి?

"మీకు కారం ఎక్కువ కావాలి"

"ఏం, నువ్వు వంటలు కూడా చెయ్యగలవా?

"అదికాదు — నాన్నగారూ! మీకు కారం ఎక్కువ, మాకు కారం తక్కువ యిష్టం అని, వంటవాడు ఓ సారి కారం తక్కువవేస్తే, వాణ్ణి మీరు పట్టుకు కొట్టారు,"

"వాణ్ణి నేను చాలా సార్లు కొట్టాను"

"ప్రతిదీ మీరు అలా కొట్టి పారేస్తే, నేనేం చెప్పగలను నాకీ వుద్యోగం ప్రాప్తిలేదు"

"నీకు జైలుప్రాప్తి వుంది, పోలీసుల్ని పిలిపించి జైలుకు పంపిస్తానుండు — నువ్వు నా కొడుకువా! నీకు నేను కాగితాలు రాసివ్వాలా! ఇంకా నయం—సంతకంతో సరిపెట్టావు — ఆ ఆఫీసరు లంచం అడిగాడు — వాడికి ఒకటో రెండో పచ్చకాగితాలు యివ్వాలి తేతెమ్మన్నావు కాదు — ఇంకానయం!"

"నాన్నగారూ!"

"ఏం కొడుగ్గారూ!"

"ఇంకొక్కటే చెప్తున్నాను—కావాలంటే ఈ గడ్డం నిజమైందో, కాదో మీరే పరీక్షచేసుకోండి—"

"ఇన్ని కనిపెట్టి చేసిన వాడివి, గడ్డంమాత్రం పెంచుకోలేవా నాయనా, ఈ ట్రిక్కులన్నీ సినీమాల్లో అయితే నమ్ముతారుగాని— నేనుమాత్రం ఛస్తే నమ్మను మా వాడికేమయ్యా! హైద్రాబాదులో రాజాలాంటి వుద్యోగం చేస్తున్నాడు—వాడిలావున్నంత మాత్రాన,



రెండు రోజుల పెళ్ళికి, తాయారమ్మగారు ఉన్న బట్టలన్నీ ఆరు పెట్లూ రెండు బెడ్డింగుల్లో సర్దింది బండెడు సామానూ ఫ్లాట్‌ఫారంమీద పెట్టించిఇంటాయన "తాయారూ, భోషాణం కూడా తీసుకు రావలసింది" అన్నాడు

ఆవిడ చూపులతోనే కొట్టినంత పని చేసింది

"వేళాకోళంకాదు తాయారూ, రైలు టిక్కట్లు భోషాణంమీదే వదిలేసి వచ్చాం"

వాడే అనుకుంటామా? 'వెళ్ళు. వెళ్ళు. లేదా—'

'నాకు ఆత్మహత్య శరణ్యం!'

'అది నీ యిష్టం మా వాడెప్పుడైనా, నా ఎదుట ఇంత లేసి మాటలన్నాడా? అసలు నోరెత్తి ఎరుగునా!'

నోరుమూసుకు వెళ్ళాల్సి వచ్చింది సుబ్బారావుకు

దారి తెన్నూ తోచడంలేదు

• • •


'కమాన్, మిస్టర్ సుబ్బారావ్! వెల్‌కం టు ది ఆఫీస్-ఏం! ఇంత ఆలస్యం?' అని ఆఫీసరు ఎంతో అప్యాయంగా స్వాగతం చెప్పాడు సుబ్బారావుకు-

'సారీ, సార్ సంతకాలు లేటయ్యాయ్.' అని కాగితాల కట్ట ఆఫీసరు ఎదుట పెట్టాడు-సుబ్బారావు

అన్నీ శ్రద్ధగా పరిశీలించాడు ఆఫీసరు-చివరకి పెదవి విరుస్తూ—

'సారీ-అయాం వెరీసారీ సుబ్బారావ్! మాక్కావలసిన వయసు కన్న, నీవయసు మూడురోజులు ఎక్కువయింది,'

'అయితే, నేను వుద్యోగానికి అన్‌ఫిట్టేనా!'



□□□

కోరిక

శ్రీసుభా

మనిషికన్నా, మనిషిలో మంచి తనంమీద నమ్మకం ఉన్నవాడు భాస్కరం. అవసరమయితే అది ప్రశ్నించగల విశాల హృదయం వుంది. లేకపోతే అందరిలాగా, కాదు, చుట్టూ తను చూస్తున్న కొందరిలాగ ప్రవర్తిస్తే–తండ్రి చనిపోతూ మిగిల్చిపోయిన ఆస్తి నామమాత్రంగా చేతికి వస్తున్ననాడు, అప్పుల పట్టీ తలకు మించి భారమయిననాడు తన బాధ్యతని బాధని త్రోసి రాజనేవాడు ... సుగుణ–తండ్రి పోయిన పదకొండో రోజు నుంచీ పోరుతూనే వుంది.

'మంచి తనానికి హద్దుంది. ఇలా మంచికి తలొంచి నడుస్తూ పోతే మనలో మంచి గడమంచి అవుతుంది.'

'అరే... వూరుకో... యెవరైనా వింటారు...'

'అంతేగాని నా రొద మీకు పట్టదు ... ఉమ్మడి సంసారంలో తండ్రి మిగిల్చిన ఆస్తిని నలుగురూ పంచుకోవడం న్యాయం. అంతేగాని... యీ బాదరాయణ సంబంధం... ఆ ముసిలాయన చేసిన సిగ్గుమాలిన పనిని మెచ్చుకొని–దానికోసం తగుదునమ్మా అని తల పట్టుకుని...'

'నువ్వు లోపలికి వెళ్ళు... నన్ను ఆలోచించుకోనివ్వు' వొక్కొక్కరే హితబోధ చేసి వెళ్ళిపోతున్నారు... భాస్కరం, నల్ల చేవ కర్ర పందిరి మంచం పై పడుకుని వర్తమానం నుంచి గతం లోకి వెడుతున్నాడు ... తండ్రి కదులాడిన, మాట్లాడిన గుర్తులు, యాభై యేళ్ళ బ్రతుకుని–యిట్టే యే చీకూ చింతా లేకుండా చిద్విలాసంగా నెట్టుకొచ్చిన మనః ప్రవృత్తి లోతులకు తనూ వెళ్ళి అచూకీ తియ్యగల్గితే ...

అధునాతనం వైపు గెంటబడుతున్న మనిషికి మిత ఆనందంతో పాటు అమిత దుఃఖం, మరింత వెసులుబాటే మిగులుతాయేమో ... తాతయ్యకన్నా తనకి బ్రతుకు యిరకాటమై నిల్చిందనేవాడు తండ్రి... తన తరానికి–తాతయ్య రోజులకూ వున్న తేడా యేమిటి !! సమస్యలు శిఖరాగ్రాన చేరితే సతమతమయ్యే మనుష్యులు కన్పిస్తున్నారీరోజు. సమస్యల్ని–తేలిగ్గా ఛేదించి భేదించగల్గేవారంట. ఆ రోజుల్లో అయితే తన తండ్రికి సమస్యలు లేవా !! వున్నాయి ... అవి యెలాం

టివి !! ఆయన ఛిటికిన వేలితో మీటిన వాటిని తనీ రోజు వో కొలిక్కి తెచ్చుకోలేక పోతున్నాడు...

ఆయన చుట్టూ కావలసిన వాళ్ళకి తల్లో నాలికగా మిగిలాడు. భారమైన సంసార చక్రాన్ని తేలిగ్గా తెలివిగా తిప్పాడు... బిడ్డల్ని వృద్ధి లోకితెచ్చి - వాళ్ళ భవిష్యత్‌కు వో నిర్దిష్టమైన పంథానిచ్చాడు.

అయితే యిది చుట్టూతా చాలా మంది తండ్రులు చేస్తారు. చేస్తున్నారు. అలాగే కన్నవాళ్ళ అదృష్టాన్ని గాలిలో దీపంమాదిరి వదిలిన వాళ్ళూ ఉన్నారు. నిజానికి యెవరెంతచేసినా వ్యక్తిపరమైన అదృష్టం కూడా వుండాలేమో - సుఖపడాలంటే !!!

కానీ తన తండ్రి సీతారామయ్య అనే పేరుతో తన స్వంతానికి చుట్టూతా వాళ్ళు మెచ్చుకోలేని పన్లుకూడా చేశాడంటారు. తనకు తెలిసున్నంతవరకూ కూడా ఆయన్ని యెవరూ మెచ్చుకోలేదు. కన్నతల్లి కన్నీళ్ళుపెట్టుకుని, కాళ్ళు పట్టుకుని బ్రతిమలాడ్డం తనకి లీలగా గుర్తు. కావలసినవాళ్ళు కాదని అన్నే, చొరవ తీసుకోలేక మనస్సులోనే దేవుణ్ణి ప్రార్థించేవారు. కానివాళ్ళు ఆయన మొహం ఎదురుగుండానే ఆయన చేతల్ని బాహాటంగా మెచ్చుకోవడం తను చూశాడు.

'వొరేయ్...యింట్లో రాద్ధాంతం అంతా ఆ రంగనాయక్కి తెలియదంటావా ... కన్నెరికం చేసిన మగవాణ్ణి మగడుగా నమ్ముకోవాలన్న నీతికి కట్టుబడే మనిషయినప్పుడు—మరో అవదాని అదృష్టం దోచుకోవడం తప్పని తెలియదంటావా ...నువ్వు చెప్పకూడదూ దానికి'

'నేనా' అనేవాడు...

'చిన్నప్పటినుంచీ నాన్నతోకలిసి దానింటికి వెళ్ళేవాడివిగా ... దాన్ని నాన్న 'అమ్మ'అనమంటే అనీ—దాని చేతి వంటలుతిని అక్కడే నిద్రపోయిన రోజులూ వున్నాయిగా...'

'ఉంటే మాత్రం.. నేను ...'

తన గుండెల్లో నిండుకున్న వో విధమైన ఆప్యాయత—రంగనాయకమ్మ మీదది — ఆమె పట్ల గౌరవ భావం ... మాటలకు కళ్ళెం వేసేది ...

తండ్రి తనని చిన్నప్పటినుంచీ ఆ యింటికి తీసుకు వెళ్ళేవాడు. రంగనాయకి తండ్రికి కాళ్ళుపట్టడం, వట్టి వేళ్ళ విసినికర్రతో విసురుతూ కూర్చోవడం - తను - యేదో మూల వాగని హార్మోని పెట్టెమీద రాగాలు తియ్యడం మొదటి రోజు— ఆ రోజు అడిగాడు... 'అదెవరు నాన్నా' అని.

'మీ అమ్మరా' అన్నాడాయన.

'అమ్మింటిదగ్గ రుందిగా'

'యిదీ అమ్మే ... నీకు రెండమ్మలు.'

తను నమ్మలేదు...యీ మనిషి



అమ్మలా లేదు ... అదోలా వుంది ... రంగనాయకితో తండ్రి యేదో చెప్పి "అమ్మా అని పిలువు" అన్నాడు. "నే పిలవను. నా కొద్దీ అమ్మ" అన్నాడు.

"పిలంటూంటే" వీపున వొక్క టేశాడు ఆయన...

"అమ్మా"అంటూ రాగం మొదలు పెట్టాడు...రంగనాయకి ఆ రాత్రంతా తను యేడుస్తూంటే చంకన వేసుకుని పలకల వెండిగిన్నెలో పెరుగన్నం కలిపి, చందమామని పిలుస్తూ గోరు ముద్దలు తినిపించింది...

భయపెట్టి, బెదిరించినప్పుడు, మనిషికి దూరంగా వున్న వస్తువు మీద ఆప్యాయత పెరుగుతుందంటారు ... యింటికి వచ్చిన తరువాత తల్లి యేం జరిగిందని అడిగితే తను నవ్వుతూ జరిగిందంతా చెప్పేవాడు.

"ఛీ వెధవా! దాని చేతి అన్నం తింటావా ... యెప్పుడూ నాన్నతో అక్కడికి వెళ్ళకేం" అని లలితమ్మ గారు కోపంతో కొట్టేది. తండ్రితో తనని అక్కడికి తీసుకు వెళ్ళద్దని చెప్పింది, తనముందు రంగనాయకమ్మని రాక్షసిగా చిత్రించేది.

ఇన్ని జరిగినా తండ్రి 'వస్తావురా' అని అడగ్గానే వెళ్ళాలనిపించేది. రంగానాయకి యింట్లో తీపి గారెలు, పూతరేకులు నోరూరుంచేవి. ఆవిడ గొంతెత్తి గోపాలుడి మీద పదం పాడితే తను చిన్ని కృష్ణు డయిపోయేవాడు.

అమ్మ తననేనాడు ముద్దాడలేదు ... పాటలు పాడి ఆడించలేదు ... యింకాపోతే తండ్రిమీద రుసరుసల్ని, సంసారంలో చికాకుల్ని తనమీదే ప్రదర్శించేది. చిన్నతనంలో పసివాళ్ళని ప్రేమించకపోవడం, చేరదియ్యకపోవడం, కావాలని వాళ్ళని మనకు దూరం చేసుకోవడమే అవుతుంది ... పైగా భయంకూడా పెడితే ఆమనిషి మనకు దూరమవడం, మనం చూస్తూండగానే మరో మనిషి అనురాభిమానాలకు ధారాదత్తమవడం చూడాల్సి వుంటుంది ... ఆలోచించినప్పుడల్లా నాకు నవ్వొస్తుంది ... నా చేతల్ని సమర్థించుకుందుకు ప్రయత్నిస్తున్నానేమో అని భయం పుట్టేది ...

చూస్తూండగానే రంగనాయకి పక్కలో చంటిపిల్ల కన్పించింది ... "యెవరో తెలుసా బాబీ" అంది.

"ఉహూ ..."

"నీ చెల్లెమ్మ" అని ... "నాన్నతో చెప్పు – యింటికివెళ్ళి, అమ్మ వినకుండా" అంది తిరిగి ...

నాన్నతో చెప్పడం అమ్మ విననే వింది ...

"వాడ్ని పాడు చేస్తున్నారు.. .మీ సొదభ్యం మెచ్చుకోవలిసిందే" యిలాగే సంవత్సరాలు దొర్లిపోయాయి. చూస్తూండగానే తన చదువు, పల్లె వదిలి, పట్నం వెళ్ళి, ఆఖర్ని నగరంలో

విశ్రాంతి తీసుకుని, చివరగా— స్వగ్రామంలో తనకున్న భూముల్నీ, అభిమానుల్నీ, వ్యవసాయాన్ని గుర్తుచేసి వెనక్కి నెట్టింది. అసలు సంఘంలో లభించే స్థానానికి పునాది రాళ్ళు వేసుకుందుకు చదువు మొదలవుతుంది... అంతకుముందు అజ్ఞానపు అడివిలాటి మెదడులో ఆలోచనల్ని అంట్లుగా కట్టి, ఆచరణల నీళ్ళుపోసి, అవి ప్రణాళికల మొదళ్ళేస్తూంటే ఆనందిస్తాం... ఈ లోపున హఠాత్తుగా అంతరాంతరాల్లో స్వంతానిదీ, చుట్టూతా వాళ్ళదీ, అవివేకం ముళ్ళకంచెల పేర ప్రబలితే— సహాయంకోసం సంఘాన్ని ప్రాధేయపడతాం... ఆ సంఘం కళ్ళొత్తుకుంటూనే అవకాశాల గునపాలు, కక్షల పారలూ చేతికిస్తుంది... ప్రభంజనుడై మనిషి దాంతో విర్రవీగుతాడు... నవ్వించిన నందనవనం నవ్వులపాలవుతుంది ... 'స్వయం కృషి, వికటించినందుకు విచారించకు, పురుగులాంటి పొరుగువాడి ఆట కట్టించావు' అని హితబోధ చేస్తుంది... యెన్నో పాఠాలు, గుణపాఠాలు, మిగులుతాయి గుర్తుగా. అందరికీ యివే అనుభవాలు కాకపోవచ్చు కానీ, యిందులో కొన్నైనా యెదురవుతాయేమో ...

తనకి, ఎంత కాదనుకున్నా— తనతో పెరిగిన రంగనాయకి కూతురు — చెల్లెలే అవుతుంది... భాస్కరం తన చుట్టూ ఎంతోమంది అన్నదమ్ములు, అన్నాచెల్లెళ్ళు చదువుకోడం చూశాడు... విశాలతో తనేనాడూ ధైర్యంగా మాట్లాడలేదు. అటు ఆ అమ్మాయిని—తననీ అందరూ వేళాకోళాలు పట్టించేవారు ... పాల రంగనాయకి నే మేనగత్తె కూతురవొచ్చు. అదే లగ్గమ్మగారి బిడ్డయితే యిలా యాగీ చేసేవారేనా? ! కనీసం సీతారామయ్యగారి కూతురిలా ఎందుకు గౌరవించకూడదు. అయినవాళ్ళముందు బాధ వెళ్ళడిస్తే ఓదార్చేవారు ... 'లక్షమంది లక్ష అంటారు. అందుకని అడపిల్లలా యేమిటున.

'అది కాదురా ... విశాల ఏమనుకుని బాధపడుతోందో'

ముఖ్యంగా అందుకే చదువంటే అసహ్యం. పట్నం అంటే విరక్తి



చేతిమీదా మొహంమీద పలాస్త్రీలతో వున్న గుమాస్తాని మేనేజరుగారు కారణం అడిగారు.

"రాత్రి మా ఆవిడతోటి ఘర్షణ పడ్డానండి."

"మరి మీ ఆవిడ పూర్తించి రావడానికి ఇంకా రెండు రోజు లవుతుందని అన్నావనుకుంటా—"

"నేనూ అలాగే అనుకున్నానండి."

కళ్లాయి. వెలవెలబోతున్న డిగ్రీ పుచ్చుకుని యింటికి వచ్చేశాడు... దాన్ని చూస్తే...కన్నీళ్ళు, అసహాయత, ఆవేదన–డబ్బు, కొద్దిపాటి విజ్ఞానం తుంపర, కొండంత అవివేకం కలిపి తయారుచేసిన కాగితం పైచదువుకు యెవరు చెప్పినా, విముఖత చూపిరచానని తెలిసి రంగనాయకమ్మ కబురంపించింది...

"పెద్దవాడి వవుతున్నావు... అలా నలుగురూ చూస్తుండగా దానింటికి వెళ్ళకు" తల్లి అంటోంది...

'రహస్యంగా వెళ్ళాలా అమ్మా"... నవ్వు తెప్పించేది అమ్మ భయం...

"యిదీ చదువు మానేస్తానంటోంది-చూడు బాబీ" రంగనాయకమ్మ అనేది... "అన్నయ్యా చదవట్టు మరి" విశాలంది.

"మానేస్తానంటే మనమేం చేస్తాం"

"పోనీ మేళానికి వెడతావుటే"

ఆవిడ నవ్వేది...

"చూడన్నయ్యా నేయేడుస్తానంతే..."

నా చదువు — అటు విశాల చదువూ రెండూ ఆగిపోయాయి... ఆ రోజునే...

మరో మూడేళ్ళు తన జీవితంలో పెద్ద మార్పులే తెచ్చాయి ... తను సంసారి అయ్యాడు... సుగుణ అనే బంధం... భార్య రూపంలో వచ్చి తనని అనుబంధంతో బంధించింది...

అప్పుడప్పుడు నాన్న వంటిగా చూసి తనతో చెప్పేవాడు ... 'విశాలకి పెళ్ళి చెయ్యాలిరా.. ఆ మగనలును చదువుంది ... ఆ రోజునే నాకు మనశ్శాంతి... లేకపోతే మీకు న్యాయంచేసి, వాళ్ళకి అన్యాయం జరిపినట్టు కాదా..."

చటుక్కున తల్లి వచ్చి అనేది... "ఆ వున్న ఆస్తి అమ్మెయ్యండి. తీరిపోతుంది... యాభై యేళ్ళొచ్చి... నలుగురూ నవ్వుతారనైనా లేదు."

"నవ్వడం దేనికి."

"చేసినదానికి... యేమిటి మీరు చెయ్యబోయే నిర్వాకం. ఇంట్లో మేం వున్నామనీ, మీ, వాళ్ళ గౌరవం అని లేకుండా చేశారు... అది మీకు మందు పెట్టింది బాగా... అవ్వ..."

"నువ్వు పొరపడుతున్నావు ... రంగనాయకి నాకు మందు పెడితే... యిలా కాదు, మనిల్లు మరో రకంగా, మీరు మరో విధంగా వుండేవాళ్ళు..'

● ● ●

* తెలుగు సినిమా కథలు మూడు రకాలు : బెంగాలీ కథలు, హాలీవుడ్ నుంచి వచ్చిన బెంగాలీ కథలు, బెంగాలీనుంచి వచ్చిన తమిళ కథలు.

తండ్రి పోయేముందు, పోతాడనగా రాత్రి తనని పిల్చి ఆయన చెప్పిన విషయాలు, వెల్లడించిన నిజాలు నిజంగా నమ్మలేనివి ... ఒక్కొక్క నిజం మెరుపై కళ్లు మిరుమిట్లు గొలిపించింది.

"మీరందరూ యేదో చెట్టు నీడన బ్రతికేడుస్తారు. నాకా ధైర్యం వుంది... కానీ రంగనాయకి అలా కాదురా... నన్ను నమ్ముకున్న మూలంగా సంసారాన్ని నామమాత్రంగా నెట్టుకొచ్చింది ... ఒక విధంగా వాళ్ళ కుల వృత్తిని దారి తప్పించి యివాళ్టి రోజు వాళ్ళకు విషమ పరిస్థితి కల్గించింది నేనే. విశాల పెళ్ళి, సుధాకరం చదువు తప్పనిసరి... కానీ రంగడి దగ్గర యేం మిగిలిందని, నేనేం మిగిల్చానని..." నాన్న నాకు చెప్పాల్సినవి చెప్పి- కొండంత భరోసా నానుంచి తీసుకుని వెళ్ళిపోయారు... ఆయనలో దాగిన బాధని-తపన నాకు ధారాదత్తం చేశారు...నీతిగా బ్రతుకుతున్న వాళ్లు, మడిగట్టుకున్న వాళ్ళు ఆయన నిర్ణయాన్ని తేలిగ్గా నెట్టి పారేస్తారు. నాకు తెలుసు..కాని తనుగా చేసిన తప్పుకు, పరిహారం చెల్లించుకోవాలనే ఆయన సదుద్దేశం తప్పేలా అవుతుంది.

నాన్నగారు పోయి నలుగురూ రోదిస్తున్నప్పుడు, రంగనాయకమ్మకి కబురు పంపిచాలనిపించింది తనకు. ఇరవైయేళ్ళు, బ్రతుకులో బ్రతుకుగా పెనవేసుకుపోయి, మమతలు పెంచిన మనిషి మరో లోకానికి పోతూంటే కడసారి చూపుకు నోచుకోనివ్వకుండా అడ్డుపెట్టిన బంధువులమీద, చుట్టూ జనంమీద అసహ్యం వేసింది.

ఆపుకోలేక ఆస్తిపంపకాలు జరిగేటప్పుడు తన నిర్ణయం అందరితో చెప్పేశాడు... అందర్నీ వొప్పించాలని ధీమాతోనే మనసులో మాట బయటపెట్టాడు.

"ఏమిటి రంగనాయకమ్మకి ఆస్తిలో వాటా?

పెద్దన్నగారు కొయ్యబారి పోయాడు...

"ఇల్లంతా దోచుకున్నది చాలక దానికి ఆస్తిలో వాటా - అది కావాలంటే మాత్రం నీకు నోరెలా వచ్చింది మరిదీ చెప్పడానికి"

"ఇవన్నీ చూస్తూ బ్రతకుండడం నా తలవ్రాత" అమ్మ యేడుస్తోంది.

"మీకు తెలియదు . ఆవిడ నాన్నని నమ్ముకుని బ్రతికిన మనిషి ... యివాళ నాన్నగారు పోయారని ఆవిణ్ణి వేరుచేస్తే... ఆయన మనస్సుకి..."

"ఆయనకు నచ్చిన పన్లన్నీ బ్రతికుండగానే తీర్చుకున్నాడు లేవయ్యా ముట్టజెప్పాల్సింది ముట్టజెప్పేవుంటాడు...

"మీకేమన్నా మతిపోయిందా...

అప్పులతో తలమునిగేది ఆలోచించకుండా" సుగుణ అంది వంటిగా చూసి

"నీకు తెలియదు సుగుణా .. నాన్న కొన్ని పన్లు యెంత ధైర్యంగా చేసేవాడో మరికొన్నిటిని అంత రహస్యంగానూ వుంచేవాడు ఇది ఆయన కడసారి కోరిక .."

"అంతే ..."

"మీరనుకున్నట్టు నాన్న ఆస్తిని ఆవిడకేం ధార పొయ్యలేదు. ఇంకా అక్కయ్యల పెళ్ళిళ్ళింట్లో శుభకార్యాలకు ఆవిడ డబ్బే వాడుకున్నాడు ... మొన్న కాంతం పెళ్ళికి ఆవిడ నగలు తాకట్టు పెట్టి డబ్బు తెచ్చాట్ట ... మనం యివన్నీ మర్చిపోతే యెలా ..."

సుగుణ క్షణం ఆలోచించి అంది "యివన్నీ మీ అమ్మగారికి అన్నయ్యలకూ తెలుసా"

"తెలియక పోవచ్చు"



"చెప్పి చూడండి ... అయినా యెవరూ నమ్మక పోవచ్చు."

"ఎవరూ నమ్మరు సుగుణా... భార్య, తాళికట్టిన భర్తని మోసగించినా, లేకపోతే బొమ్మలా ఆడించినా యెవరూ అంతగా పట్టించుకోరు .. అదే ప్రేమించిన ఆడది — మగవాడికోసం బ్రతికి నన్నాళ్ళూ ప్రాణం పెడుతూందంటే—పెట్టిందంటే, నమ్మలేం..."

"ఏం చెయ్యాలి ..."

"చస్తాను సుగుణా ... నా వాటా తెగ నమ్మేస్తాను ఆవిడ ఋణం తీర్చుకుందాం ..."

"వారె వారె యేమిట్రా ఆ మాటలు" చీకట్లోంచి తల్లి వచ్చింది ...

"మీరూ విన్నారా అత్తయ్యా."

"విన్నానమ్మా .. అది ఆయనకే కాదు .. వీడికీ మందెట్టింది. దానికి నగలూ, ప్రేమా యేమిట్రా వెర్రి నమ్మకం ... ఆ నగలు ఆ మహారాజు చేయించినవి కావూ. బ్రతికినన్నాళ్ళూ ఆయన చేసిన సిగ్గుమాలిన పన్లు భరించాను. ఇక భరించలేనురా — మీరూ సిగ్గు విడిచి యిలా ప్రవరిస్తే ."

"నీకు తెలియదమ్మా ..."

"నే నొప్పుకోను ... నేను చచ్చిన తరువాత మీ యిష్టం వచ్చినట్టు చేద్దురుగాని ."

న్యాయాన్ని దాచి పెట్టమని సలహాలివ్వడం, అన్యాయాన్ని సహించమనడం, వ్యక్తిపరంగా

ఇబ్బందుల్ని అనుభవించినప్పుడే కుదురుతుందేమో. అంత చీకట్లోంచి తడుముకుంటూ లేచి వీధిలోకి బయలు దేరాను...

"నువ్వా బాచీ ... అలా కూర్చో ... అమ్మెలా వుంది" నాన్నగారి మరణం రంగనాయకమ్మ మీద యెంత క్రూరంగా కసి దీర్చుకుందో ఆకిణ్ణి చూడగానే అర్థమయ్యింది..

"నాన్నగారికి జరుపుతున్న క్రతువుల్లో నువ్వు లేని లోటు కన్పించిందమ్మా... నీకు కబురంపించ లేకపోయాను .. యేమనుకోలేదు కదూ ..."

"దానికేమిటి బాబూ . ఆయన్ని ఏకాంతంగా పూజించటం నా కలవాటు... నలుగురిలో తలెత్తుకు తిరగడానికి నాకు హక్కెక్కడవుంది చెప్పు... యెంతైనా వుల్లిపువ్వు మల్లె అవదు ..

"అదేమికిమ్మా అందరికీ అన్నీ తెలియక పోవచ్చు నాకు తెలుసు. నాన్నగారి నీడగా ..."

"ఊరుకో బాచీ" కళ్ళొత్తుకుంది.

"అమ్మా నాకో మాట అడగాలని వుంది .. అడిగేదా"

"అడగు"

"నీకు పెద్దలు యిచ్చిపోయిన ఆస్తి యేమన్నా మిగిలిందా"

ఆవిడ క్షణం వింతగా చూసింది. నెరిసిపోయిన జుత్తు, నాన్నగారి వియోగంతో వత్తులయిన కళ్ళు, హరికేన్ లాంతరులో వెలవెల బోయాయి

"ఉంది.."

"ఏ మాత్రం ..."

"మనస్సు నిండుగా ఆత్మతృప్తి వుండాలన్నారు . అది వుందనే నా వుద్దేశం ."



బంగారయ్యగారు ఎంత సంపాదించినా ఏం లాభం! ఎప్పుడూ కడుపునొప్పే పట్టెడన్నం తింటే అరిగేదికాదు. ఆయన ఆరోగ్యం గురించి మన కెందుగ్గానీ — ఆయన ఓ రోజు వందరూపాయలు ఖర్చు చేసి ఓ చిలకనికొని ముచ్చటగా భార్య చేతికిచ్చాడు. చిలకమ్మ రెండు కాళ్ళకి రెండు తాళ్ళున్నాయి. (ఎలా అన్నా(నా) ఆమె ఓ తాడు లాగింది. "గుడ్ మార్నింగ్" అంది చిలక. రెండోతాడు లాగింది "నమస్కారం" అంది చిలక. ఆవిడ మురిసిపోయి ప్రేమగా భర్తవేపు చూసి "రెండు తాళ్ళూ ఒకేసారి లాగితే ఏమంటుందో" అంది.

"చట్ట విరిగేట్లు కింద పడతా — తెలివి తక్కువ దద్దమ్మా" అంది చిలక.

చమత్కారంగా ఆవిడ తప్పించాలని చెప్పిన జవాబు నవ్వు తెప్పిస్తూంటే అన్నాను.

"మీ కులంలో వాళ్లు డబ్బుని రాబట్టు కోవడం తప్పించి పోగొట్టు కోవడం యెరుగ రంటారు. నిజమేనా అమ్మా..."

"మేం నలుగురి నుంచీ డబ్బుని రాబట్టుకుంటాం..అందుకే పోగొట్టుకునే దేమిటో అందరికీ తెలసు... నమ్మకం..."

"కానీ నీవిషయంలో పైది అబద్ధమనీ వొప్పుకుంటావా.."

"నాకా విషయంలో చింతలేదు బాబీ...కానీ వొకందుకేబాధ... నేను దేవుణ్ణి నా యింటిలో యిరవై యేళ్ళు బంధించి ప్రేమించి, అందరికీ కాకుండా చేశాననే... అందుకే నేను నమ్మిన దేవుడు నన్ను కాదని వెళ్ళి పోయాడు..."

"అటు భగవంతుడూ కాదనీ... యిటు యేం మిగిలిందని నువ్వు నిశ్చింతగా బ్రతకెడ్వగలవు" అన్నాను...

రంగనాయకమ్మ నవ్వింది... వయసులో రసికుల కర్ణపుటాల్ని గింగుర్లెత్తించే నవ్వు, యవ్వనంలో ప్రేమపలుకుల పసిమిపూతతో చిక్కనై, ఆపైన సీతారామయ్యగారి ఆరాధనలో అవ్యక్తంగా మారి, ఆ తరువాత, అనుభవాల్ని ప్రతిధ్వనిస్తూ యీ నాటికి వేదాంత మిళితమైన జీవన సత్యాల్ని విప్పి చెపుతోందనిపించింది...

"నువ్వూ, విశాలా, సుధాకరం మీరంతా..."

అంతవరకూ దాచుకున్న నావుద్దేశాన్ని, నా ఆరాటాన్ని, నాన్నగారి ఆవేదన్ని, అన్నీ, పరిసరాలు మర్చి నన్నూ నా వునికినీ గుర్తు తెలియకుండా చెప్పాను .. నేను చెబుతోన్నంతసేపూ, ఆవిడలో భావాలు నిముషాలమీద రంగులుమారి, కోపానికి జారి – ఆపైన వార్ధక్యం వూగిసలాడి వుక్రోషం తెప్పిస్తే, చేతకానితనం గుర్తుచేసి కళ్ళవెంట నీటిని చిమ్మాయి.

"బాబీ ... యిన్నాళ్ళు నువ్వూ నన్ను యేడిపించావు... చాలు ... తీరలేదన్న కోరిక తీరిపోయింది."

"అది కాదమ్మా . . నువ్వు నాన్నగారికి, మా కుటుంబానికి సహాయం చెయ్యడం అబద్ధమా ..."

"కాదయ్యా...అందుకని ఇవేళ నా డబ్బునీ మీ డబ్బునీ వేరుచేసి చూడమంటావా ... నన్నింత ధైర్యంగా అడిగావు. ఇదే లలితమ్మగారి ముందైతే అనగలవా. చెప్పు. నా బ్రతుకుని, పుటకనీ నువ్వు హేళన చెయ్యడానికి యింతకన్నా నిదర్శనం యేం కావాలి..."

"మనసారా ప్రేమించినందుకు మారుగా మనుష్యులు పస్తులు పడుకోవడం మంచిదికాదు ... మా నాన్నగార్ని ప్రేమించి నువ్వేం పోగొట్టుకున్నావో నాకు తెలుసు."

"నేనేం పోగొట్టుకోలేదు... ఆయన్ని ప్రేమించి లలితమ్మ సుఖాన్ని, మీయింటి ఆనందాన్ని

హరించాననే బాధ పడుతూ వుంటాను. అందుకే నేను సతమవుతూంటే యివాళ డబ్బుకోసం, ఛీ ఛీ..."

"నీకు తెలియదమ్మా. విశాల పెళ్ళి.. సుధాకరం చదువు..."

"విశాల పెళ్ళి మానేస్తుంది సుధాకరం చదువాపేస్తాను."

"వాళ్ళకి తండ్రి వుండేవాడనీ- వాళ్ళకి హక్కు వుందనీ"


"బాబీ. నాకేం చెప్పొద్దు. నువెళ్ళిపో.. నా కోసం నువ్వేం చేశావని తెలిసినా నేను బ్రతుకను. అది గుర్తుపెట్టుకో..."

కొండంత నిరాశతో తిరుగుముఖం పట్టాను... రంగనాయకమ్మ వైఖరి అర్థంకాలేదు. కనీసం తాకట్టులో నగలు తీసుకుందుకు కూడా వొప్పుకోలేదు.

ప్రేమించినందుకు, ప్రేమించబడ్డందుకు, కన్నీరే కానుకగా యేమనిషికీ మిగలకూడదన్న నా మామూలు కోరికను రంగనాయకమ్మగారు యెందుకు కాదందో నాకు తెలియరాలేదు.

కానీ అందరి ఆడవాళ్ళలాగ తనూ వో మగవాడికి ఆలిగా బ్రతకగల్గానన్న తృప్తి, తాళి కట్టించుకోని నేరానికి తల వొంచకూడదనీ, యెగతాళి వరంగా పొందకూడదనే పట్టుదల ఆవిడ నరనరాల్లో కత్తై, కోరికై, కదులాడ్డమే కారణమని, ఎవరికైనా యెలా తెలుస్తుంది...

□□□



[గత సంచిక తరువాయి]

విజేత

యద్దనపూడి సులోచనారాణి

ఇల్లు చాలా పెద్దది. కట్టడం బాగా పురాతన పద్ధతిలో వున్నా విశాలమైన గదులతో సౌకర్యంగా వుంది. ఇంటి చుట్టూ వున్న పెద్ద ఆవరణలో యెడంవైపు నాలుగయిదు మామిడిచెట్లు, రెండు నేరేడుచెట్లు, ఒక వేపచెట్టు వుంది. వాటి మధ్య నుంచి ముందుకు వెడితే గుబురుగా పెరిగిన సరుకు చెట్లున్నాయి. వాటి మధ్యనుంచి వున్న సన్నటి కాలిబాట వెంబడి వెడితే నాలుగు ఫర్లాంగుల తర్వాత దట్టంగా వెదురుతోటవుంది. దాని ప్రక్కనుంచి ఒక అరమైలు నడిస్తే నది ఒడ్డుకి చేరుకోవచ్చు. మూసినదినుంచి పాయ ఒకటి చీలి యిటువైపు ప్రవహిస్తోంది. వర్షాకాలం తప్పితే నదిలో నీళ్ళు అంత యెక్కువగా వుండవు. ప్రశాంతమైన యీపరిసరాలు, యీ ప్రకృతి సౌందర్యం చూసిం తర్వాత మాధవ్‌కి ప్రాణం లేచివచ్చింది. వస్తుతః పల్లెటూరు అంటే మక్కువ కలిగిన అతనికి తక్షణం మకాం యిక్కడికి మార్చెయ్యాలని నిశ్చయించుకోటానికి యెక్కువసేపు పట్టలేదు. చేతిలో కారుయెలాగూవుంది. 40 మైళ్ళు అంటే పెద్ద దూరం యేమీకాదు. ఉదయంవెళ్ళి పగలంతా పని చూసుకుని రాత్రికిరావచ్చుకూడా.

చాలా రోజులనుంచి మనుష్యులు నివసించకుండా వదిలేయుటంవల్ల యిల్లంతా పాడు బడిపోయి పెద్ద సాలెగూళ్ళతో భయంకరంగా వుంది. గోడలు వెలిసి పోయి వున్నాయి. ఇంటిచుట్టూ వున్న ఆవరణలో గుబురుగా పెరిగిన పిచ్చి మొక్కలు పురుగు పుట్రలకి నిలయాలైనాయి. ఆ రోజే అక్కడనుంచి తిరిగి వెళ్ళిపోయిన మాధవ్ నాలుగు రోజుల తర్వాత కంపెనీలో ఒకతన్ని తీసుకువచ్చి యిల్లంతా చూపించి యెలా యెలా మార్పులు చేయాలో సూచించాడు. ఎంతయినా సరే డబ్బుకోసం చూడకుండా యింటి చుట్టూ మంచితోట పెంచే విధానం చూడమన్నాడు.

రెండు నెలలు తిరిగేసరికి యింటి స్వరూపమే మారిపోయింది. మామిడి చెట్లక్రింద పేరుకున్న చెత్తా చెదారం తొలగించేశారు ఇప్పు డా ప్రదేశం అంతా నున్నగా అద్దంలా ఉంది. ముందు ఆవరణలో వేసిన పూల మొక్కలు నాటుకుని ఏపుగా పెరగ

దం ప్రారంభించాయి. ఇంటికి సున్నం వేయించి. కిటికీలకి తలుపులకి రంగువేయటంతో కొత్తకళవచ్చింది. మళ్ళీవచ్చినప్పుడు యిదంతా చూసి మాధవ్ తృప్తిగా తలాడించాడు.

'ఒక్క చిన్న మనవి సార్!' అన్నాడు మేనేజర్.

'ఏమిటది? –'

'మన యింటినుంచి నది ఒడ్డుకి వెళ్ళే త్రోవలో ఆ వైపు సరుకుతోట లేదూ? –'

మాధవ్ వున్నది అన్నట్టు తలూపాడు.

'దాని కిటుప్రక్కన చిన్న పెంకుటిల్లు వుంది సార్.'

'వుంటే? –'

'అది చాలా పాతది. దాన్నెలాగైనా కొనేశారంటే అక్కడ మంచి తోట తయారు చేయవచ్చు.'

మాధవ్ కనుబొమలు ముడిచాడు.

'ఎక్కువ ఖరీదు వుండదుసార్. చాలా పాతయిల్లు. శిథిలావస్థలో వుంది.'

'ఖరీదుగురించి కాదు ప్రశ్న. అమ్మటానికి వాళ్ళు ఒప్పుకోవద్దూ? —'

'వాళ్లు చాలా బీదవాళ్లు. మనం కొద్దిగా ఎక్కువ ఆశ చూపిస్తే—'

'ప్రయత్నంచేసి చూడండి.' అన్నాడు.

హుషారుగా వెళ్ళిన మానేజర్

జరిగిన కథ

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించి, విడుదలయి మాధవ్ స్వగ్రామానికి బయలుదేరుతాడు. త్రోవలో రాత్రిపూట కోచ్‌లో ప్రయాణం చేస్తున్న ఒక యువతి తారసిల్లుతుంది. కోచ్ బురదలో కూరుకుపోయింది. మాధవ్ సహాయాన్ని అపార్థం చేసుకుని ఆమె అతన్ని కొట్టి గాయం చేస్తుంది. ఆ తరువాత అతడు స్వగ్రామంవెళ్ళి తన తల్లి చనిపోయిందని, తాను ప్రేమించి పెళ్ళాడ దలచిన సుధ వేరొకరిని పెళ్ళాడిందని తెలుసుకుంటాడు. వికలమైన మనస్సుతో అగమ్యంగా రైల్వే స్టేషనుకు వెళ్ళి ఎదురుగా వున్న ఫస్టుక్లాస్ కంపార్టుమెంటులో ఎక్కుతాడు. అందులో తన నిదివరకు కొట్టి అవమానించిన యువతే వుంటుంది ఆమెపై ప్రతీకార వాంఛ రగిలి ఆమెకు మానభంగం చేస్తాడు. ఆ తరవాత అతడు జైలులో తన సహవాసిఅయిన రామగోపాలరావు గారి మరణించడంతో ఆయన ఆస్తికి వారసుడవుతాడు.

ముఖం వేళ్ళాడేసుకుని తిరిగి వచ్చాడు.

"వాళ్ళు అమ్మేటట్టులేరు."

"ఎవరిది అసలు ఆ యిల్లు?"

"హైద్రాబాద్‌లో ఒక జాగీర్దారుయింట్లో పనిచేసే నౌకరిదిట."

"అతన్ని పిలు. నేను మాట్లాడతాను."

"అతనిప్పుడు లేడుసార్. రజాకార్ మూమెంట్‌లో చనిపోయాట్ట. అతని భార్యా పిల్లలున్నారు. వాళ్లు ఒప్పుకోవటంలేదు"

"అయితే యేం చేస్తాంమరి."

"సార్! మీరు కాస్త ప్రయత్నించి చూడండి. అక్కడతోట చాలా బాగా వస్తుంది. మీరడిగితే వాళ్లు కాదనలేరని నా నమ్మకం." మానేజర్ వేధించటం ప్రారంభించాడు.

మాధవ్ యింతవరకూ యెప్పుడూ ఆ యింటి వైపు వెళ్ళలేదు. అతని పడగ్గదిలోంచి చూస్తే దూరంగా దట్టంగావున్న చెట్లకొమ్మలకి అల్లిబిల్లిగా అల్లుకున్న అడవితీగెల మధ్య చిక్కుపడిపోయిన పెంకుటిల్లు నడికప్పుమాత్రం కనిపిస్తుంది. ఇంట్లో వంట చేస్తున్న సూచనగా అప్పుడప్పుడూ సాయంత్రం వేళల వలయాలు వలయాలుగా పొగ పైకి లేస్తూ ఉంటుంది.

సాయంత్రం అలా నది ఒడ్డుకి షికారుకి వెళ్ళినప్పుడు కావాలని చుట్టు తిరిగి అటువైపుగా వాళ్ళ యింటి ముందునుంచి వచ్చాడు. ఎన్ని యుగాలనాటిదో అన్నంత పాతగా వున్న చిన్న పెంకుటిల్లు సున్నం వేసికూడా చాలా రోజులైనట్టుంది. కళావిహీనంగా వుండి శిథిలం కావటానికి సిద్ధంగా వుంది. ఇంటిముందు వరండా మట్టిలో అలికి ముగ్గు పెట్టివుంది. గుమ్మానికి వెలిసిపోయిన పాత చీరె కర్టెన్‌గా వేళ్ళాడుతోంది. ఇంటిముందున్న పందిరికి మాలతి బటాని తీగెలు పెనవేసుకుని పైకి పాకి ఉన్నాయి. మేనేజర్ చెప్పింది నిజమే. ఆ యిల్లుని కొనేస్తే అక్కడ మంచి తోటే కాదు చిన్న డాబా కూడా వేసుకోవచ్చు. అక్కడనుండి నది, దాని కవతలవున్న చిట్టడవి కన్నుల కింపుగా అద్భుతమైన దృశ్యంలా ఉంటుంది.

ఇంటికి తిరిగి వస్తూనే మాధవ్ మానేజర్‌ని పిలిచి, "ఆ యింట్లో యెవరెవరుంటారు?" అన్నాడు.

"తల్లి యిద్దరు పిల్లలండీ!"

"ఆడపిల్లలా మగపిల్లలా?"

"ఇద్దరూ నండీ. ఆడపిల్ల పెద్దది. మగపిల్లాడు చిన్నవాడు."

"తల్లి కెంత వయసుంటుంది?–"

"50 కి పైన వుండచ్చు."

"ఆడపిల్లకి? –"

మానేజర్ బుఱ్ఱ గోక్కున్నాడు. "నేను సరిగ్గా చూడలేదు మావుంటే పాతికేళ్ళు వుండచ్చు."

"పెళ్ళికాలేదా? –"

ఈసారి అతను చెవి గోక్కున్నాడు. "తెలియదండి."

"మగపిల్లాడు ?-"

"అతను కుంటివాడు, మంచం లోంచి లేవలేడు."

"మరి యెవరితో మాట్లాడాలి ? నువ్వే వెళ్ళి వాళ్ళు ఆ యిల్లు అమ్మేస్తే యిటువైపు రోడ్డుకి దగ్గరగా వున్న మన స్థలం యిచ్చేస్తాం అని చెప్పు."

మానేజర్ హుషారుగా పరుగెత్తబోయాడు.

"ఇదుగో !" మాధవ్ వెనకనుంచి పిల్చి "ఆ స్థలంలో చిన్న యిల్లు వేయించే బాధ్యత కూడా మనమే తీసుకుంటాం అని చెప్పు" అన్నాడు.

"అలాగే." మరుక్షణంలో అక్కడినుంచి మెరపులా మాయమౌతూ అన్నాడు.

పదినిమిషాల తర్వాత కాళ్ళీడ్చుకుంటూ తిరిగివచ్చాడు.

మాధవ్ యేం అన్నట్టు చూశాడు.

"లాభంలేదండి! వాళ్ళు అమ్మరిట."

"ఎందుకని? డబ్బు కొంచెం యెక్కువ ఆశ చూపించక పోయావా?"

"ఆపని ముందే చేశానండి!"

"ఒప్పుకోకపోతే-యింటి ప్రక్కనుంచి పద్ద పెద్ద కాలువలు తవ్వి నదిలోంచి నీరు తీసుకుంటామని బెదిరిస్తేసరి."

మాధవ్ కోపంగా అన్నాడు. అతను కావాలనుకుని కోరుకున్నది లభించక పోతే మహా చిరాకు పడతాడు. ఎలాగైనా దాన్ని సాధించే వరకూ నిద్రపట్టదు.

"ఎవర్ని బెదిరిస్తాం చెప్పండి? ఇంట్లోవున్నది—ఆడవాళ్ళు. చచ్చి గీ పెట్టినా సమాధానం చెప్పరు."

"ఆడవాళ్ళయితే యింకా సులభం." మాధవ్ పెదిమలు కఠినంగా నవ్వాయి.

"వాళ్ళనిచూస్తే అలా అన్పించటంలేదు." సణిగాడు మానేజర్.

"సరె! నేనే చూస్తాన్లే-" ఈ



మ్యూజియం సందర్శిస్తున్న మంత్రిగారికి ప్రాచీన శిల్పాలు చూపిస్తున్నారు.

"అయ్యా ఇది మూడువేల ఏళ్ళనాటిది"

మంత్రిగారు తన సెక్రటరీ వైపు తిరిగి జనాంతికంగా "నోట్ చేసుకోవయ్యా—ఇదేదో మోసంలా వుంది—ఇది 1966 వ సంవత్సరం కదా! మూడువేల ఏళ్ళంటాడు. వీళ్ళకి గ్రాంటు రద్దు చెయ్."

విషయం తనే స్వయంగా తేల్చు కోటానికి నిశ్చయించుకున్నాడు.

మర్నాడు అలా నది ఒడ్డుకేసి వెళ్ళి తిరిగివస్తూంటే భుజంమీద తడిబట్టలతో చంకన బిందెతో ఒకావిడ యెదురైంది. వయసునిబట్టి రూపురేఖలని బట్టి ఆవిడ యెవరో తేలికగానే వూహించ కలిగాడు.

'మీ దొడ్లో బావి లేదూ?—' పరిచయం కల్పించుకోటానికి చాలా మృదువుగానే అడిగాడు.

'లేదు' ముక్తసరిగా అని ఆవిడ వెనక్కు తిరిగిచూడకుండా గబగబా వెళ్ళిపోయింది.

15

తర్వాత వరసగా రెండురోజులు నదిఒడ్డున ఆవిడకోసం చూశాడు. కాని కన్పించలేదు.

చివరికి ధైర్యం చేసి తనే వాళ్ళింటికి వెళ్ళాడు. వరండాలో పరదాముందు నిలబడి మెల్లగా చప్పట్లు చరుస్తూ చప్పుడు చేశాడు. సమాధానంగా లోపల్నుంచి 'యెవరది?' అంటూ పసితనంపోని మగ కంఠం విన్పించింది.

'కొంచెం యివతలకి వస్తారా?' మాధవ్‌కి ఇంట్లోకి వెళ్ళ వచ్చో లేదో తెలియలేదు.

'మీరే లోపలికి రండి.' లోపలి నుంచి ఆహ్వానం రావటంతో క్షణం సేపు తటపటాయించి కర్టెన్ తొలగించుకుని లోపలికి అడుగుపెట్టాడు.

విశాలంగా వున్న గదిలో పాత కాలపు చువ్వ లున్న కిటికీ దగ్గర మంచం మీద పడుకుని ఉన్న కుర్రాడు, చూస్తూన్న పుస్తకం ప్రక్కకు పెట్టుకుని ప్రశ్నార్థకంగా చూస్తున్నాడు. అతనికి మహా వుంటే 14—15 సంవత్సరాలుంటాయి. కాని మరీ సన్నగా వుండటంవల్ల అంత కూడా అన్పించదు.

'నా పేరు మాధవ్. నేను—' అతను వాక్యం పూర్తి చేయనే లేదు. కుఱ్ఱాడు వికసించిన ముఖంతో 'ఆ దెయ్యాల కొంప యజమాని కదూ! రండి,—రండి — మిమ్మల్ని గురించి జోగులు రోజూ చెబ్తూనే వుంటాడు.' అని ఆగి దూరంగా వున్న స్టూలు వేలితో చూపిస్తూ 'అది కొంచెం తెచ్చుకుని యిక్కడ వేసుకుంటారా? నేను మంచంలోంచి లేవలేను' అన్నాడు.

చివరిమాటల్లో అతని కళ్ళలో లీలగా బాధ గోచరించింది.

మాధవ్ స్టూలుకోసం వెళ్ళాడు.

'మీరెంత మంచివారు! నేను మంచంలోంచి లేవలేనని తెలిసి నన్ను స్వయంగా చూడటానికి వచ్చారుకదూ! ...

మాధవ్ తెల్లబోయాడు. అయినా అతన్ని నిరాశ పరచటం యిష్టంలేక అవునన్నట్టు తలూపాడు.

'ఇలా — యిక్కడ — నా దగ్గిరిగా వేసుకోండి —' కిటికీ దగ్గరగా తన మంచం ప్రక్కన చోటు చూపిస్తూ అన్నాడు. మాధవ్ స్టూలు తెచ్చి

సరిగ్గా అక్కడే వేసుకుని కూర్చు న్నాడు.

'మీరు అచ్చు నేను వూహించినట్టే వున్నారు. కాబోతే మీరింత చామనచాయ అనుకోలేదు. బాగా తెల్లగా వుంటారనుకున్నాను.' మాధవ్ యిల్లంతా పరీక్ష చేస్తున్నాడు. ప్రక్కగది ఒకటి వుంది. లోపల వంటగదిలో యింకో గుమ్మం వుంది. లోపలున్న యీ గుమ్మానికి తెరలు లేవు. ఇంట్లో సామానేం లేదు.

'అబ్బ! శాస్త్ర చదువు సంధ్యలున్న మనిషిని చూసి యెన్నాళ్ళయింది!' మాధవ్‌ని తనివితీరా చూస్తూ తృప్తిగా అన్నాడు.

'ఈ యింటికి పెద్ద యెవరు ?—' వచ్చినపని ఆలస్యం లేకుండా సూటిగా బైట పెట్టటానికి ప్రథమ ఘాతం ప్రారంభించాడు.


'నేనే! యేం? యేంకావాలి మీకు?—' సగర్వంగా వచ్చింది సమాధానంతోపాటు ప్రశ్నకూడా.

మాధవ్ విస్మయంగా చూశాడు.

'ఇంటికి పెద్ద అంటే యింట్లో వున్న మగాడేగా! నేనుతప్ప యీ యింట్లో మరో మగ పురుషుడు కూడా లేడు.' మంచం మీదనుంచి లేవలేకపోయినా యీ పెద్ద మనిషి మాటల్లో గాంభీర్యానికేమీ కొరత లేదు.

మాధవ్ మౌనం వహించాడు. ఈ కుఱ్ఱాడిని చూడగానే అతని వూహాలు కొద్దిగా తలక్రిందులయినాయి

'అప్పుడప్పుడు రేడియో విన్న



స్తుంది. మీ యింట్లో నేనా?' ఆత్రంగా అడిగాడు మళ్ళీ.

అవునన్నట్టు తలూపాడు మాధవ్.

'నేనప్పుడే అనుకున్నానండి. లేకపోతే యింకెక్కడనుంచి విని పిస్తుంది. ఈ వూళ్ళో వెధవలకి అసలు రేడియో అనేది ఒకటి వుందనికూడా తెలిసి వుండదు. తింటానికే గతిలేని మనుష్యులు.'

'మీది యీ వూరు కాదా?—' కుతూహలం పట్టలేక అడిగాడు.

'మాఊరా?—ఛి—ఛి యెందుకవుతుంది! మీరు నా వంక సరిగ్గా చూడండి. నేను యీ ఊరు మనిషిలా వున్నానా?—'

మాధవ్ లేదన్నట్టు తలూపాడు.

'మరింకా అడుగుతారేం? మా నాన్న నవాబు దగ్గర మిలిటరీ ఆఫీసర్‌గా పని చేసేవారు. జాగీర్దారు ఫాయాలో పెరిగిన కుటుంబం మాది. అఫ్‌కోర్స్. చెప్తే నమ్మరనుకోండి.'

మాధవ్ నిజంగానే నమ్మలేక పోయాడు.

'రజాకార్ మూమెంట్‌లో మా నాన్నని కాల్చి చంపేశారు. నాన్నగారు వున్నప్పుడు బాగా వున్న వాళ్ళంలాగానే వుండేవాళ్ళం. ఆయన పోయి ఆ గొడవంతా చల్లారగానే అప్పుల వాళ్ళంతా చుట్టేసి చివరికి యింట్లో వున్న కుర్చీలు, బెంచీలతోసహా పట్టుకు పోయారు. గాలివానలో గూడు పోయిన పిట్టల్లా నేనూ మా అక్కా మిగిలిపోయాం.' కుర్రాడి కంఠం దిగులుగా మారి పోయింది.

'ప్రస్తుతం యీ యిల్లు తప్ప యింకేం లేదా?'

'ఊహు. ఆ మాట కొస్తే యీ యిల్లు కూడా మాది గాదు. మా నౌకరుది. అప్పుడప్పుడు మా నాన్నగారు అతనికి చాలా డబ్బు యిచ్చే వారు. దాంతో కొనుక్కున్నది! అయితేమాత్రం! ఓసారి యిచ్చింది తిరిగి తీసుకోవటం మర్యాద అంటారా? కాదు. కాని యేం చెయ్యాలి! తప్పలేదు. నేనేమో బొత్తిగా మంచం లోంచి లేవలేని వాడిని.'

'ఏమైంది? యేమైనా యాక్సిడెంట్ అయిందా?—' కుర్రాడి ముఖం చూస్తుంటే మాధవ్‌కి అపరిమితమైన జాలేసింది.

'కాదు రజాకార్ మూమెంట్ అప్పుడే. మానాన్నని – మా నౌకర్ని కాల్చేస్తుంటే భయపడి పారిపోటానికి గోడ దూకబోయి పట్టుతప్పి క్రిందపడ్డాను. నడుందగ్గర యెక్కడో ఎముక విరిగిపోయింది.'

మధ్యలో వచ్చిన అంగవైకల్యం యెంత భయంకరమో మాధవ్‌కి తెలియక పోలేదు. అందుకే— 'డాక్టర్లకెవరికీ చూపించలేదా?' అని అడిగాడు.

'ఎందుకు చూపించలేదూ? మా అక్క ఒంటి మీద వున్న

బంగారం కాస్తా నా కోసమే తగల పెట్టేసింది. ప్రయోజనం లేకపోగా దరిద్రం పట్టుకుంది. ఏమిటో! ఒక్కోసారి ఆలోచిస్తే - యిలాటి బ్రతుకు జీవచ్ఛవంలా బ్రతికే కంటే-" కంఠం బొంగురుపోవడంతో ఆగిపోయాడు. పాపం! యెంత విషాదగాథ! అతన్ని చూస్తుంటే జీవితంమీద విపరీతమైన ఆసక్తి వుండి - యేం చెయ్యలేక బలవంతంగా మంచంమీద వెళ్ళదీస్తున్న బాధ - నిస్సహాయత కన్పిస్తోంది. మాధవ్‌కి ఆ కొద్ది పరిచయంలోనే అంతరాంతరాళంలో యెక్కడో ఈ కుఱ్ఱాడంటే జాలితో కూడిన సానుభూతి యేర్పడసాగింది.

మొదట యీ వూరు చూడగానే బొత్తిగా చలనంలేని పల్లెటూరు అనుకున్నాడు. కాని తనకేం తెలుసు. ఈ మారుమూల నిస్సహాయతతో మండుతున్న మనసు ఒకటుందని. తనకు చాతనైనంత సహాయం యితనికి చేసితీరాలి. అసలతనికి చిన్నప్పటినుంచి నోరులేని పశుపక్ష్యాదులన్నా, అనారోగ్యంతో తీసుకునే మనుష్యులన్నా విపరీతమైనజాలి. అభిమానం చూపి ఆదరించటంలో అతనిచేయినిస్సహాయంగాముందుకు వస్తుంది.

"మీ అక్క యేం చదువుకోలేదా?—" సానుభూతిగా అడిగాడు.

"చదువుకోలేదా!—" కుఱ్ఱాడు కళ్ళు పెద్ద పెద్దవిచేసి చూశాడు.

"మా అక్కంత తెలివైన వాళ్ళు నూటికి ఒకరుకూడా వుండరని నా విశ్వాసం." అన్నాడు సగర్వంగా.


"చదువుకి తెలివి తేటలకి చాలా తేడావుంది బాబూ!"

"అవుననుకోండి. అయినా మా అక్క బి. ఎ. ప్యాసయింది."

మాధవ్ తల్లక్రిందులైనట్టు చూశాడు.

"బి. ఎ. ప్యాసయిందా! అయితే వుద్యోగం చేసుకోవచ్చుగా!" అన్నాడు ఆశ్చర్యంగా.

"చేసుకోవచ్చు. కాని యిష్టం లేదు. ఆ మాటకొస్తే హైద్రాబాద్ అంటేనే అసహ్యం మాకు" ఎందుకో తెలియదు. అతని ముఖం మళ్ళీ విషాదంగా మారిపోయింది.



"ఆ మధ్య చార్‌మినార్ పైకి ఎక్కినపుడు చేతి గడియారం జారి కిందపడింది. ఉరుకులు పరుగులతో కిందకి దిగి వచ్చి చూద్దును కదా, భూమికి మూడు అడుగుల పైన ఆగిపోయివుంది."

"ఏముందీ — కి యివ్వటం మర్చిపోయి వుంటావూ."

పిల్లలను ప్రేమించుటయే చాలును
మీ కుటుంబమును నిర్ణయించుకొనుటకు



తల్లిదండ్రుల ప్రేమ, అనురాగములకంటె ఎక్కువ ప్రేమ అవసరం, మరియు పర్యవసానము [illegible] పిల్లలకు [illegible] ఆహారము, బట్టలు, మరియు విద్య ఇవ్వగలుగుట.

సంతోషమునకు పథకము

ఎప్పుడైతే పిల్లలను కావలెనని అనుకొందురో ... వారిని పోషించగల శక్తియున్నప్పుడే వారిని కలిగియుండవలెను. మీ కుటుంబము ఎప్పుడూ మీ సంతోషమునకు మూలాధారమై యుండవలెను.

అభివృద్ధికి పథకము

మీ రాబడి ఎంత ఉన్నను, మీ కుటుంబమునకు మేలైన జీవనము, వస్త్రధారణ మరియు విద్య ఇచ్చి మీ కుటుంబమును నిర్ణయము చేసుకొన్నప్పుడే ఇవ్వగలుగుదురు. అది మీ స్వవిషయములో ఒక ముఖ్యమైనది — మీ దేశ విషయములోనూ కూడ



మీ ఊరిలో వున్న కుటుంబ నియంత్రణ కేంద్రము సందర్శించండి.

అక్కడ వున్న డాక్టరు ఒక స్నేహితుడూ సహాయదారు కాగలరు. మీ కుటుంబమును నిర్ణయము చేసుకొనుటలో తోడ్పడుదురు

మీయొక్క కుటుంబము ఆరోగ్యమైన కుటుంబమయిన
దేశము పరి[illegible]

DA 65/521

"ఎందుకని? — పోనీ అక్కడిష్టం లేకపోతే — యింకో ఊరు వెళ్ళ వచ్చుగా?" వెంటనే యేదో చెప్ప టానికి నోరు తెరిచిన కుర్రాడు హఠాత్తుగా ఆగిపోయి అనుమానంగా చూస్తూ "మీరు భలేవారే! నా చేత మా యింటి రహస్యాలన్నీ చెప్పించు కుంటున్నారే!" అన్నాడు.

"అబ్బెబ్బె! అదేం లేదు. అయినా యివి రహస్యాలెలా అవుతాయి? అందరికీ తెలిసిన విషయాలే! నేను కొత్తవాడిని కాబట్టి నాకు తెలియవు. అంతేనా?—" అన్నాడు ఖంగా రుగా.

కుర్రాడు అవును అన్నట్టు తలూ పాడు. కాని మళ్ళీ నోరు మెదప లేదు. సంభాషణ హఠాత్తుగా ఆగి పోయింది. కొద్దిసేపయిం తర్వాత మాధవ్ వస్తానని లేచాడు.

వచ్చేస్తుంటే వెనకనుంచి "మీ రేమీ అనుకోకపోతే—యీ రేడియో యింకొంచెం బిగ్గరగా పెట్టూరా. నాకు పాటలంటే ప్రాణం." అన్నాడు. అతని కంఠం అపలికే తీరు అడగలేక అడుగుతున్నట్టుగా వుంది.

"అలాగే! అది రేడియో కాదు. ట్రాన్సిస్టర్. కావాలంటే రేపుతెచ్చి యిస్తాను."

"నిజంగా!" అతనింత వరకూ ట్రాన్సిస్టర్ అనే పేరు వినటమే గాని కళ్ళతో స్వయంగా చూడ లేదు. వెంటనే వికసించిన ముఖంతో "మళ్ళీ మీరు వెళ్ళేటప్పుడు జాగ్ర తగా తీసుకెళ్ళి పోదురుగాని. ఒక్క సారి చూసి యిచ్చేస్తాను." అన్నాడు ఆత్రంగా.

"అలాగే!" వెళ్ళ బోతున్న వాడల్లా హఠాత్తుగా ఆగి "ఇంతకీ నీ పేరు ఏమిటో నేను తెలుసుకోనే లేదు." అన్నాడు.

"వాసుదేవరావు, అక్కా వాళ్ళంతా వాసు అని పిలుస్తారు. మీరు కూడా అలాగే పిలవచ్చు. నాకభ్యంతరం లేదు." అన్నాడు హుషారుగా.

మాధవ్ గుమ్మం దాటుతుంటే వెనకనుంచి "రేపు రావటం మర్చి పోరుగా?" అని ఆదుర్దాగా విని పించింది.

మర్చిపోను అన్నట్టు తలూపి బైటికి వచ్చేశాడు.



మంత్రిగారు మంత్రిగా అవడానికి ముఖ్య కారకుడైన పెద్దమనిషి, మంత్రిగారి వద్దకొచ్చి ఉద్యోగం అడిగాడు. మంత్రి గారు కాసేపాలోచించి "ఉద్యోగాలేం లేవయ్యా. అయితేనేం—ఉద్యోగాలెందుకు లేవో పరిశీలించడానికి ఓ కమిటీ ఏర్పాటు చేసి దానికి అధ్యక్షుడుగా నిన్ను వేస్తాలే". అని హామీ ఇచ్చాడు.

ఇంటికి వెళ్ళిన తర్వాతకాని అతనికి వెళ్ళిన అసలుపని మర్చిపోయినట్టుగా గుర్తుకు రాలేదు. మర్నాడు అది పూర్తి చేసుకోటానికి నిశ్చయించుకున్నాడు.

16

మర్నాడు సరిగ్గా అదే వేళకి వెళ్ళి ట్రాన్సిస్టర్ యిచ్చి దాన్ని యే విధంగా వుపయోగించుకోవాలో చెప్పాడు. వాసు బుఱ్ఱ చాలా తెలివైంది. రెండోసారి చెప్పించుకోకుండానే అంతా గ్రహించేశాడు మళ్ళీ కబుర్లతో కాలం దొర్లిపోయింది. వాసుకి పుస్తకాలన్నా, ఆటలన్నా ప్రాణం. సినిమాలంటే యెంత యిష్టమో చెప్పనేలేం. స్కూల్లో చదువుకునేప్పుడు అన్నింటిలో ఫస్ట్‌లో వుండేవాడుట. ఆ రోజుల గురించి చెబుతుంటే అతని కళ్ళనిండా గిఱ్ఱున నీళ్ళు తిరిగాయి. ఎన్ని రోజుల నుంచో మూగగా అనుభవిస్తున్న బాధని మాధవ్ నొక్కి అడగకుండానే వాసు వెళ్ళగ్రక్కేశాడు.

"ఇంట్లో యెవరూ లేనట్టున్నారేఁ?—" ప్రసంగం మార్చటం కోసం అడిగాడు.

అతను వచ్చి యింతసేపయినా యెలాంటి శబ్దం వినిపించలేదు.

"ఎవరుంటారు? ఆయా నీళ్ళకెళ్ళివుంటుంది."

"ఆయా?"

"అవును. ఏం? అమ్మ అనుకున్నారా? అందరూ అలాగే అనుకుంటారు."

"అనుకోవాలనే మా వుద్దేశ్యం కూడా. నిజానికి మాకు కన్నతల్లి కంటే యెక్కువ. అసలు మా స్వంత తల్లిని మేం ఎరగనే ఎరుగం మా అక్కంటే ఆయాకి మరీ ప్రాణం. నాకంటే కూడా."

మాధవ్ వింటూండి పోయాడు. కలిగిన కుటుంబాల్లో యిలా దాసీలు యజమానుల పిల్లల్ని కన్న సంతానంలా పెంచి పెద్ద చేయటం సహజంగా జరుగుతూనే వుంటుంది. అందులో పెద్ద విశేషం యేమీలేదు.

అక్క పొలం దగ్గరకు వెళ్ళి వుంటుంది.

"పొలం దగ్గరకా?—" వాసు మాట్లాడే ఒక్కొక్కమాట తుపాకి గుండులా వుంది.

"అవును. పొలం అంటే అదేదో పెద్ద పంట అనుకోకండి. చిన్న కూరగాయల తోట. మా సంధ్య వాటిని పట్నం పంపించి అమ్మిస్తుంది."

మాధవ్ విస్మయంగా, కుతూహలంగా వినసాగాడు.

"ఎవరిదగ్గరైనా పూరికే తీసుకుంటే తప్పు. దొంగతనం చేస్తే అపరాధం. అన్యాయంగా సంపాదిస్తే పాపం. డబ్బు సంపాయించటానికి శీలంగాని, వ్యక్తిత్వంగాని పోగొట్టుకుంటే సిగ్గుపడాలి. కాని

కాయకష్టం చేసుకుని బ్రతికితే యెవరికీ తల వంచాల్సిన పనిలేదు అంటుందిమా సంధ్య.' అక్కగారిని గురించి చెప్పేటప్పుడు వాసుకళ్లు గర్వంతో మెరవడం మాధవ్ గమనించకపోలేదు.

'కాని వుద్యోగం చేసుకోవచ్చునే!-'

ప్రసంగం మళ్ళీ నిన్నటిచోటుకి వచ్చి ఆగిపోయింది.

'చేసుకోవచ్చు. మా పరిస్థితులు చితికిపోయిన తర్వాత అక్క రెండు మూడుచోట్ల చేసిందికూడా. కాని ఆఫీసులో వాళ్ళు ఆమె పనికి ఆమెని వదిలేయకుండా అనవసరంగా స్వవిషయాల్లో జోక్యం కల్పించుకునే వాళ్ళు. పై అధికారులు హద్దుమీరి ప్రవర్తించే వాళ్ళు మా అక్కది అసలే సున్నితమైన స్వభావం. ఆ బాధలకి తట్టుకోలేక పోయేది. తప్పనిసరిగా వుద్యోగం చేయాల్సి వచ్చిన తన దురదృష్టాన్ని తలుచుకుని రాత్రిళ్లు మేలుకుని వెక్కి వెక్కి యేడ్చేది. అక్క బాధ పడుతుంటే అయ్యా భరించలేక పోయేవ. దగ్గరకి లాక్కుని వుద్యోగం లేకపోయినా బ్రతకగలం అని ధైర్యం చెప్పేది. చివరికి అయ్యా బలవంతంమీదనే యీ వూరు వచ్చాం. ఈ కూరగాయలతోటు — ఈ వ్యాపారం అయ్యా చెప్పిన ఆలోచనే. కాయకష్టం బాధ తప్పితే-మాకు అప్పటి నుంచి యిల్లు హాయిగా, ఏ ఇబ్బంది లేకుండా గడిచిపోతోంది.'

వాసు ద్వారా యీ కబుర్లన్నీ వింటూ చాలా సేపు అక్కడే కూర్చున్న మాధవ్ చివరికి వస్తానని లేచాడు. ఇంతలో అయ్యా భుజం మీద తడిబట్టల్తో, నీళ్ళ బిందెత్తో లోపలికి వచ్చింది. మాధవ్ ఆగిపోయాడు.

'అయ్యా! నిన్న నేను చెప్పానే యీయనే-ఆ దెయ్యాల కొంపని, దేవతాగృహంగా మార్చిన మాధవ్ గారు. 'వాసు' వుత్సాహంగా పరిచయం చేశాడు మాధవ్ స్నేహపూర్వకంగా నవ్వాడు. అయ్యా మాట్లాడకుండా చూసి చూడనట్టు



ఓ మంత్రిగారు తమ పెద్దబ్బాయికి ఉద్యోగం వెతుకుతున్నారు. రెండు మూడు గంటలైనా కూడా దొరకలేదు. చివరకు ఒక గవర్నమెంటు ఆఫీసరుగారికి ఫోన్ చేశారు. ఆయన "అమ్మమ్మా, అంతకన్నానా. తప్పక ఉద్యోగం వేయిస్తా నా అఫీసులోనే — మీ అబ్బాయికి ఏ పని చేతవును?" అన్నాడు.

"ఏ పనీ చేతకాదు" అన్నారు మంత్రిగారు.

"బెస్టూ! వెంటనేవచ్చి చేరిపొమ్మనండి"

అక్కడినుంచి లోపలకు గబగబా వెళ్ళిపోయింది.

'ట్రాన్సిస్టర్ తీసుకెళ్ళరూ?—' వెనకనుంచి వాసు అడిగాడు

"వద్దులే. వుంచుకో! రేపు తీసుకు వెడతాను." మాధవ్ బైటికి వచ్చేశాడు.

17

వాసు దగ్గరనుంచి వచ్చేసిన మాధవ్‌కి అప్పుడే యింటికి వెళ్ళాలనిపించలేదు. నదిఒడ్డుకి షికారుగా వచ్చాడు. అతను యీ వూరు రాగానే మనసుని ఆకట్టుకున్న స్థలాల్లో యీ నదిఒడ్డు ఒకటి. అక్కడంతా యీతపొదలు, వాటిని పెనవేసుకున్న అడవి తీగలు, నది ఒడ్డుని అనుకుని రెల్లుదుబ్బులు కూడా చాలా వున్నాయి. ప్రశాంతంగావున్న యీ పరిసరాల్లో పిట్టల కలకలం, గాలిలో యీలల చప్పుడు తప్ప యింకేమీ విన్పించదు.

సాయంత్రం సమయంలో అక్కడలా ఒంటరిగాపడిపోయినఒక చెట్టుకి చేరగిలబడి దూరంగా నదినీళ్ళమీద అస్తమిస్తున్న సూర్యబింబాల్ని, అది వెదజల్లే అరుణకాంతిని, దాన్ని తనలో ప్రతిబింబించుకుంటున్న నదినీటిని రెప్పవాల్చకుండా చూస్తూ చాలాసేపు అక్కడ నిలబడిపోవటం అతనికి అలవాటయిపోయింది.

చాల రోజుల తర్వాత ఈ రోజు అతనికి ప్రశాంతంగా వుంది. హాయిగా వున్న ఆ పరిసరాల్లో యెక్కడా నిలబడా లనిపించక పోవటంతో ప్యాంట్ జేబుల్లో చేతులుంచుకుని తల వంచుకుని అలాగే నడక సాగించాడు.

ఎంత దూరం నడిచాడో అతనికి ధ్యాసే లేదు. మాటిమాటికి వాసు మాటలే గుర్తుకు రాసాగినాయి. ఎంత విచిత్రమైన కుటుంబం! కలిగిన కుటుంబంలో పుట్టి అంతో యింతో చదువుకున్న ఆడపిల్లకి అలా ప్రపంచాన్నుంచి పారిపోయి ఒంటరిగా యీ మారుమూల బ్రతకాల్సిన ఖర్మ యేమిటో! వాసు సరిగ్గా చెప్పటం లేదు. వెనక యేదో బలమైన గాధ వుంది. మాధవ్ కెందుకో ఒక్కసారి కళ్ళారా ఆ అమ్మాయిని చూడాలనిపిస్తోంది. సంధ్య! ఎంత చక్కని పేరు.

తల వంచుకుని పరధ్యానంగా నడుస్తున్న అతనికి యింతలో ఏదో చిత్రమైన శబ్దం విన్పించింది. అదేమిటో గ్రహించటానికి తలెత్తబోతుండగా ఆవైపునుంచి సుడిగాలిలా పరుగెత్తుకొచ్చిన మనిషి మాధవ్ మీదకి రావటం, అతను తప్పుకుని ప్రక్కకుతొలిగేసరికి ఆ మనిషికూడా తికమకపడి అటే వచ్చి మీద పడి ఆ వూపుకి ఆగలేక యిద్దరూ ఉంగ చుట్టుకువెళ్ళి ప్రక్కపడటం అంతా రెప్పపాటులో జరిగిపోయింది. చూస్తుండగానే కొమ్ములు తిరిగిన

పోట్లు యెద్దు ఒక్కటి బుసలుకొట్టూ అక్కడనుంచి పరుగెత్తింది. హఠాత్తుగా దేవుడిలా వచ్చి ఆ మనిషిమీదపడి ప్రక్కకులాగడంతో సరిపోయింది. లేకపోతే యిదాలాపంగా నడుస్తున్న మాధవ్‌కి ఆ యెద్దువచ్చి గుండెల్లో కుమ్మేవరకూ తెలిసేదికాదు. అతని శరీరం ఝల్లుమంది. మెరపులాంటి ఆ ఆలోచన ముగియగానే తన మీద పడిందెవరో చూసుకున్నాడు. క్షణంసేపు ప్రపంచం ఆగిపోయింది. గాలి స్తంభించిపోయింది. అతని గుండెల మీద అడ్డంగా పడి, షర్ట్‌ని అందినచోట రెండు చేతుల్తో గట్టిగా పట్టుకుని భయంతో అతన్ని కరుచుకుపోయినట్టుయి యింకా కళ్లు మూసుకుని వున్నది అమ్మాయి. కేవలం ఒక అమ్మాయి! మాధవ్ కళ్ళప్పగించుకుని చూస్తూండిపోయాడు.

ఇద్దరిలో ముందుగా తేరుకున్నది ఆ అమ్మాయే. లేచి సరిగ్గా కూర్చుని బట్టలు దులుపుకుంది. అనుకోకుండా జరిగిన యీ సంఘటనకి సిగ్గుతో ప్రాణం పోయినట్టుయి పాపం కళ్ళెత్తి చూడలేక పోతోంది. తల క్రిందికి దిగిపోయింది.

మాధవ్ పరీక్షగా చూశాడు. కోల మొహం, కొసతేలిన ముక్కు, పొడుగరి అని సూచించే శరీరం, యవ్వనంతో పరిపూర్ణంగా వికసించిన అవయవాలు.

'సారీ!' అస్పష్టంగా అంది ఆ అమ్మాయి.

మాధవ్ త్రుళ్ళి పడ్డాడు.

'మీరు—మీరు—వాసు అక్కా?'



ఆ అమ్మాయి చటుక్కున తలెత్తి చూసింది. పై పెదవి మీద పుట్టు మచ్చ కొట్టొచ్చినట్టు కన్పించింది. మాధవ్‌గుండె గతి తప్పింది. అవే సోగ కళ్ళు. అదే ముఖం. వేయి సంవత్సరాల తర్వాతకైనా చూసిన వెంటనే గుర్తు పట్టగల 'మీరు-మీరు-' మాటలు తడబడ్డాయి అతనికి

ఆ అమ్మాయి కూడా కన్నార్ప కుండా చూస్తోంది. ప్రపంచం ఆగిపోయింది, అయినా క్షణాలు గడిచి పోయాయి.

క్రమేపి మాధవ్ పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

క్షణంసేపు భయంగా, విహ్వలంగా చూసిన ఆ అమ్మాయి ముఖం వెంటనే తెల్లగా పాలిపోయింది.

ఎంత మారింది! ఎంత యెదిగింది! అనుకున్నా డతను.

'నువ్వు - నువ్వా ? -' కోపం, అసహ్యం, అవమానం అన్నింటితోనూ ఉక్కిరి బిక్కిరి అవుతున్నా ఆ అమ్మాయి పెదవులు అస్పష్టంగా కదిలాయి.

'ఇంతవరకూ యెప్పుడూ జీవితంలో నేనే అని గుర్తు చేయటానికి యెకడా సిగ్గుపడలేదు, కాని ఈ రోజు యీ క్షణంలో మాత్రం నిజంగా అలా సిగ్గు పడుతున్నాను.' అతనికి తెలియకుండానే అతని కంఠం విచిత్రంగా మారింది

కొద్దిసేపు పిట్టల కలకలం - గాలిలో యీలల చప్పుడూ తప్ప యింకేం విన్పించలేదు మాధవ్‌కి కాలం నిల్చిపోయినట్టే వుంది.

'ఇన్ని సంవత్సరాల తర్వాత మళ్ళీ యిలా కలుసుకోవటం యెంత విచిత్రం!' అన్నాడు.

'ఎంత దురదృష్టం!' కఠినంగా మొన తేలిన అంబులా సూటిగా వచ్చింది సమాధానం.

నవ్వా డతను. ఆ అమ్మాయి చూడలేదు గానీ చూస్తే ఆడవాళ్ళ హృదయాల్లో వేయి వెన్నెలలు, కోటి తీయటి తలపులు రేకెత్తించేంతటి చక్కటి నవ్వది.

'మిమ్మల్ని నేను అవమానించిన మాట నిజమే! కానీ పోట్లాట మొదలు పెట్టింది మీరు అన్న సంగతి మర్చిపోవద్దు. ఇదుగో! కొంచెం తలెత్తి చూస్తే ఆ గుర్తు శాశ్వతంగా నా ముఖం మీద యిప్పటికీ కన్పిస్తుంది. కొద్దిగా గడ్డం పైకెత్తి బుగ్గమీద గీటు వున్నచోటు వేలుపెట్టి చూపించాడు.

'హుఁ!' ముక్కు పుటాలు, పెదవులు రోషంతో అదురుతుండగా విసురుగా అంది.

'మీ రింకా యెక్కువ శిక్షించ

దలుచుకుంటే యిప్పటికీ ఆ అవకాశం వుంది. ఆ ద్రోహి మీ ఎదుటే వున్నాడు.'

క్రిందకి చూస్తున్న ఆ అమ్మాయి చురుగ్గా తలెత్తి చూసింది. తీక్షణంగా, సూటిగా వున్న ఆ చూపులో అంతులేని అసహ్యం, అపుకోలేని వెగటు స్పష్టంగా కన్పిస్తున్నా యెందుకో మాధవ్‌కి ఆ ముఖాన్ని రెండు చేతుల్లోకి తీసుకోవాలనిపించింది. ఈ అమ్మాయి వాసు అక్కా? సంధ్య ఈ అమ్మాయా!? అతని మనసు ఆశ్చర్యాన్నుంచి తేరుకోలేక యింకా వుక్కిరి బిక్కిరి అవుతోంది.

"నిన్న—నిన్న వాసు దగ్గర కొచ్చింది—"

"నేనే!"

"ఎందుకు? యింకా యేం నాశనం చేయాలి—?" ఈసారి ఆ కంఠంలో తడబాటు గాని. వెరపు గాని లేదు.

మాధవ్ తెల్లబోయి వెనక్కు తగ్గినట్టు చూశాడు,

చూస్తుండగానే ఆ అమ్మాయి కళ్ళనిండా నీళ్ళు తిరిగాయి. "నా మొహాన యింకా యేం వ్రాసి పెట్టి వుంది? నే నేం పాపం చేశాను?" అంటూనే చేతుల్లో ముఖం దాచుకుని వెక్కి వెక్కి యేడవ సాగింది.

క్షణం సేపు నిరుత్తరుడైనా, అంతలోనే తేరుకున్న మాధవ్ సంధ్యని తాకాలనిపించింది. దగ్గరగా తీసుకుని నానుంచి నీకేం చెడు జరగదు, భయపడకు అని నచ్చచెప్పి ఓదార్చాలనిపించింది. గతంలో అనుకోకుండా పశువులా ప్రవర్తించిన ఆ సంఘటనకి తర్వాత తర్వాత గుర్తు వచ్చినప్పుడల్లా తనెంత నరకం చూశాడో వివరించాలనుకున్నాడు. కాని యేం చెయ్యలేక పోయాడు. కారణం అంత క్రితం ఆ అమ్మాయి కళ్ళలో తనంటే కన్పించిన అస



చిట్టాడు బళ్ళోచేరిన రోజు. ఓ గంట కూచున్న తరవాత భోరున ఏడ్చేశాడు. మేష్టారు పరామర్శించారు. "పద్నాలుగేళ్ళొచ్చేదాకా ఇలాగే రోజూ ఇక్కడ కూర్చోవాలి కదా అని ఏడుపొచ్చిందండీ" అన్నాడు.

"ఏకేం నాయినా—నాకు అరవై ఏళ్ళ దాకా ఇది తప్పదు కదా" అంటూ కళ్ళంబట నీళ్ళు పెట్టుకున్నాడు మేష్టారు.

హ్యాం నిస్సహాయుడిని చేసి దూరంగా నిలశెట్టోంది. అతని అంతరాత్మ ఆ కాస్తలోనే ఆ అమ్మా యికి అణువణువు అతన్ని యెంత ద్వేషిస్తోందో పసిగట్టేసింది.


మనం అంటే కోపం వున్నవాళ్ళ దగ్గరికి వెళ్ళచ్చు. బెదిరించేవాళ్ళ దగ్గరకి వెళ్ళవచ్చు. ఇష్టంలేదని తెలిసికూడా చేరుకోవాలని ప్రయత్నం చేయవచ్చు కాని అస హ్యాంచుకునే వాళ్ళవైపు అడుగు కూడా వేయలేం. వాళ్ళ యేవగింపు చూసి ఆత్మ ముక్కలు ముక్కలుగా నరికినట్టు బాధపడుతుంది. అందుకే మాధవ్ నిశ్చేష్టుడై నిస్సహాయంగా చూస్తూ కూర్చుండిపోయాడు.

కొద్దిసేపయింతర్వాత ఆ అమ్మాయి తనే యేడుపు నిగ్రహించు కుని కలా నిజమా అన్నట్టు చుట్టూ చూసింది. ఎదురుగుండా మాధవ్ వెనక్కు చేతులు ఆన్చి బొమ్మలా అలాగే కూర్చున్నాడు. సంధ్య లేచి నాలుగడుగులు వేసి వెంటనే హఠా త్తుగా వెనకనుంచి భూతం తరుముకు వస్తున్న దానిలా పారిపోయిండి

మాధవ్ చాలా సేపు అక్కడే శిలలా చలనం లేకుండా కూర్చుండి పోయాడు. అతనికి పూర్తిగా మతి పోయినట్టే వుంది. అతని చూపు నదిలో నీళ్ళమీద, వాటిమీద చిక్కగా అలముకున్న సంధ్యాకాంతి మీద నిల్చిపోయింది. ఈ అమ్మా యిని యిలా కలుసుకోవటం యెంత విచిత్రం! కాని—కాని — ఇదివరకు యెప్పుడు గుర్తుకు వచ్చినా మహా రాజులా, అంతులేని సిరిసంపదల మధ్య, అహంకారంతో, ఠీవిగా అందరిమీద అధికారం చెలాయిస్తూ సుఖంగా వున్నట్టు కళ్ళముందు కదిలేది. కాని, ఆర్థిక పరిస్థితి ఇంత దిగజారి, చివరికి భోజనం కోసం కాయకష్టం చేసుకుంటూ కూరలు పండించుకుంటోందని వూహామాత్రంగా కూడా అనుకో లేకపోయాడు. అవును. ఎలా అను కుంటాడు! జరగబోయే ప్రతిదీ వూహామీద తెలుసుకోగలిగితే ఇక మనిషి అతిశయానికి అహం కారానికి హద్దుంటుందా? అర గంట క్రితం అతనికి కలిగిన మన శ్శాంతి నామరూపాలు లేకుండా నాశనం అయింది.

చాలా పొద్దుపోయిం తర్వాత తిరిగి తిరిగి అలిసిపోయి అతను నీరసంగా యిల్లు చేరుకునేసరికి ఇంటిముందు రెండు కార్లు ఆగి వున్నాయి. ఇల్లంతా సందడిగా వుంది.

(సశేషం)



గిరీశం లెక్చర్లు

డామిట్! కథడ్డం తిరిగిందివాయ్ వెంకటేశం. రాత్రి మీ పాదరింటి కొచ్చేసరికి రెండు ఝాముల్రై వుంటుంది. నువు మాంచి గాఢ నిద్రలో వున్నావు. ఇవాళ మంచిరోజుగదా యలాగయినా మన బైస్కోపు సంగతి తేల్చేద్దావని, ఆయనతో ఇంకా ఖాంచెయ్యలేదూ తమకోసవే కూర్చున్నానూ అవటాన్జెప్పి రెండో విడత ఆవకాయా పొడి మెతుకులూ మింగడానికి వడిగట్టాను. ఆయన బంతినకూచుంటే, నేచ్చుక్క గట్టిగావిదపడానిగ్గాని, పెరుగుబిళ్ళ వెయ్యడానిగ్గాని అత్తగారికి సొతంత్రం లేదుగదా. ఇహ నా దురవస్థ చెప్పేదేవుంది. మీ నాన్నకోపంలా, మీ అక్క హృదయంలా, 'కావాలనుకున్న' ప్రధాని మనసులా, ధరలలా, గిట్టనివాళ్ళ మధ్య పచ్చగడ్డిలా అజ్జెం చాల్కి ఆవకాయదెబ్బకి నోరు భగ్గుమంది. అలాగే అనురుమ్సరంటూ సబ్జెక్టు కదలేసి ఇలా బైస్కోపు తియ్యడానికి పది వేలొందలు చాలూ మిగతా నాలుగు లక్షలూ డిస్ట్రిబ్యూటర్ దాఖలు చేసుకుంటాడు - ఏతావాతా మన కేవిటయ్యా ఎక్స్ట్రా ప్రాఫిటూ అనగా-మన వెంకటేశానికి తంగున హీరో వేషం వచ్చేస్తుందీ అన్నాను. ఏదీ అబ్బిగాడికా వాడి బొంద అన్నాడాయన—యంత మాటూ. కన్న తండ్రులు గాబట్టి తవరి దృష్టికి అబ్బిగాడే కావచ్చు కాని అస్మదాదులకూ ముజ్జగాలకూ వాడు ఫ్యూచర్ హీరో-రాబర్టెయిలరూ, చార్లెస్ లాటనూ, గ్రీరు గార్సనూను వాడు రేపు లక్ష లార్జిస్తాడూ అంటూ ధోరణి ఫోర్తుగేరుకి ఎక్కించేసరికి — ఛీఛీ వంటింటోనూ తిండి దగ్గరా

కూడా ఈ పాడు ఇంగ్లీషు కూతలేనా అంటూ ఛ్రుమన్నాడు నేను తగ్గి మళ్ళా "పదిహేను వందల" పల్లవి కొచ్చాను. ఈ శషభిష లెం కుదరవూ మా యింటా వంటా లేవీ బయసొక్కవులు, ఆబ్బిగాడు లక్ష లార్జించినా మాన్నా. నా దగ్గిర మాత్రం ఇంత గరళమ్మింగడాని క్కూడా ఏగాని డబ్బు లేదూ అన్నాడు. అంతటు... పాపం ...... మీ సిస్టర్—దట్ పూర్ బ్యూటిఫుల్ యంగ్‌విడో బుచ్చమ్మ చల్లగిన్ని తెచ్చక్కడ పెడుతూ, పోనీ నన్నమ్మిన పర్ఘునివిఁది వందల్లోంచీ ఇవ్వ రాదా అందోయ్. అంతే. మీ ఫాదరు వీరభద్రుడైపోయి చల్ల తప్పేళా నమాంతం ఆమె నెత్తిన బోర్లించి లేచక్కాపోయాడు. దేర్‌గోన్ అవర్ సినీ ప్రాజెక్ట్ అనుకుని విస్తట్లోది కానిచ్చి చెయి గడుక్కున్నా న్నేను. తెల్లవార్లూ నిద్దర్లేదనుకో. సరే రాబర్టు బ్రూసంతవాడు ఏడుసార్లు సాలెగూడు కట్టాడూ మనవెంతా అనుకుని—నాకు హాండెస్ట్ మహాలావులే—ఉదయవేఁ మరో ఎస్సాల్ట్‌కి సిద్ధపడ్డాను. శాస్త్రుకారు దేవన్నాడూ ఇట్నించి కాపోతే అట్నించి నరుక్కురా అన్నాడు.

అందుకని సినిమా వదిలేసి నాటకాలకని చెప్పో తస్సావేస్తే-దాన్నిగదరగ ఫిఫ్టీన్ డేన్ సిగార్స్‌కి జరుగుబాటూ సందర్భపడదా అనుకుని, పొద్దుటే మీ ఫాదరరుగుమీద కూచుని దంతధావనం చేస్తూ వుండగా — "కావ్యేషు నాటకం రమ్యమ్" అన్నాను జనాంతికంగా ... పర గడుపునే సవుఁస్కృతమ్ముక్క కక్కేసరికి ముసలాడు బుర్ర తంగున తిప్పి, మీకు దేవ భాషలో కూడా ప్రవేశ ఉందా యేవిషీ అన్నాడు. నేను పకాలున నవ్వి—ప్రవేశవేఁవిటి స్వామీ భాస భవ భూతి కాళిదాసాదుల నాటకాలు యావత్తున్నూ పర్ఘునిమిదో యేటికే భట్టీ పం వేసినవాణ్ణి, అంతటితో ఆక్కుండా ఆ సకలాన్నీ ఆంగ్ల భాషలోకి డబల్‌యు షేక్స్ పియర్ అను కలం పేరుతో తర్జుమాయించి, అచ్చొత్తించాను—కావలిస్తే చూసుకోండి అంటూ అరుగుమీద సంసిద్ధముగా ఉంచుకున్నట్టి రెండు ఋక్కులు ముందుకు నెట్టేశాను. ముసలాడు దంగయిపోయాడంటే నమ్ము. ఇదే ఛాన్సని పుంజుకుని, ప్రస్తుతం తెలగులో సాంఘిక నాటక రాజమొకటి రచించి, పరిషత్తు క్కట్టిస్తానని, అందులో అబ్బిగాడిచేత వేషం కట్టిస్తివాఁ అటు ఆ యొక్క స్క్రిప్టుని, అబ్బిగాణ్ణి కూడా సినిమా వారు ఎగరేసుకుపోతారనీ, ఆశ చూపించాను.

లెక్చరంతా విన్నాక ఇంతకీ ఏవిషంభారూ అన్నాడు అనుమానంతో — మరేం లేదు ముందు నాటకం వ్రాయడానికో అడ్వాన్సు ఫుల్

స్కేవు తావులూ, ఆపైన రిహార్సళ్ళకి సాదరు ఖర్చులూ - అంటూ ఆరంభించేసరికి—శివాలెత్తినట్టూ లేచిపోయాడోయ్.

నువ్వేదో బుద్ధిమంతుడి వనుకున్నాను. ఇదా నువ్వు చేసేపని, నాటకం రాయాలనుకుంటే లక్షణంగా ఓ తాడి చెట్టూ ఆకు దింపిస్తాను మా తాతగారి ఘంటం వుంది రాసుకో కుగ్రాడిచేత భట్టీయం వేయించు అంతేదవ్వ కోర్టక్లర్కులకు వాడుకునే తెల్ల కాయితాల్నిలా తగలేస్తావా అంటూ తగులుకున్నాడోయ్. మైగాడ్ హౌ బార్బేరియన్. తాటాకుల మీద రాయాల్ట. కళాపోషణిలా అఘోరిస్తూ వుంటే—ఇక నాటకాలూ సినిమాలూ ఎలా బాగుపడేడుస్తాయని—మాటాడవేం?

...అహఁ. వద్దొద్దు...నువ్వలా సైలెంట్‌గానే కూర్చో. వదినగారు భావిలో నీళ్ళు తోడుతున్నారు. మార్నింగ్ బ్యూటీని వక పక్క స్టడీచేస్తూ నీకు నాటకశాస్త్ర రహస్యం వుపదేశిస్తాను...ఆహా...ఓహో... చూశావుటోయ్. మా సిస్టర్ అలా భావిలో చేదవేసి—లోకంలో నాకు చీకూ చింతా లేదూ అన్న భంగిమలో నీరు తోడుతూందేగాని—ఆవిడలోని అగ్ని పర్వతాలను—క్షణంక్రితం భావిలో పడిన ఆ యొక్క మంచి ముత్యవంటి కన్నీటిబొట్టు వెల్లడి చేసిందోయ్. ఆహా...దట్ మైడియర్ వెంకటేశం—ఈజ్ డ్రామా ... చూసేందుకు కళ్ళుంటే సృష్టంతా డ్రామావే కదుటోయ్. అడివిగాచిన. వెన్నెలనీ, ఎడారిలో పన్నీటిని ఆ కన్నీరు స్ఫురింప చేస్తోంది...ఆవిడ భావిలోంచి తోడేది నీరుటోయ్! యంతమాత్రం కాదు—అది భూమాత కన్నీరు. లోకంలోని యంగ్ విడోస్ గురించి—ముఖ్యంగా శాపవశాత్తు ఈ అగ్గురారం చాదస్తు డింట పడిన దేవకన్యవంటి బుచ్చమ్మ గురించి భూదేవి దుఃఖించి రాల్చిన కన్నీళ్ళోయ్ ఆ భావిలోవి. అదుగో ఆ చెట్టుమీద పిట్టల జంట ఏమ్మాటాడుకుంటోంది తెలుసా...ఓ పిల్లా—నీకేం భయంలేదు. అదిగో ఆ భావి దగ్గర చిన్నది కూడా నీ లాటి యంగ్ విడోవే. నేడో రేపో—చదువు సంస్కారంగల ఒక సహాయుకుడితో వెళ్ళిపోతోంది, నువ్వు కూడా నాతో వచ్చెయ్యి అంటూంది.

ఆఁ? ఏమిటున్నారూ వదినా—పిట్టల్లోకూడా వితంతువు లుంటాయ్యా అంటున్నారా! యంతమాట. ఆదికవి వాల్మీకి వ్రాసిన ఆదికావ్యం రామాయణంలో కథారంభం ఇదే కదండీ - బోయవాడు క్రౌంచపక్షుల మిథునంలో మొగదాన్ని కొట్టి చంపగానే ఆయన "మానిషాద!" ఓరి కిరాతకుడా ఎంత పని చేశావు—ఇప్పుడు వితంతువయిన ఆ యంగ్ విడో గతేమిటి అంటూ

శోకించి శ్లోకించాడు. మన మొదటి గ్రంథమే – విడో రిమారియేజ్‌తో స్టార్టయింది, అయనంతగా ఘోషించినా ఆ పక్షి మీలాగే చాదస్తం కొద్దీ రెండో పెళ్ళికి ఒప్పుకోలేదు. అందుకే తరువాతి కథలో అయన ఆ కథ గురించి ఎక్కడా రాయలేదు. అందువల్ల—

...ఏమిటీ, ఇలాటి విషయాలు వినడం మీకు సయించదా ...ఘూశావా వెంకటేశం...దిస్ అగెయిన్ ఈజ్ డ్రామా — నోరు నవ్వితే, నొసలు వెక్కిరించిందన్నట్టూ – ఆవిడ అనేదివేరు అనుకునేది వెరు... షేక్స్పియర్ ఊరికే అన్నాడటోయ్.

అల్ ది వాల్డిజె స్టేజనీ—ప్రపంచమే ఒక నాటకరంగము. అవిడ వెళ్ళిపోయింది కాబట్టి ఇక నీకు అనర్గళంగా నాటకాలమీద లెక్చరిస్తాను నోటుబుక్కు తీసుకో— నాటకాలు లక్షవెరైటీస్ ఒకటి సంస్కృత నాటకాలు...మనం గొప్ప చెప్పుకునేందుకేతప్ప చదువుకుందికని రాసినవి కావు, ఒక ముక్కకూడా అర్థంకాదు. రెండు సీమనాటకాలు అనగా ఇంగ్లిషు, ఫ్రెంచి, ఇటాలియన్, జర్మన్ వగైరా దొరల భాషవి. ఇవి చదివి ఇన్స్పైయిర్ కావడానికి—అనగా చెక్కేయ్యడానికి. ముఖ్యంగా తెలుగువాళ్ళ కోసం రాసినవి.

వీటిలో పరిషన్నాటకాలు, రేడియో నాటకాలు, రూపకాలు, సినిమాలు వగయిరాలు.

ఇవికాక సినిమా స్క్రిప్టుల్లా ముందేమీ రాసుకోకుండా—అక్కడి కక్కడ మాటలనుకుని ఆడేవి, వీటిలో ఎలక్షన్ నాటకాలు, కలక్షన్నాటకాలు, కంట్రాక్టు నాటకాలు (మువ్వనుకునేవి కావు. రోడ్లు, వంతెనలు, ప్రాజెక్టులు, అఫీసులు, ఆస్పత్రులుకట్టే కంట్రాక్టు నాటకాలే) సాహిత్య సంగీత నాటక పరిషన్నాటకాలు, ఉద్యోగ విజయాలు (నువ్వనుకునే తిరుపతి వెంకట కవులవి కావు ఇవి వేరు...)

... ఓయ్ చోటయిపోయింది. భావాలు క్రిక్కిరిసి పోతున్నాయి... ఇవాళ్టికి లెక్చరాపి నీలాటి రెవుకెళ్ళి ఎనాటమీ—అనగా సుందర శరీర శాస్త్రం...స్టడీ చేదాంగాని అమ్మనడిగి ఓపావళాపత్రూ సిగార్సుకుంటుంది.

[వచ్చేనెల నాటకాలపై]

సినిమా

"మొనగాళ్ళకు మొనగాడు"

మోడర్న్ థియేటర్స్ వారి మోడర్న్ చిత్రం "మొనగాళ్ళకు మొనగాడు."

కరుణ కాఠిన్యాలు రంగరించబడిన కత్తుల రత్తయ్య భూమికను ఎస్. వి. రంగారావు ధరించారు. అతడే విలను, అతడే హీరో. ప్రధాన భూమికలో కూడా ఓ నవీనత వున్నదన్నమాట.


కత్తుల రత్తయ్య పచ్చి నెత్తురు తాగే రౌడీ, త్రాగుబోతూ, హంతకుడూ, గజదొంగా అయినా, మాట అన్నాడూ అంటే మంచికైనా చెడుకైనా దానికి నిలబడేవాడు: అందుకోసం నిలువునా ప్రాణమైనా తీయగలడు, తన నిండు ప్రాణమైనా ఈయగలడు.



"లోగుట్టు పెరుమాళ్ళకెరుక" లో శోభన్‌బాబు, గీతాంజలి

రౌడీ రత్తయ్యను, ప్రత్యర్థి దొంగలముఠా చితుకగొట్టి పారిపోతే గీత (కృష్ణకుమారి) అనే 'కారుకన్య' కాపాడి కాఫీయిచ్చింది. ఆమె ప్రేమించిన రమేష్(హరనాథ్) ఐదు లక్షల రూపాయల అపహరణ నేరంలో అన్యాయంగా చిక్కుకొని అజ్ఞాతవాసం గడుపుతున్నాడు. ఆ [illegible]చేందుకే ఈ రత్తయ్య కళ్ళల్లో వొత్తులు పెట్టుకొని గాలిస్తున్నాడు. గీతతోకే ప్రేమగీతిక ఆలాపిస్తున్న రమేష్‌ను రత్తయ్య చూచాడు. రక్తదాహం కోరాడు.

అలనాడు కాఫీతో దాహంతీర్చిన గీత రత్తయ్యను నిలతీసి అడిగింది 'రక్తదాహం' తగునా అని. ఆనాడు రత్తయ్య గాయాలను తుడిచిన తన చేరుమాలు రక్తం చూపింది. రమేష్‌పై నగదు అపహరణ నేరం మాఫీ చేయించి, అసలు దొంగను ప్రభుత్వానికి పట్టి యివ్వవలసిందని, రక్తంకంటె 'కాఫీ' చిక్కన అని అనిపించుకొన్నది. 'మంచో, చెడో



చెల్లీ, నా మాట నిలబెట్టుతాను. నీ రమేష్‌ను కాపాడుతాను. దొంగలను పట్టి యిస్తాను. మొనగాళ్ళకు మొనగాడు అని నిరూపించుకొంటాను" అని రత్తయ్య శపథం చేశాడు. శపథమైతే చేశాడుకాని, ఆ తర్వాత అతని 'పథ'మంతా అస్తవ్యస్తంగానే వున్నది. తమ ప్రాణాలు కాపాడుతాడన్న రత్తయ్య తమ ప్రాణాలే తీస్తాడని రమేష్, గీత అనుమానించారు తిరగబడ్డారు.

మాటా నిలపాలి. ముప్పూ దాటాలి. ఎలా? అలా చెయ్య కలిగినవాడే మొనగాళ్ళకు మొనగాడు. అలా చేసినవాడే కత్తుల రత్తయ్య—కాదు. ఎస్. వి. రంగారావు. చిత్రం చూస్తున్నంత సేపు (హాలులో) రత్తయ్యే కనిపిస్తాడు. హాలు దాటితే మనఃపథంలో రంగారావే కనిపిస్తాడు. రంగారావు నటనలో అంతటి రక్తి శక్తి వుంది. ఆయన నటన 'మోడర్న్'!

రత్తయ్య చుట్టూ వున్న పాత్రలలో టాక్సీ డ్రయివర్ ఓనర్‌గా చలం, రమేష్‌గా హరనాథ్, గీత తండ్రిగా రావికొండలరావు, జోడీగాడి వెంటపడిన వ్యక్తిగా బాలయ్య నటన ఆ వరుసలో రక్తి కట్టింది. కృష్ణకుమారి, డాక్టర్ ప్రభాకరరెడ్డి, రత్న, గెస్టు హెూదాలో సావిత్రి మొదలైనవారు కూడా ఈ చిత్రంలో నటించారు.

పినిశెట్టి సంభాషణలు చలం పాత్రకు బాగా అమరిన వి. ఎస్. ఎస్. లాల్ ఛాయాగ్రహణం - ఔట్‌డోర్‌లో రాత్రి దృశ్యాలు తప్పిస్తే-నేత్రానందకరంగా వున్నది.

ఎన్నో మెలికల కథ. దానికి తగ్గట్టు రీలు రీలుకు కొత్త పాత్రో, కొత్త పరిణామమో వస్తూంటుంది. కథ అంతా, ఆ మాటకువస్తే 17 రీళ్ళ చిత్రమంతా ఒక్క నలుసంత లంకెను పట్టుకొని వున్నది. అది రత్తయ్య ఎవరు? అన్నది. ఆ లంకెను చివరివరకు బైటపెట్టక, బైటపెట్టిన మీదగతమంతా ఎంత సహజం అని అనిపించేటట్లు చిత్రంరూపొందించడం ఒక 'ఫీట్'. దానిని చెయ్యవలసింది దర్శకుడు. చేసింది. సమర్థంగా నిర్వహించింది ఎన్. డి. లాల్.

ఈ చిత్రం సంగీత దర్శకుడు వేదా. నిర్మాత ఆర్: సుందరం.

సౌగంధిక తెచ్చిన సమరం

జనవరిలో ఎక్కువ షూటింగ్ జరిగిన చిత్రాలలో ఒకటి మహాలక్ష్మి ప్రొడక్షన్స్‌వారి 'భీమాంజనేయయుద్ధం'

భీముడు (దండమూడి రాజగోపాల్) సౌగంధిక పుష్పములను ద్రౌపదికోసం కోసి తెచ్చి పూలసజలో పట్టుకు వెడుతూ వుంటే సజ్జ గంధర్వ లోకంనుంచి పడిపోవడం, భూలోకంలో ఆ సౌగంధిక పుష్పాలు ఒక్కటొక్కటిగా పడివుంటే వాటినిబట్టి భీముడు రావడం, తుదకు ఒక ఆశ్రమం వద్ద సౌదామిని చేతిలో ముఖ్య పుష్పం

చూచి దానిని తన కిచ్చివేయమని భీముడు గద్దించడం మద్రాసు ఫిలిం సెంటర్‌లో షూట్ చేశారు. అలా అరచినట్లయితే చేరువలో వున్న హనుమంతునికి తపోభంగం జరుగుతుందని సౌదామిని (రాజశ్రీ) హెచ్చరిస్తుంది. ప్రతి కోతిని ఆంజనేయుడుగా పూజించే అమితభక్తిని అతడు ఉపసడిస్తాడు

సౌగంధిక పుష్పం కారణంగా భీమునికి, అంజనేయునికి (కామినేని ఈశ్వరరావు) పోరాటం జరుగుతుంది. అదేదో మామూలు కోతి అన్న ఉద్దేశంతో వున్న భీముడు తనున్ క్షత్రియుడు కాబట్టి క్షమాపణ కోరనని, వాలముతోకాక కరవాలముతో యుద్ధము చెయ్యవలెనని అంటాడు. ఆంజనేయుడు తోకతో భీముని ఆపాదమస్తకము చుట్టు చుట్టి తానెవరైనదీ తెలువుతాడు. అంతవరకు—ఇద్దరు పహిల్వానుల (రాజగోపాల్, ఈశ్వరరావు) మధ్య వారి వారి కండలు బాగా కనిపించగల పోజులలో ద్వంద్వ యుద్ధం చిత్రీకరించారు. మాధవపెద్ది సత్యం, ఘంటసాల వెంకటేశ్వరరావు పాడిన పాటలను పై వారిపై చిత్రీకరించారు.

ఈ సన్నివేశములు కాక పాండవ వనవాస దృశ్యము (ఈ సీనుతోనే చిత్రం ప్రారంభమౌతుంది), భీమ ఘటోత్కచ సంవాదము కూడా చిత్రీకరంచారు. సత్యనారాయణ ఘటోత్కచుడు. దర్శకుడు: ఎన్ డి. లాల్, నిర్మాత: టి. ఆర్ కోటేశ్వరరావు, విడుదల: ఉగాది ప్రాంతాల.



"దైవమిచ్చిన బిడ్డలో"లో జమున

"ఆత్మగౌరవం" రీ రికార్డింగ్

అన్నపూర్ణా పిక్చర్స్‌వారి 'ఆత్మగౌరవం' డిసెంబర్ మాసాంతంలో సెన్సార్ అయి రీ రికార్డింగ్ దశలో పడింది. ఫిబ్రవరిలో విడుదల కాగల ఈ చిత్రానికి దర్శకుడు: కె. విశ్వనాథ్, నిర్మాత: డి. మధుసూదనరావు. నాగేశ్వరరావు, కాంచన, రాజశ్రీ, రేలంగి, రమణారెడ్డి, గుమ్మడి, చలం, సూర్యకాంతం తారాగణంలో కలరు. సంగీత దర్శకుడు: ఎస్. రాజేశ్వరరావు.

చలన చిత్ర వార్తలు

ఖడ్గతిక్కనగా నాగేశ్వరరావు

కమలా ఫిలిమ్సువారు నాగేశ్వరరావుతో "ఖడ్గ తిక్కన" నిర్మిస్తున్నారు. జనవరి మధ్యలో పాటల రికార్డింగ్‌తో తొలి దశ ప్రారంభమైంది. ఎస్. వి. రంగారావుకూడా ఇందులో ఒక ముఖ్య భూమిక ధరించబోతున్నారు దర్శకుడు, రామినీడు. నిర్మాత. పి జాన్ సంగీతం పూర్ణచంద్రరావు, రచన ఆరుద్ర.

"నవరాత్రి" షూటింగ్

విజయ చాముండేశ్వరీ ప్రొడక్షన్స్‌వారి "నవరాత్రి" ఔట్ డోర్ షూటింగ్ జనవరి మొదటి వారంలో నాగేశ్వరరావుతో నెల్లూరు ప్రాంతంలో కొంత సాగింది. డిసెంబర్ 20న శ్రీ సారధి స్టూడియోస్‌లో మొదటి షూటింగ్ షెడ్యూల్ ప్రారంభమైంది. ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్‌వారి సహాయంతో ఈ నవరస చిత్రానికి తాతినేని రామారావు తొలుత దర్శకత్వం వహిస్తున్నారు. పి. ఏ. పి సంప్రదాయం ప్రకారం ఆ సంస్థలోని అసోసియేట్ డైరెక్టర్ అసలు డైరెక్టర్ అవుతారు. ఆ సంస్థ డైరెక్టర్‌లు తాతినేని ప్రకాశరావు, కె. ప్రత్యగాత్మలకు సహాయకునిగా వున్నరామారావు కపిలేశ్వరపురంలో 1938 లో జన్మించారు. ఏలూరు కాలేజి విద్య పూర్తిచేసి 1958 లో మద్రాసు వచ్చారు. పి. ఏ. పి సంస్థ అధిపతి ఏ. వి. సుబ్బారావు ప్రోత్సాహ ప్రోద్బలాలపై షి విజ్ఞాన మార్జించి నాగేశ్వరరావు

"భక్తపోతన"లో పోతనగా గుమ్మడి, శ్రీనాధుడుగా రంగారావు



తొమ్మిది భూమికలు ధరించే చిత్రానికే దర్శకత్వం వహిస్తున్నారు.

చిత్ర నిర్మాణంలో 'సెట్' దశ ప్రారంభం కావడానికి ముందే స్క్రిప్టు, షూటింగ్ స్క్రిప్టు సర్వ సమగ్రంగా సిద్ధం చేసుకొని వుండడం చాలా అవసరమని ఆయన నిశ్చితాభిప్రాయం. అయితే 'సెట్' మీద ఒక్కొక్కరికి మంచి మంచి ఊహలు రావచ్చునని, అవి సినిమాకు మేలు చేసేవి అయితే ఒరిజినల్ స్క్రిప్టును అప్పటికప్పుడు సవరించ వచ్చునని, అది మంచేకాని చెడు కాదని ఆయన నిశ్చితాభిప్రాయం

ఇప్పటి ఆంధ్ర దర్శకులలో బహుశా ఈ 27 ఏళ్ళ యువకుడే చిన్న వయస్కుడు.

ఓర్పు, నేర్పు, శ్రమ, వినయము, విజ్ఞానకాంక్ష ఈ యువకునికి సినీరంగంలో ఉజ్జ్వల భవిష్యత్తు చూపవచ్చు.

ఈ యూనిట్ ఇతర వివరమిది: పెల్వరాజ్, తాతినేని చలపతిరావు, ముళ్ళపూడి వెంకట రమణ, పసుమర్తి, జి. వి. సుబ్బారావు, దాశరథి, కొసరాజు, సావిత్రి, గుమ్మడి, రేలంగి, రమణారెడ్డి, జగ్గయ్య.

వచ్చే మార్చి ప్రాంతాలకే చిత్రం సిద్ధం చెయ్యాలని నిర్మాత ఏ. వి. సుబ్బారావు సంకల్పం.

వరూధిని, ప్రవరాఖ్య నృత్య కథనం

శ్రీ శంభూ ఫిలిమ్స్ వారు నవ తేజముతో నవపథమున మన జాతిని నడిపిన తొలి చక్రవర్తి 'శ్రీకాకుళ ఆంధ్ర మహా విష్ణుకథ'ను ఉగాదికి సర్వసిద్ధం చేసేందుకు సమస్త కృషి చేస్తున్నారు. వరూధిని, ప్రవరాఖ్యుల గాథకు నృత్య రూపమిచ్చి అమధ్య చిత్రీకరించారు. ఆ రెండు భూమికలను ఎల్. విజయలక్ష్మి ధరించింది. 14 సంవత్సరాల పాటు పరిశీలనలు, పరిశోధనలు జరిపి చారిత్రక, పౌరాణిక, జానపదాంశాలనేకాక సమకాలిక దుర్లక్షణాలను ఆ చిత్రంలో కలిపి పింగళి నాగేంద్రరావు చొప్పించినట్లు తెలుస్తున్నది. రామారావు, ఎస్. వి. రంగారావు, ముదిగొండ లింగమూర్తి, బాలయ్య, రేలంగి, జమున, విజయలక్ష్మి, గిరిజ ఛాయాదేవి మొదలైనవారు తారాగణంలో వున్నారు సంగీతం: పెండ్యాల, దర్శకత్వం: ఏ. పి శేఖర్, నిర్మాత: దగ్గుబాటి లక్ష్మీనారాయణ చౌదరి.

సెట్లపై తిరిగి "శ్రీ"

అరుణాచల పిక్చర్స్‌వారి 'శ్రీ' జనవరిలో తిరిగి సెట్ దర్శనం చేసుకొన్నది. అరుణాచల స్టుడియోస్‌లో పల్లెపిల్లగా వున్న నాయికతో (దేవిక) నాయకుని (రామారావు) తొలి పరిచయ సన్నివేశం

చిత్రం తీసివేస్తున్నారు. అవి ఎంతో సహజంగా వుంటున్నాయి'

సత్యజిత్ రాయ్ 'అపూర్ సన్సార్' చూడండి.

రైల్వే లైనులపక్క రైల్వే కాలనీలో రైల్వే జన్ల కూతలమధ్య జీవితం సాగించే బ్రహ్మచారి హీరో అనుకోకుండా పెండ్లి మీద పడింది. మొకటి రాత్రి అయినా ఆ రైల్వే వాతావరణం నుంచి బైటపడలేదు. కాని తన భార్య సిగపిన్ను తన దుస్తుకు తగిలివుండటం చూచి మళ్ళీ దాంపత్య జీవితంలో పడతాడు. బెంగాలీవారు ఒక వాతావరణం సృష్టించ కలుగుతున్నారు ఒక సంఘర్షణ కల్పించ కలుగుతున్నారు దానికి అలంబనగా అనేక సన్నివేశాలు అల్ల కలుగుతున్నారు.

'చారులత'లో భార్యాభర్తల మధ్య 'దూరానికి' ఉభయులూ కారకులే పరిస్థితులూ కారణమే.

'మహానగర'లో ఉద్యోగం చేయవలసి వచ్చిన నాయిక స్థితి చూడండి ఇటు కుటుంబం — దాని పరిమిత మానసిక ప్రయాణం. అటు నలుగురితో నీటుగా నాజూకుగా సంచరించవలసిన ఉద్యోగం. దాని అపరిమిత మానసిక ప్రయాణం.

కథలో సంఘర్షణలు వుండాలి వాటితో కొట్టుకొంటున్న పాత్రల స్థితి ప్రేక్షకుల హృదయాలను కదలించాలి, కరగించాలి. అప్పుడే చిత్రం రక్తి కట్టుతుంది. అప్పుడే దర్శకుని ప్రతిభ వ్యక్తమౌతుంది.

1931 మే ఎనిమిదవ తేదీన చల్లపల్లిలో జన్మించిన ఎస్. డి. లాల్ బొంబాయిలోని ఫజుల్ బాయ్ ఫిలి ఇన్‌స్టిట్యూట్‌లో సినిమటోగ్రఫీ కోర్సు చదివారు.

సినిమటోగ్రఫీలోనే కాక లేరేటరి, ఎడిటింగ్ మొదలైన శాఖలలో కూడా తర్ఫీదు పొందిన



దేవి చిత్రాలయ వారి
'లక్ష్మీనారాయణ' చిత్రంలో
పార్వతిగా నూతన నటి విజయశ్రీ

ఎన్. డి. లాల్‌కు మొదట ఉద్యోగం 'లాబ్ టెక్నిషియను'గా లభించింది.

మద్రాస్‌లో సౌందరరాజన్ టి. ఎన్. టి. లాబరేటరీస్‌లో లాల్‌ను అసిస్టెంట్‌గా తీసుకొన్నారు. తర్వాత ఎడిటర్ మాణిక్యంవద్ద ఎడిటింగ్‌లో అసిస్టెంట్ అయినారు. ఆ పిమ్మట ఎల్. వి. ప్రసాద్ 'సంసారం'లో రహ్మాన్ కెమెరా డిపార్టుమెంటులో లాల్ అసిస్టెంట్‌గా వున్నప్పుడు తీరిక సమయాలలో హాలీవుడ్ చిత్రాలపై లాల్ దంచేస్తున్న ప్రసంగాలు విన్న ఎల్. వి. ప్రసాద్, ముగ్ధుడై 'నువ్వు వుండవలసింది కెమెరా డిపార్టుమెంటు కాదు. డైరెక్టోరియల్ డిపార్టుమెంటుకురా' అని లాక్కొని వెళ్ళారు.

తదాది దర్శకత్వ శాఖలో అసిస్టెంట్‌గా, అసోసియేట్‌గా వుంటూ స్క్రిప్టు డిపార్టుమెంటుకు ఒక నిధిగా (ఎస్సెట్) పేరు పొందారు.

1957–58 లలో సేలం మోడరన్ థియేటర్స్ నిర్మించిన మూడు తమిళ చిత్రాలకు లాల్ అసోసియేట్ దర్శకుడు. అందులో ఒకటి ఆదుర్తి సుబ్బారావు డైరెక్టు చేసిన 'ఎంగళ కులదైవం'. 1959–60 లో మోడరన్ థియేటర్స్‌వారు లాల్‌కు దర్శకత్వ బాధ్యత అప్పగించారు. 'అపూర్వ చింతామణి' తెలుగు చిత్రాన్ని లాల్ డైరెక్టు చేశారు. దేవికకు ఆ చిత్రం పునర్జన్మ వంటిది. ఆ పిమ్మట బొంబాయి, కలకత్తాలలో లాల్ కొంత కాలం గడిపి విఠలాచార్య పిలుపుపై మద్రాసు వచ్చి 'బందిపోటు' నుంచి 'జ్వాలా ద్వీప రహస్యం' వరకు వారితో కలసి 'కో డైరెక్టర్'గా వున్నారు.

ఆంధ్ర కోయవాళ్ళపై చిత్రం

శ్రీ లాల్ జర్మన్ డైరెక్టర్ పాల్ జిల్స్ వద్దచేరి ఉదకమండలంలోని తోడా జాతివారిపై ఒక డాక్యుమెంటరి చిత్రం తీశారు.

కొత్తగూడెం, భద్రాచలం చేరువ ప్రాంతాలకు వెళ్ళి, దాదాపు 37 మైళ్ళు నడచి కోయవాళ్ళ జీవితంపై ఒక డాక్యుమెంటరీ చిత్రం పాల్‌జిల్స్, లాల్ తీశారు. అప్పటి నుంచే ఎంకిపాటలపై కలర్ చిత్రం తీయాలన్న సంకల్పం లాల్‌కు కలిగింది.

• • •

రానున్న రంగారావు

పాత్రల రంగులు

శంభూ ఫిలిమ్స్‌వారి 'శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు కథలో' రంగారావు అపూర్వాభినయం చేశారు. ఆ భూమికను శ్రీ పింగళి నాగేంద్రరావు ఎన్నో క్రొత్త దనాలతో రూపొందించారు. ఎన్. డి. లాల్ డైరెక్టు చెయ్యనున్న 'మేజర్ చంద్రకాంత్'లో రంగారావు అంధుడైన మేజర్‌గా నటించబోతున్నారు. 'భక్త పోతన'లో శ్రీనాధుడూ రంగారావే

□□□

Edited and Published by V. V. Raghavaiah
and Printed by him at Jyothi Press
Congress Office Road, Governorpet, Vijayawada-2.